అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సోమవారం 24-03-2025
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 11 | సంచిక : 82 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేయాలి

లేదంటే రైతుల భూములను వెనక్కి తీసుకుంటాం

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

ప్రజా సమస్యలను పరిష్కరించి ఇచ్చిన హామీలను అమలు చేయాలి : జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

రామన్నపేటలో ప్రజా సమస్యలపై పాదయాత్ర ప్రారంభం

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయప్రతినిధి

ప్రజా సమస్యలు పరిష్కరించి ఇచ్చిన హామీలను అమలుచేయాలని, డ్రైపోర్ట్ పేరుతో రైతులను మోసగించి 350 ఎకరాలను కొనుగోలు చేసిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని నిలిపివేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో 'మండల సమగ్రాభివద్ధి-ప్రజా సమస్యల పరిష్కారం'కై ఆరు రోజుల పాటు చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్రను ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కొమ్మాయిగూడెంలో ఆయన ప్రారంభించారు. అనంతరం కొమ్మాయిగూడెం-రామన్నపేట శివారులోని అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని పాదయాత్ర బృంద సభ్యులతో కలిసి సందర్శించి నిరసన తెలిపారు. అంతకుముందు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. గతేడాది నుంచి గ్రామాల్లో పంచాయతీ పాలకవర్గాలు లేక ప్రజా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని అన్నారు. ఎన్నికలు జరపకపోవడంతో గ్రామాలకు నిధులు ...13లో

పోరాట యోధుడు భగత్ సింగ్

ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలి

దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం

బీజేపీ మతోన్మాద విధానాలు దేశానికి ప్రమాదకరం: సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

వివరాలు 3లో



గాజాలో ఆగని మృత్యుఘోష..

50వేలు దాటిన మరణాలు

కాల్పుల విరమణ తర్వాత ఇజ్రాయిల్ బరితెగింపు

గాజా: ఇజ్రాయిల్-హమాస్ యుద్ధంలో ఇప్పటివరకు 50వేల మంది పాలస్తీనీయన్లు ప్రాణాలు కోల్పోయినట్టు గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. మరో 1.13లక్షల మంది గాయపడినట్టు తెలిపింది. అయితే గాజాలో మరణాల సంఖ్య కన్నా..అనధికారికంగా భారీగా ఉంటుందని పౌరసమాజం అంటోంది. ఇటీవల కాల్పుల విరమణ ముగిసిన తర్వాత వారం వ్యవధిలోనే మళ్లీ దాడులు ...13లో

మీ ఆశయసాధనకు కృషి చేస్తాం



భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు సీపీఐ(ఎం) నేతల ఘన నివాళి

హరికిషన్ సింగ్ సుర్జీత్ 13లో జయంతి

అర్థవంతమైన చర్చేదీ..?

అసెంబ్లీలో పరస్పరం పైచేయి కోసమే తాపత్రయం

అలా చేయకపోతే వెనుకబడిపోతామనే ఆందోళన

సమస్యలపై చర్చించాల్సిన చోట రాజకీయ ప్రసంగాలు


కీలక పద్దులపైనా శ్రద్ధ లేని వైనం

అదే పనిగా రన్నింగ్ కామెంట్రీలు..వ్యంగ్యాస్త్రాలు

ప్రసంగాల మధ్యలో పదే పదే జోక్యాలు

వామపక్షాలు తగినంతగా లేని లోటు కనబడుతున్న వైనం

సమన్వయానికి స్పీకర్ ప్రయత్నాలు..సహకరించని సభ్యులు



బి.వి.యన్.పద్మరాజు

'అధికార పక్షానికి ఎంతో సహనం.. మరెంతో ఓపిక ఉండాలి, ప్రధాన ప్రతిపక్షానికి ప్రజా సమస్యలను కావాల్సినంత ఎక్కువగా సభ దృష్టికి తేవాలన్న తపన ఉండాలి...' కానీ ప్రస్తుతం కొనసాగుతున్న రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తీరు తెన్నులను పరిశీలిస్తే... రెండు పక్షాలకూ ఇవి లోపించాయని చెప్పక తప్పదు. అవి రెండూ రాజకీయంగా ఒకదానిపై మరోటి పై చేయి సాధించేందుకు అసెంబ్లీని వినియోగించుకుంటున్నాయనే విమర్శలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి. అలా చేయకపోతే ప్రజల్లో తామెక్కడ వెనుకబడిపోతామోననే ఆందోళన అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సభ్యుల్లో కనబడుతోంది. తమ అగ్రనేతలను పొగడ్తలతో ఆకాశానికెత్తేయటమే పరమావధిగా ఆయా పార్టీల సభ్యులు ప్రసంగాలు దంచి కొడుతున్నారు. ఒకరకంగా 'ఆత్మస్తుతి, పరనింద' అనే రీతిలో ఆ రెండు పక్షాల తీరు కొనసాగుతోంది. సందట్లో సడేమియాగా 'రాష్ట్రానికి చిల్లగవ్వ ఇవ్వని' బీజేపీ...కేంద్రంలోని మోడీ సర్కారును అదే పనిగా పొగడ్తలతో ముంచెత్తుతోంది. మొత్తంగా చూస్తే మీడియాలో ప్రాధాన్యత, తమ కార్యకర్తల్లో జోష్ నింపటం కోసమే ఈ పార్టీలన్నీ ఆరాటపడుతు న్నాయనే వాదనలు బలంగా వినబడుతున్నాయి. రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈనెల 12న ప్రారంభమైనప్పటి నుంచి ఇదే రకమైన ఒరవడి అటు శాసనసభలోనూ, ఇటు మండలిలోనూ కనిపిస్తోంది. తొలి రోజు ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించిన సమయంలో కూడా పలువురు సభ్యులు అదే పనిగా అరవటం, రన్నింగ్ కామెంటరీ చేయటం, ఎదుటి పక్షాలను ఎద్దేవా చేస్తూ చేతులతో వింత సైగలు చేయటం అందర్నీ విస్మయానికి గురి చేసింది. పలువురు సీనియర్ సభ్యులు, మంత్రులు మాట్లాడుతున్నప్పుడు కూడా ...5లో

సమాఖ్య స్ఫూర్తిపై డీలిమిటేషన్ దాడి

ఆలోచనల సంగ్రామంలో భాగస్వాములు కండి : ప్రొఫెసర్ నాగేశ్వర్



మాట్లాడుతున్న నాగేశ్వర్, గోరటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ

మనువాదంలోనే అసమానతలు : ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

ఉత్సాహంగా ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రం చేయాలనుకుంటున్న డీలిమిటేషన్.. భారత సమాఖ్య స్ఫూర్తిపై దాడిగా మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్ అభివర్ణించారు. ఆదివారం హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ పూర్వ నేతలు డాక్టర్ రంగారావు, సారంపల్లి వాసుదేవరెడ్డి, ఈసంపల్లి బాబు, అరుణశ్రీ అధ్యక్షతన జరిగిన ఈ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చెన్నైలో డీలిమిటేషన్‌పై ఒక సమావేశం జరిగిందని, డీలిమిటేషన్ దేశ సమాఖ్య స్ఫూర్తిపై దాడి చేస్తున్నదని, ఈ దాడిని ఏ శైలిలో ప్రజలకు వివరించగలమని ప్రశ్నించారు. భిన్నత్వంలో ఏకత్వం అనేది భారత దేశ ఔన్నత్యాన్ని చాటిందని, అలాంటి దేశంలో నేడు ఒకే జాతి, ఒకే మతం, ఒకే ఎన్నికలు అంటూ కొత్త విధానాలను ప్రవేశపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మతాన్ని వ్యతిరేకించడం కాదని, మత ఉన్మాదాన్ని వ్యతిరేకించాలన్నారు. దేశంలో లౌకికవాదం, స్వేచ్ఛపై దాడి జరుగుతుందన్నారు. సమాజంలో ఆధిపత్యాన్ని, అసమానతలను ప్రశ్నించడాన్ని ఎస్ఎఫ్ఐ నేర్పిందన్నారు. దేశంలో 22 కోట్ల మంది ప్రజలు రూ.375 దినసరి వేతనంతో జీవిస్తున్నారని, గౌతం అదానీ మాత్రం రూ.1,600 కోట్ల వేతనం తీసుకుంటున్నారని, ఈ అసమానతలకు కారణం ఏమిటని ప్రశ్నించారు. సమాజంలో జరిగే ఆలోచనల సంగ్రామంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆలోచనలకు విరామం లేదన్నారు. ఎస్ఎఫ్ఐలో మనం ఎలా ఉన్నాం.. ఇప్పుడు బయటకు వచ్చాక ఎలా ఉంటున్నామనేది ఆలోచించి, మనల్ని మనం సింహావలోకనం చేసుకోవాలని తెలిపారు. మానవ సేవే మాధవ సేవ అని ప్రపంచంలో చాలా గ్రంథాలు చెబుతున్నాయని, ఆచరణలో మాత్రం ఇందుకు భిన్నంగా జరుగుతుందన్నారు. 'పుటుక నీది.. చావునీది.. బతుకంతా సమాజానిది..' అని చాటి చెప్పిన కాళోజీ కళాక్షేత్రంలో ఈ సమ్మేళనం ...3లో



కార్మిక పోరాటాలపై నిర్బంధాలు ఎత్తేయాలి

ప్రజాపాలనలో స్వేచ్ఛనిచ్చామంటూనే...ఆంక్షలేంది? : సీఎం రేవంత్‌రెడ్డికి సీఐటీయూ బహిరంగ లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కార్మిక పోరాటాలపై నిర్బంధాలను ఎత్తేయాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. ప్రజాపాలనలో నిరసనలు తెలుపుకునే స్వేచ్ఛనిచ్చామంటూనే అక్రమ అరెస్టులు, ఆంక్షలు ఏందని ప్రశ్నించారు. ఈ నెల 20న అర్ధరాత్రి పోలీసులు ఇండ్లలోకి జొరబడి కార్మికులను అరెస్టు చేయించడాన్ని తప్పుబట్టారు. ఆదివారం ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి వారు బహిరంగ లేఖ రాశారు. 'ఈ ఘటన తమరు ఇటీవల రవీంద్ర భారతిలో మీడియా సాక్షిగా మాట్లాడుతూ.. "మా పాలనలో ఉద్యోగులకు, కార్మికులకు, ప్రజలకు తమ సమస్యలను ప్రభుత్వానికి చెప్పుకునే హక్కును, స్వేచ్ఛను ఇచ్చామని, నాయకుల ఇళ్ళకు వెళ్ళి తలుపులు బద్దలు కొట్టి అరెస్టులు చేయడం తమ ప్రభుత్వ విధానానికి వ్యతిరేకమని" చెప్పి ఒక్కరోజు కూడా గడవక ముందే చోటుచేసుకున్నది. మీరిచ్చే ఆదేశాలు రాష్ట్రంలో అమలు ...13లో

అన్ని వేళ్లూ జస్టిస్ వర్మ వైపే !

జడ్జి నివాసం సమీపంలో గుట్టలుగా కాలిన నోట్ల కట్టలు

నిర్ధారించిన పారిశుధ్య కార్మికులు

గదిలో నాలుగైదు బస్తాల్లో నగదు

బయటపెట్టిన సుప్రీంకోర్టు నివేదిక

లోతైన దర్యాప్తు కోసం త్రిసభ్య కమిటీ నియామకం

నాకేం తెలీదు : జస్టిస్ వర్మ



న్యూఢిల్లీ : ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఆయన నివాసం సమీపంలో కాలిపోయిన కరెన్సీ నోట్లు కన్పించడం కలకలం రేపింది. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాలలో వైరల్ అవుతోంది. ఆ ప్రాంతంలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుడు ఇంద్రజిత్ చెత్తను సేకరిస్తుండగా కాలిపోయిన ఐదు వందల రూపాయల నోట్ల ముక్కలు కన్పించాయి. కొద్ది రోజుల క్రితం కూడా ఇంద్రజిత్‌కు ఇలాగే నోట్ల ముక్కలు కన్పించాయి కానీ అగ్నిప్రమాదం ఎలా జరిగిందో, ఎక్కడ జరిగిందో ఆయనకు తెలియలేదు. 'ఈ సర్కిల్‌లోనే మేము పనిచేస్తుంటాము. రోడ్ల మీద ఉన్న చెత్తను సేకరిస్తాము. నాలుగైదు రోజుల క్రితం ఇక్కడ శుభ్రం చేశాము. కాలిపోయిన ఐదు వందల రూపాయల నోట్ల ముక్కలు కొన్ని కన్పించాయి. ఇప్పుడు కూడా ఒకటి రెండు ముక్కలను గమనించాం. అగ్నిప్రమాదం ఎక్కడ జరిగిందో మాకు తెలియదు. మా పని అంతా చెత్తను సేకరించడమే' అని ఇంద్రజిత్ తెలిపారు. మరో పారిశుధ్య కార్మికుడు సురేందర్ కూడా దీనిని ధృవీకరించారు. 'చెత్తను సేకరించి ...13లో

కేసీఆర్ హయాంలోనే రైతులకు భరోసా



ఇప్పుడు రాష్ట్రమంతటా కష్టాలే

ఏ ఊరికెళ్లినా.. ఏ వాడకెళ్లినా.. గోసపడుతున్నది రైతులే

రాష్ట్రంలో కాంగ్రెస్‌ను, కేంద్రంలో బీజేపీని మరింత ఎండగట్టాలి

పార్టీ రజతోత్సవాల తర్వాత తిరుగుబాటుకు సిద్ధమవ్వాలి : కరీంనగర్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 6లో..

డీలిమిటేషన్‌పై నిర్ణయం తీసుకోలేదు



2026 జనగణన అనంతరమే కమిటీ ఏర్పాటు

ఆ తర్వాతే విధివిధానాలు రూపొందిస్తాం

తమిళనాడు ఎన్నికల్లో లబ్ది పొందేందుకు డీఎంకే కుట్ర : కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

వివరాలు 6లో



ఆమెపై ఆంక్షలు



సంపాదనను ఖర్చు చేసే స్వేచ్ఛ లేదు

ఇంటి విషయాల్లో పురుషుల నిర్ణయమే ఫైనల్

నచ్చిన అభ్యర్థికి ఓటు వేసే అవకాశమూ లేదు : ఇండియా టుడే జీడీబీ సర్వేలో వెల్లడి

బీజేపీ పాలిత రాష్ట్రాలు ఫ్లాప్

అట్టడుగున యూపీ, గుజరాత్, అసోం

ఆరో స్థానంలో తెలంగాణ..ఏపీకి 16వ ర్యాంకు

భారత్‌లోని మహిళలు వారి సంపాదనను ఖర్చు పెట్టే విషయంలో పూర్తి స్వతంత్రతను కలిగి లేరు. అలాగే, విద్య, ఇంటి నిర్ణయాలు, వ్యక్తిగత స్వేచ్ఛ, ఉద్యోగం వంటి విషయాల్లోనూ వారిపై ఇప్పటికీ ఆంక్షలు ఉంటున్నాయి. వారిపై భర్త, కుటుంబంలోని పురుషులు, ఇతరుల ఆధిపత్యమే నడుస్తున్నది. చట్టాలు మారినా గృహ హింస, వేధింపులు అనే రాకాసి సమస్యలు ఇప్పటికీ వెంటాడుతున్నాయి. ఇండియా టుడే గ్రాస్ డొమెస్టిక్ బిహేవియర్ (జీడీబీ) సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. లింగ సమానత్వం విషయంలో కేరళ ముందు స్థానంలో ఉన్నది. బీజేపీ పాలిత రాష్ట్రాలు యూపీ, గుజరాత్, అసోంలు అట్టడుగున ఉన్నాయి.

న్యూఢిల్లీ : దేశంలోని ఆయా రాష్ట్రాల ప్రజల వైఖరి గురించి ఇండియా టుడే గ్రాస్ డొమెస్టిక్ బిహేవియర్ (జీడీబీ) సర్వేలో ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి. ఈ సర్వేలో 'లింగ వైఖరులు'పై దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలలో 9వేల మంది నుంచి స్పందనలు సేకరించారు. లోతుగా పాతుకుపోయిన లింగ అసమానతలు ఇంటి నిర్ణయాలు, వ్యక్తిగత స్వేచ్ఛ విషయంలో మహిళలు ఎదుర్కొంటున్న పరిస్థితుల గురించి ఈ సర్వే హైలెట్ చేసింది. ఈ సర్వే దేశం పురోగతి, పితృస్వామ్యాల మధ్య చిక్కుకుపోయిందని చూపించింది. ఇక లింగ సమానత్వ పరీక్షలో ఎప్పటిలాగే కేరళ మొదటి స్థానంలో నిలిచింది. బీజేపీ పాలిత రాష్ట్రం యూపీ అట్టడుగున ఉన్నది.

మహిళ సంపాదన గురించి..

మహిళలు తమ సంపాదనపై పూర్తి నియంత్రణను కలిగి ఉండాలని 69 శాతం మంది తెలిపారు. ఆర్థిక నిర్ణయాల్లో కుటుంబ ఆమోదం అవసరమని 31 శాతం మంది తమ అభిప్రాయాన్ని చెప్పారు. అయితే, ఈ విషయంలో దేశంలోని మిగతా అన్ని రాష్ట్రాలతో పోలిస్తే కేరళ చాలా మెరుగ్గా ఉన్నది. మహిళలు తమ సంపాదనపై పూర్తి నియంత్రణను కలిగి ఉండాలని 91 శాతం మంది చెప్పారు. ఒడిశాలో ఇది 27 శాతంగానే ఉన్నది. ఆర్థిక నిర్ణయాల్లో ...6లో

లింగ సమానత్వంలో కేరళ ఫస్ట్

మహిళల హక్కులను గుర్తించి, పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుండేలా చర్యలు తీసుకోవటంలో కేరళ రాష్ట్రం ఎప్పుడూ ముందుంటుంది. ఈ సర్వేలో కూడా ఇదే విషయం వెల్లడైంది. లింగ సమానత్వ పరీక్షలో దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలకు కేటాయించిన ర్యాంకులలో కేరళ మొదటి స్థానంలో ఉన్నది. ఆ తర్వాతి స్థానంలో ఉత్తరాఖండ్, తమిళనాడులు ఉన్నాయి. తెలంగాణ ఆరో స్థానంలో ఉన్నది. పొరుగు తెలుగు రాష్ట్రం ఏపీ 16వ స్థానంలో ఉన్నది. ఇక బీజేపీ పాలిత రాష్ట్రాలు యూపీ(22), గుజరాత్(21), అసోం(20)లు జాబితాలో అట్టడుగు స్థానాల్లో ఉన్నాయి.

అసెంబ్లీలో నేడు నాలుగు పద్దులపై చర్చ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సోమవారం అసెంబ్లీలో నాలుగు శాఖలకు సంబంధించిన పద్దులను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి, సాంఘీక, గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖల పద్దులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టనున్నారు. పరిశ్రమలు, వాణిజ్యం, సమాచార సాంకేతిక శాఖల పద్దులను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, పంచాయతిరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖల పద్దులను మంత్రి సీతక్క, బీసీ సంక్షేమ శాఖ పద్దును మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రవేశపెట్టనున్నారు. వీటితో పాటు తెలంగాణ మున్సిపాల్టీ (సవరణ) బిల్లును సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ పంచాయతీ రాజ్ (సవరణ) బిల్లును మంత్రి సీతక్క ప్రవేశ పెట్టనున్నారు.

భూ భారతితో రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- 10,954 కొత్త ఉద్యోగాలతో ప్రజలకు మెరుగైన సేవలు: తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'భూ భారతి-2025' చట్టం రాష్ట్ర రెవెన్యూ వ్యవస్థలో కీలక మార్పులకు నాంది కానుందని తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మెన్ వి.లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన రెవెన్యూ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో చిన్నా భిన్నమైన రెవెన్యూ వ్యవస్థను తిరిగి గాడీలో పెట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని అన్నారు.

వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థల పునరుద్ధరణ, ఎమ్మార్వో, ఆర్డీవోలకు తిరిగి అధికారాల బదలాయింపు తదితర చర్యలు ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. 10,954 గ్రామ అధికారులతో పాటు 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల నియామకంతో ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందుతాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే సైనికులుగా రెవిన్యూ ఉద్యోగులుగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, టీజీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్‌లో రాష్ట్రాల పీఎస్సీల జాతీయ సమావేశం

- బుర్రా వెంకటేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈ ఏడాది డిసెంబర్‌లో రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్ పర్సన్ల జాతీయ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్ బుర్రా వెంకటేశం తెలిపారు. కేరళ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో మార్చి 22, 23 తేదీల్లో తిరువనంతపురంలో టెక్నాలజీపై నిర్వహించిన టెక్నాలజీపై జరిగిన జాతీయ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ఆయనతో పాటు కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ ఎస్.యాదయ్య, పి.రజనీ కుమారి ఉన్నారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ సాంకేతికత అమలులో ఎదురవుతున్న చట్టపరమైన సవాళ్ల పరిష్కారం కోసం ఈ ఏడాది జూన్‌లో నల్సార్ సహకారంతో వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వర్క్‌షాప్ లో నియామక ప్రక్రియలో ఇంటిగ్రేషన్ ఆఫ్ అడ్వాన్స్ డ్ టెక్నాలజికల్ సొల్యూషన్స్, కంప్యూటర్ బేస్‌డ్ టెస్టింగ్ (సీబీటీ) తదితర కీలక అంశాలపై చర్చించారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలిగిస్తే ఆందోళన

- మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలిగిస్తే ఆందోళన తప్పదని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని లక్షా 25 వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలిగిస్తామని ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో వారికి పీఆర్సీ అమలు చేశామని గుర్తు చేశారు. ముందస్తు సమాచారం లేకుండా రాత్రికి రాత్రే తొలిగిస్తే వారి కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రెండు లక్షల రెగ్యులర్ ఉద్యోగాలను భర్తీ చేసిన తర్వాతే వారికి ప్రత్యామ్నాయ ఉపాధి చూపించి తొలిగించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల గురించి అడుగుతారనే భయంతో విశ్వవిదాలయాల్లో నిషేధాజ్ఞలు అమలు చేస్తున్నారని విమర్శించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జోలికొస్తే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున అందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

భాషా పండితుల బదిలీలు అనుమతించాలి

- రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్పౌజ్ బదిలీల్లో నిలిపేసిన 13 జిల్లాల భాషా పండితుల బదిలీలు అనుమతించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు, తెలంగాణ రాష్ట్రం (ఆర్‌యుపీపీటీఎస్) కోరింది. ఈ మేరకు పరిషత్తు రాష్ట్ర అధ్యక్షులు సి.జగదీశ్ ఆదివారం నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవికి లేఖ రాశారు. బదిలీల నిలిపివేతతో గత 3 సంవత్సరాలుగా 200 నుంచి 300 కిలోమీటర్లు రోజూ ప్రయాణం చేస్తూ అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

సకాల పరీక్షలతో క్షయకు అడ్డుకట్ట

చికిత్స ఉన్న వ్యాధి
నేడు వరల్డ్ టీబీ డే



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

క్షయ (టీబీ) సోకిన వ్యక్తి దగ్గినా.. తుమ్మినా.. లేదా ఉమ్మివేసినా మరొకరి సోకే అవకాశమున్న వ్యాధి. అయితే ఈ వ్యాధి నివారించదగినది. పూర్తిగా నయం చేయడానికి చికిత్స అందుబాటులో ఉంది. ప్రజలు ఈ వ్యాధి బారిన పడకుండా, ఒకవేళ సోకినా చికిత్స తీసుకునేలా ప్రోత్సహించేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఏడాది మార్చి 24న వరల్డ్ టీబీ డేగా నిర్వహిస్తున్నారు. ఈ వ్యాధిగ్రస్తులకు ఉన్న చికిత్సావకాశాలపై ప్రజలకు ఈ రోజున అవగాహన కల్పిస్తున్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ వ్యాధి నిర్మూలనకు 2030ని లక్ష్యంగా నిర్దేశించింది. టీబీ కేసులను ఎంత ఎక్కువగా గుర్తిస్తే అంత త్వరగా ఈ వ్యాధివ్యాప్తిని అరికట్టవచ్చని అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టారు. అయితే కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యానికి తగినట్టు నిధులు విడుదల చేయకపోవడంతో 2025 నాటికి లక్ష్యం పూర్తి కావడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. 2024 నాటికి దేశంలో 26.07 లక్షల టీబీ కేసులు నమోదు అయ్యాయి. 2015 నుంచి 2023 నాటికి లక్ష మందికి ఈ వ్యాధిని గుర్తిస్తే.. కేసుల సంఖ్య 237 నుంచి 195కు తగ్గింది. ఇది 17.7 శాతం తగ్గుదలను సూచిస్తుంది. ఈ కాలంలో మరణాల రేటు 28 నుంచి 22కు తగ్గింది. రాష్ట్రంలో కేసుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేశారు. మన రాష్ట్రంలో 2021-22 లో 1,947 కేసులు గుర్తిస్తే 2024-25 నాటికి వాటి సంఖ్య 2,001కి పెరిగింది.

పొగాకుకు దూరంగా ఉండాలి : మాచన రఘునందన్



పొగాకుకు దూరంగా ఉండాలని పొగాకు నియంత్రణ అంతర్జాతీయ అవార్డు గ్రహీత మాచన రఘునందన్ సూచించారు. క్షయ వ్యాధికి పొగాకు ఏ విధంగా కారకంగా మారుతున్నదో అవగాహన పెంచుకోవాలని కోరారు. ఒక వేళ ఆ వ్యాది సోకినా వెంటనే చికిత్స మొదలు పెడితే మంచిదని సూచించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి : డాక్టర్ రాజీవ్



యాక్టివ్ టీబీ రోగులతో సన్నిహితంగా ఉండేవారు, బలహీనమైన రోగ నిరోధక వ్యవస్థ కలిగిన పిల్లలు, వృద్ధులు (ముఖ్యంగా టీబీ చర్మ పరీక్ష పాజిటివ్ ఉన్నవారు), డయాబెటీస్, హెచ్ఐవీ, క్యాన్సర్ రోగులు, కీమోథెరపీ వంటి రోగ నిరోధక శక్తి తగ్గే చికిత్సలు చేయించుకున్న వారు, అవయవమార్పిడి చేయించుకున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ రాజీవ్ సూచించారు. దీంతో పాటు ఈ వ్యాధిని తొందరగా అంతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింతగా నిధులను పెంచాలని కోరారు. తక్కువ గ్రేడ్ జ్వరం, రెండు వారాలకు మించి దీర్ఘకాలిక దగ్గు, రాత్రి పూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, శ్వాస ఆడకపోవడం, ఛాతి నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే టీబీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

కవలలుగా హెచ్ఐవీ, టీబీ : డాక్టర్ కొల్లాబత్తుల రత్నబాబు



హెచ్ఐవీ, టీబీ వ్యాధులు కవలలని, ఒక వ్యాధి ఉన్న వారికి మరో వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని ప్రముఖ పల్మనాలజిస్ట్ డాక్టర్ కొల్లాబత్తుల రత్నబాబు హెచ్చరించారు. హెచ్ఐవీ ఉన్న వారికి రోగ నిరోధక శక్తి బలహీనంగా మారి టీబీ బారిన పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా టీబీ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. లేటెంట్ టీబీ ఉన్నట్టు తేలితే వారికి అదనపు పరీక్షలు కూడా అవసరమవుతాయని వివరించారు.

ప్రభాకర్‌రావును విచారిస్తేనే అసలు నిజాలు

ఫోన్‌ట్యాపింగ్ కేసుపై దర్యాప్తు అధికారుల దృఢవిశ్వాసం
ముందస్తు బెయిల్ రాకుండా న్యాయమార్గాల అన్వేషణ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో ప్రధాన నిందితుడుగా ఎఫ్ఐఆర్‌లో పేర్కొనబడ్డ ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావును విచారిస్తేనే అన్ని నిజాలు తేలుతాయని దర్యాప్తు అధికారులు భావిస్తున్నారు. అందుకోసం అమెరికాలో ఉన్న ప్రభాకర్‌రావును వీలైనంత త్వరగా తీసుకురావడానికి కేంద్ర హోం శాఖపై ప్రభుత్వం సైతం ఒత్తిడి తీసుకు రావాలని వారు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదై ఏడాది గడిచిపోయింది. ఈ కేసులో ఇప్పటి వరకూ పోలీసు అధికారులైన రాధాకిషన్‌రావు, భుజంగరావు, తిరుపతిరావుతో పాటు ప్రణీత్‌రావులను జూబ్లీహిల్స్ ప్రత్యేక టీమ్ పోలీసులు అరెస్టు చేయడం, తర్వాత వారు బెయిల్‌పై విడుదల కావడం జరిగిన సంగతి తెలిసిందే. ఈ కేసు నమోదయ్యే సమయానికి ప్రభాకర్‌రావుతో పాటు మరో నిందితుడు ఐన్యూస్ సీఈఓ శ్రవణ్ రావులు అమెరికాకు వెళ్లిపోయారు. వారిని తీసుకురా వడానికి రెడ్‌కార్నర్ నోటీసు ద్వారా ఇంటర్‌పోల్ సహాయాన్ని కూడా రాష్ట్ర పోలీసులు కోరారు. ఈ ప్రక్రియ కొనసాగుతుండగానే 'అమెరికాలో చికిత్స పొందుతున్నాను. నాకు ఈ కేసుతో సంబంధం లేదు. అవసరమైతే ఇక్కడి పోలీసు అధికారులకు సహకరించడానికి సిద్ధంగా ఉన్నాను. అనారోగ్య కారణాల వల్ల అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వండి' అని కోరుతూ... తాజాగా ప్రభాకర్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వాదనలను కోర్టు వాయిదా వేసింది. అయితే, ప్రభాకర్‌రావును ఈ కేసులో విచారించడానికి ఉన్న అవకాశాలను ఏ మాత్రం వదులుకోరాదని దర్యాప్తు అధికారులు పట్టుదలతో ఉన్నారని తెలిసింది. అందుకోసం కోర్టులో ముందస్తు బెయిల్ రాకుండా అవసరమైన న్యాయమార్గాలపై నిపుణులతో సంప్రదిస్తున్నట్టు తెలిసింది. ముఖ్యంగా, మరో నిందితుడు శ్రవణ్‌రావు కూడా ముందస్తు బెయిల్ కోసం గతంలో పెట్టుకున్న పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో ప్రభాకర్‌రావుకు సైతం బెయిల్ లభించకుండా చూడటానికి అవసరమైన న్యాయమార్గాలను అధికారులు అన్వేషిస్తున్నారని తెలిసింది. ప్రభాకర్‌రావును అదుపు లోకి తీసుకుని విచారిస్తేనే వారి వెనుక ఆ సమయంలో ఉన్న రాజకీయ ప్రముఖుల గుట్టు కూడా బయటకు లాగగలుగుతామని అధికారులు భావిస్తున్నారు.

జవాన్లకు మంత్రి ఉత్తమ్ కృతజ్ఞతలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సెల్బీసీ టన్నెల్ ప్రమాదంలో సహాయ, రక్షణ చర్యల్లో ధైర్యంగా సహకరించిచన తెలంగాణ అండ్ ఆంధ్రా సబ్ ఏరియా ఆర్మీ కమాండర్ జనరల్ మిశ్రా, ఆఫీసర్లు, జవాన్లకు రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో నిర్వహించిన ఇండియన్ ఆర్మీ ఉత్సవంలో పాల్గొన్నారు. తాను భారత సైనిక దళాల సభ్యున్ని కావడం పట్ల గర్వంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్టు దేవ్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

వాళ్లు బ్రిటిష్‌వాళ్ల కంటే దారుణం

బీజేపీ ఇచ్చిన హామీలు ఎక్కడ..? ఆప్ అధినేత కేజ్రీవాల్



న్యూఢిల్లీ : ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ బీజేపీపై మరోసారి విరుచుకుపడ్డారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్, సంఘ సంస్కర్త అంబేద్కర్ వారసత్వాన్ని కాషాయపార్టీ విస్మరిస్తోందని మండిపడ్డారు. వారి తీరు బ్రిటిష్ వాళ్ల కంటే దారుణంగా ఉందన్నారు. 'ఏక్ షామ్ షహీదోంకే నామ్' పేరుతో ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన కేజ్రీవాల్.. తమ పార్టీ మాత్రం భగత్‌సింగ్, అంబేద్కర్‌ల ఆశయాలను నెరవేర్చేందుకే రాజకీయాల్లోకి వచ్చిందన్నారు.

"బాబాసాహెబ్ అంబేద్కర్, భగత్ సింగ్‌లు మాకు ఆదర్శం. మా కార్యాలయంతోపాటు పంజాబ్‌లోని ప్రతి ఆఫీసులో వారి ఫొటోలే ఉంటాయి. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆ ఫొటోలను తొలగించి వారికి నచ్చిన వాళ్లవి పెట్టుకున్నారు. గాంధీజీ చిత్రపటం లేదని విమర్శించిన కాంగ్రెస్ కూడా ఇప్పుడు మౌనంగా ఉంది. ఆ రెండు పార్టీలు కుమ్మక్కయ్యాయి" అని కేజ్రీవాల్ ఆరోపించారు. బీజేపీని ఉద్దేశిస్తూ విమర్శలు గుప్పించిన ఆయన.. ప్రస్తుత పాలకులు బ్రిటిష్ కంటే దారుణంగా ఉన్నారని మండిపడ్డారు. ఢిల్లీలో బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణించేందుకు బీజేపీ ప్రభుత్వం నిరాకరిస్తోందని కేజ్రీవాల్ ఆరోపించారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకోకుంటే కండక్టర్లు పింక్ టికెట్ ఇవ్వడం లేదన్నారు. సౌకర్యాలు కల్పించకపోగా.. గతంలో ఉన్న వాటిని ఉపసంహరించుకుంటున్నారని అన్నారు. ఇప్పటికే మహిళలకు రూ.2500 ఇవ్వాల్సి ఉందని, కానీ ఇంకా ఆ కార్యక్రమం ప్రారంభించలేదన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో బీజేపీ విఫలమైందని కేజ్రీవాల్ ఆరోపించారు.

మళ్లీ బర్డ్ ఫ్లూ కలకలం

హైదరాబాద్ : తెలంగాణలో మళ్లీ బర్డ్ ఫ్లూ కలకలం రేపింది. దాదాపు నెల రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్ ఫ్లూ వ్యాధి కోళ్లకు సోకిందన్న సమాచారంతో సరిహద్దులో నిఘా పెట్టి తెలంగాణ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంది. తాజాగా నల్గొండ జిల్లాలో కోళ్ల ఫామ్‌లలో కోళ్లకు బర్డ్ ఫ్లూ పాజిటివ్ నిర్ధారణ కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్ శివారులోని చిట్యాల మండలం గుండ్రాంపల్లి కోళ్ల ఫామ్‌లో సుమారు రెండు లక్షల కోళ్లను చంపి వాటిని నాలుగు అడుగుల లోతు గుంత తీసి జెసిబి సహాయంతో పూడ్చేశారు. తెలంగాణ వ్యాప్తంగా కోళ్ల పామ్‌లలో పరీక్షలు నిర్వహించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. బర్డ్ ఫ్లూ ఉన్న కోళ్ల ఫామ్‌కు పది కిలోమీటర్ల పరిధిని రెడ్ జోన్‌గా పరిగణిస్తున్నామని, ఆ ప్రాంతాన్ని మూడు జోన్‌లుగా విభ జించి పర్యవేక్షిస్తున్నామని అధికారులు తెలిపారు. హైదరాబాద్ శివారులో బర్డ్ ఫ్లూ కలకలం రేపడంతో ఆదివారం నగరంలో చికెన్ విక్రయాలు భారీగా తగ్గాయి. చేపలు, మటన్‌కు గిరాకీ పెరిగింది.

నిమ్స్ అడ్మినిస్ట్రేషన్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిమ్స్ ఆస్పత్రిలో ఆదివారం అడ్మినిస్ట్రేషన్ పూర్వ విద్యార్థుల తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఆరోగ్య సంరక్షణలో పరిపాలన విద్యలో 35 సంవత్సరాల అత్యుత్తమ ప్రతిభను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా ఆరోగ్య సంరక్షణ రంగంలో కీలక పరిపాలనా పదవులను నిర్వహిస్తున్న వంద మందికి పైగా ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమానికి మాజీ వైద్య సూపరింటెండెంట్లు డాక్టర్ పులిజాల సత్యనారాయణ, డాక్టర్ ఇందిరా వెంకట్రామన్, ఇతర సీనియర్ అధ్యాపకులు హాజరయ్యారు. ఈ సమావేశం నెట్‌వర్కింగ్, జ్ఞాన మార్పిడి, ఆరోగ్య సంరక్షణ పరిపాలనలో ఉద్భవిస్తున్న ధోరణులపై చర్చలకు వేదికను అందించింది. సమావేశంలో మెడికల్ సూపరింటెండెంట్, ప్రొఫెసర్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, మెడికల్ సూపరింటెండెంట్లు డాక్టర్ ఎన్ లక్ష్మీ భాస్కర్, డాక్టర్ కె.వి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు. ఆర్ఎంఓలు కీలక పాత్ర పోషించారు.

అమెరికాలో దుండగుడి కాల్పులు..

భారత్‌కు చెందిన తండ్రీ కుమార్తె మృతి

వర్జీనియా: అమెరికాలో ఇద్దరు భారతీయులపై కాల్పులు జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వర్జీనియాలోని ఓ డిపార్టుమెంటల్ స్టోర్‌లో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో అక్కడే పనిచేస్తున్న భారత్‌కు చెందిన ఊర్మి (24), ఆమె తండ్రి ప్రదీప్ పటేల్ చనిపోయారు. కాల్పులకు తెగబడిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం ఉదయం మద్యం కొనేందుకు స్టోర్‌కు వెళ్లిన దుండగుడు ముందురోజు రాత్రి స్టోర్‌ను ఎందుకు మూసివేశారని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. వెంటనే కాల్పులు జరపగా.. ప్రదీప్ పటేల్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన ఊర్మి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ప్రాణాలు విడిచింది. భార్య, కుమార్తెతో కలిసి ఆరేండ్ల క్రితం ప్రదీప్ పటేల్ గుజరాత్ నుంచి అమెరికా వెళ్లినట్టు సమాచారం.








యువతరమా జాగ్రత్త

డ్రగ్స్‌, మతం చాలా ప్రమాదం

- సెల్‌ఫోన్లకు బానిసలు కావొద్దు
- పుస్తకాలు చదవండి.. చరిత్ర తెలుసుకోండి
- దేశాన్ని రక్షించగలిగేది కమ్యూనిస్టులే : సినీ నటుడు అజయ్‌ ఘోష్‌
- భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోండి : సినీ దర్శకులు బాబ్జీ
- క్రీడలతో మానసికోల్లాసం : వాలీబాల్‌ జాతీయ మాజీ క్రీడాకారుడు కిరణ్‌రెడ్డి

ఎస్‌వీకేలో ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌ యువజన క్రీడోత్సవాల ముగింపు సభ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్‌

'యువకుల్లారా జాగ్రత్తగా ఉండండి..డ్రగ్స్‌, మతం మత్తు చాలా ప్రమాదకరం. వాటి మత్తులో పడి జీవితాలను ఆగం చేసుకోవద్దు' అని సినీ నటులు అజయ్‌ ఘోష్‌ పిలుపునిచ్చారు. మంచి పుస్తకాలు చదవాలనీ, చరిత్ర తెలుసుకోవాలని సూచించారు. ఆదివారం హైదరాబాద్‌లో భగత్‌సింగ్‌ సందేశ్‌ర్యాలీ చేపట్టారు. అనంతరం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ యువజన, సాంస్కృతిక, టూరిజం శాఖల సహకారంతో ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్‌ యువజన క్రీడోత్సవాల ముగింపు సభ నిర్వహించారు.ముఖ్య అతిథిగా అజయ్‌ఘోష్‌ హాజరై క్రికెట్‌, ఖోఖో, వెయిట్‌ లిఫ్టింగ్‌, కబడ్డీ క్రీడల్లో విజయం సాధించిన వారికి బహుమతులను అందజేశారు. ప్రగతివిద్యానికేతన్‌, భాష్యం స్కూల్‌తో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తమ సాంస్కృతిక కార్యక్రమాలతో సభను ఉత్తేజపరిచారు. తెలుగు యూనివర్సిటీ విద్యార్థులు డ్రగ్స్‌తో విద్యార్థుల జీవితాలు, కుటుంబాలు ఏవిధంగా ఛిద్రంగా మారుతున్నాయనే దానిపై ప్రదర్శించిన నాటిక ఆద్యంతం అందర్నీ ఆలోచింపజేసింది. సభనుద్దేశించి అజయ్‌ ఘోష్‌ మాట్లాడుతూ..సే టూ నో డ్రగ్స్‌ నినాదంతో యువతను చైతన్యపరస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ, డీవైఎఫ్‌ఐలను అభినందించారు. నేటి సమాజంలో మనుషులు మనుషులమని మరిచిపోతుండటం, కుటుంబ బాంధ్యవాలు చెల్లాచెదురుకావడం వంటి సంఘటనల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. మన గురించి మనం ఆలోచించుకునే స్థితిలో కూడా లేమనీ, పాలకులకు కావాల్సినది కూడా అదేనని చెప్పారు. చరిత్రను ఎవరికి వారు మార్చేస్తూ విష ప్రచారం చేస్తున్నారనీ, ఏ పోరాటంలోనూ పాల్గొనని వాళ్లు కూడా తాము దేశభక్తులమనీ, మిగతావారు దేశద్రోహులని యువత మెదళ్లలో విషం నింపుతున్నారని విమర్శించారు. దేశం కోసం ప్రాణ త్యాగాలు అర్పించిన మహనీయుల చరిత్రలు చదివితే ఏది నిజం, ఏది అబద్ధం అనేది తేలుతుందన్నారు. చదివితే ఆలోచించే, ప్రశ్నించే తత్వం పెరుగుతుందని సూచించారు. యువతరం చరిత్ర తెలుసుకుంటే తమకు ప్రమాదమని పాలకులకు తెలుసుననీ, అందుకే యువతను అటువైపు వెళ్లకుండా కులం, మతం మత్తులో దింపుతున్నారని విమర్శించారు. హెరాయిన్‌, డ్రగ్స్‌ కంటే మతం మత్తు ఇంకా ప్రమాదకరమైందని హెచ్చరించారు. దేవుని పేరుతో కొందరు మోసాలు చేయడం, దురాగతాలకు పాల్పడటం, నయవంచనకు పాల్పడటం వంటి ఘటనల పట్ల ఆందోళన వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో కమ్యూనిస్టులు ఏకం కావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. వారు ముందు పడకపోతే దేశాన్ని ఎవ్వరూ రక్షించలేరనీ, నిజంగా దేశాన్ని రక్షించే శక్తి ఎర్రజెండాకే ఉందని అభిప్రాయపడ్డారు. సినీ దర్శకులు బాబ్జీ మాట్లాడుతూ.. కులాలు, మతాలు, ప్రాంతాలుగా యువత విడిపోయి కొట్టుకోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాలను తీసుకోవద్దనీ, జీవితాలను ఆగం చేసుకోవద్దనీ యువతకు చేతులెత్తి ప్రార్థించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు పిల్లల్లో ఆరోగ్యకరమైన లక్షణాలను పెంపొందిస్తాయని చెప్పారు. భగత్‌సింగ్‌ ఏకపాత్రాభియ నటన ద్వారా ఆ మహనీయుని తల్లి మన్ననలు పొందిన సందర్భం తన జీవితంలో మరిచిపోలేని ఘటన అని చెప్పారు. వాలీబాల్‌ జాతీయ మాజీ క్రీడాకారుడు కిరణ్‌రెడ్డి మాట్లాడుతూ... జీవితంలో కఠోర శ్రమనే ఉన్నతంగా తీర్చిదిద్దుతుందని టెన్నిస్‌ క్రీడాకారిణి మార్టినా హింగిస్‌ జీవిత చరిత్రను ఉదహరించారు. పెండ్లీలు, పండగలు, టూర్ల పేరిట సమయాన్ని వృథా చేసుకోకుండా చదువు, ఆటలపై ఏకాగ్రత పెడితే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారని సూచించారు. ఒక్కసారి ఉన్నతస్థాయికి ఎదిగితే జీవితంలో ప్రతిరోజూ పండుగేనని చెప్పారు. డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్‌ మాట్లాడుతూ..యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని విన్నవించారు. భగత్‌సింగ్‌ పోరాట స్ఫూర్తిని పుణికిపుచ్చుకోవాలనీ, చిన్నతనం నుంచే నాయకత్వ లక్షణాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల నిర్వహణ కమిటీ అధ్యక్షులు జే.కే.శ్రీనివాస్‌, గద్దర్‌ ఫౌండేషన్‌ చైర్మెన్‌ సూర్యకుమార్‌, డీవైఎఫ్‌ఐ మాజీ నాయకులు మహేందర్‌, మహేందర్‌, శ్రీనివాసరావు, డీవైఎఫ్‌ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు హష్మీ, జావిద్‌, ఎస్‌ఎఫ్‌ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ. లెనిన్‌, అశోక్‌రెడ్డి, నాయకులు హష్మిత, చరణ్‌శ్రీ, తదితరులు పాల్గొన్నారు.



పోరాటయోధుడు భగత్‌సింగ్‌

ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలి

దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం

బీజేపీ మతోన్మాద విధానాలు దేశానికి ప్రమాదకరం : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ - బోనకల్‌

బ్రిటిష్‌ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు భగత్‌సింగ్‌ అని, ఆయన స్ఫూర్తితోనే దేశంలో పోరాటాలు నిర్వహించనున్నట్టు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ఖమ్మం జిల్లా బోనకల్‌ మండలం పెద్ద బీరవల్లి గ్రామంలో విప్లవ వీరుడు భగత్‌ సింగ్‌ 94వ వర్ధంతిని పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభా వేదికపై భగత్‌సింగ్‌ చిత్రపటానికి జాన్‌వెస్లీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి కిలారు సురేష్‌ అధ్యక్షతన నిర్వహించిన సభలో జాన్‌ వెస్లీ మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఉరుకంబమెక్కి ప్రాణాలు అర్పించిన పోరాట యోధుడు భగత్‌సింగ్‌ అని కొనియాడారు. ఆనాడు భగత్‌ సింగ్‌ ఏ ఆశయం కోసం అయితే పోరాటం చేశాడో.. నేడు ఆ ఆశయాలకు భిన్నంగా పాలకులు పరిపాలన చేస్తున్నారని అన్నారు. దేశ సంపద మొత్తం కొద్దిమంది పెట్టుబాడుదారులు, బూర్జువా కార్పొరేట్‌ సంస్థల ఆధీనంలో కేంద్రీకృతమై ఉందన్నారు. దేశ సంపద ప్రజలందరికీ చెందాలన్నదే భగత్‌ సింగ్‌ ఆశయమని, దానికనుగుణంగానే ఎర్రజెండా పోరాటం చేస్తున్నదని తెలిపారు. మతోన్మాదం పేరుతో బీజేపీ దేశంలో ఘర్షణలు సృష్టిస్తుందన్నారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలు దేశానికి ప్రమాదకరమన్నారు. నేడు అన్ని రంగాల్లో, వ్యవస్థల్లో అసమానతలు పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంటరానితనం, అసమానతల నిర్మూలన కోసం ఎర్రజెండా పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. అనంతరం పార్టీ సీనియర్‌ నాయకులు ఎనమద్ది సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెరువు కోటేశ్వరరావును శాలువాలతో జాన్‌వెస్లీ, పోతినేని సుదర్శన్‌రావు సన్మానించారు. ఈ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్‌, బండి రమేష్‌, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నాయకులు బొంతు రాంబాబు, భూక్యా వీరభద్రం, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి పద్మ, మాదినేని రమేష్‌, కళ్యాణం వెంకటేశ్వరరావు, ఎర్ర శ్రీనివాసరావు, పార్టీ మధిర డివిజన్‌ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, జిల్లా కమిటీ సభ్యులు మెరుగు సత్యనారాయణ, దొండపాటి నాగేశ్వరరావు, వాసిరెడ్డి వరప్రసాదరావు సేలం నరసింహారావు, ఐలు రాష్ట్ర నాయకులు ఏడునూతల శ్రీనివాసరావు, మధిర రూరల్‌, చింతకాని మండలాల కార్యదర్శులు మంద సైదులు, రాచబంటి రాము, పెద్దబీరవల్లి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముందు మా భద్రత చూడండి

- అర్బన్‌ కమిటీని కోరుతున్న మహిళా కార్మికులు
- 'ఇన్‌స్టా మెయిడ్‌' సర్వీసుపై ఆందోళన



ఇప్పటికే వేధింపులు, అవమానాలు తప్పడం లేదని ఆవేదన

న్యూఢిల్లీ : అర్బన్‌ కంపెనీ గురించి తెలుసా? అది గృహ అవసరాలకు సంబంధించిన అన్ని రకాల సేవలను అందించే యాప్‌ ఆధారిత వేదిక. గత వారం ఈ కంపెనీ ఓ అసాధారణ ప్రకటన ఇచ్చింది. అదే 'ఇన్‌స్టా మెయిడ్స్‌/ఇన్‌స్టా హెల్ప్‌'. ఈ వేదిక ఇప్పటికే ఇంటి వద్ద అనేక సేవలు అందజేస్తోంది. బ్యూటీ ట్రీట్‌మెంట్‌, హెయిర్‌ కటింగ్‌, ప్లంబింగ్‌, కార్పెంటరీ, పెయింటింగ్‌ వంటివి ఇందులో కొన్ని. గృహోపకరణాలకు మరమ్మతులు చేయడం, బిగించడం కూడా చేస్తారు. ఇప్పుడు ఈ కంపెనీ తాజాగా మరో కొత్త సర్వీసును ప్రారంభించింది. దీనికి సంబంధించి ఈ నెల 14న సామాజిక మాధ్యమం ఎక్స్‌లో కంపెనీ ఓ పోస్ట్‌ పెట్టింది. ఇంటి పనివారిని కూడా సరఫరా చేస్తామని దాని సారాంశం. యాప్‌లో బుక్‌ చేసుకున్న పదిహేను నిమిషాల వ్యవధిలోనే పనిమనిషి వచ్చి ఇంటి పనులు చేస్తుందట. ప్రస్తుతానికి గంటకు రూ.49 మాత్రమే వసూలు చేస్తారట. అది కూడా పరిమిత కాలానికే సుమా !

ప్రస్తుతం ముంబయిలో పైలెట్‌ ప్రాజెక్టుగా దీనిని చేపట్టామని, ప్రజల నుండి విశేష స్పందన వస్తోందని, ఇతర నగరాలకు కూడా దీనిని విస్తరిస్తామని అర్బన్‌ కంపెనీ చెబుతోంది. తమ 'భాగస్వాములు' గంటకు రూ.150-180 సంపాదించుకోవచ్చునని, పనివారికి ఉచిత ఆరోగ్య బీమా, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పిస్తామని తెలిపింది. ఇదంతా వినడానికి బాగానే ఉన్నప్పటికీ పనికి హాజరయ్యే మహిళా కార్మికులకు అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మహిళా కార్మికుల రక్షణ, భద్రతకు చర్యలు తీసుకుంటామని కంపెనీ చెబుతున్నప్పటికీ గత అనుభవాల దృష్ట్యా వారిని అనుమానాలు వీడడం లేదు. ఇప్పటికే కంపెనీలో కొందరు మహిళలు సెలూన్‌ విధులు నిర్వహిస్తున్నారు. మీకు రక్షణ, భద్రత ఉన్నాయా అని ప్రశ్నిస్తే వారిచ్చిన సమాధానం దిగ్భ్రాంతికి గురిచేస్తోంది.

సెల్వీ అనేక 38 ఏండ్ల మహిళ .బెంగళూరులో నివసిస్తున్నారు. ముగ్గురు సభ్యుల కుటుంబానికి ఆమే జీవనాధారం. 2020 నుండి ఆమె అర్బన్‌ కంపెనీలో బ్యూటీషియన్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 16న ఆదివారం యధావిధిగా విధులకు బయలుదేరారు. బుకింగ్స్‌ మధ్య పావుగంట కంటే ఎక్కువ విరామం లేకపోవడంతో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కూడా చేయలేదు. మధ్యాహ్నానికి బెంగళూరులోని హెచ్‌ఎస్‌ఆర్‌ లేఅవుట్‌ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ ఒకరికి ఫేసియల్‌ ట్రీట్‌మెంట్‌ చేయాల్సి ఉంది. అయితే కోపిష్టి అయిన ఆ క్లయింట్‌ అరుపులు, కేకలతో సెల్వీపై చిందులు తొక్కింది. సర్వీసు సంతృప్తికరంగా లేకుంటే క్యాన్సిల్‌ చేసుకుంటానని, ఓ పది నిమిషాలు సమయమిస్తే సామాను సర్దుకొని వెళ్లిపోతానని సెల్వీ వేడుకున్నారు. అయినా ఆ క్లయింటు వినకుండా సెల్వీ సామగ్రిని బయటికి విసిరేసి తలుపులు మూసేసింది. జరిగిన ఘటనపై ఫిర్యాదు చేసేందుకు సెల్వీ కంపెనీ ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్‌కు ఫోన్‌ చేశారు. రెండుసార్లు చేసినా ఎవరూ స్పందించలేదు. సుమారు అరగంట తర్వాత ఫోన్‌ వచ్చింది. అక్కడి నుంచి వచ్చేయాలని ఎగ్జిక్యూటివ్‌ సమాధానం చెప్పారు తప్ప ఆమెకు చేసిన సాయమేమీ లేదు.

అప్పటి నుంచి క్లయింట్‌పై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు సెల్వీ ప్రయత్నిస్తున్నారు. ఈ విషయంలోనూ కంపెనీ నుండి ఆమెకు సహాయ సహకారాలు లభించలేదు. పైగా ఆమెనే నిందించారు. సెల్వీ ఐడీని తాత్కాలికంగా బ్లాక్‌ చేశారు. అధికారికంగా ఫిర్యాదు చేయకుండా నిరుత్సాహపరుస్తున్నారు. సెల్వీ జాబితా నుండి ఆ క్లయింట్‌ను బ్లాక్‌ చేస్తామని మాత్రం చెప్పారు. భవిష్యత్తులో ఆ క్లయింటు నుండి మరో సహచరురాలికి కూడా ఇలాంటి వేధింపులు జరిగితే అప్పుడు ఏం చేస్తారని సల్వీ ప్రశ్నిస్తున్నారు. ఈ ఉదంతంపై అర్బన్‌ కంపెనీని ప్రశ్నించగా మహిళా కార్మికుల రక్షణ, భద్రత కోసం తాము తీసుకుంటున్న చర్యలను ఏకరువు పెట్టారే తప్ప సెల్వీకి ఏం న్యాయం చేస్తారో చెప్పలేదు.

అర్బన్‌ కంపెనీలో పనిచేస్తున్న మహిళలకు గతంలో కూడా ఇలాంటి చేదు అనుభవాలే ఎదురయ్యాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే హెల్ప్‌ డెస్కులు ఏర్పాటు చేసి, వాటిని పోలీస్‌ స్టేషన్లతో అనుసంధానించాలని ఆర్థికవేత్త మితాలీ నికోర్‌ సూచించారు. మహిళా కార్మికులకు తగిన రక్షణ కల్పించలేని పక్షంలో లక్షలాది మంది వేధింపులకు, దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉన్నదని ఆమె తెలిపారు. యాప్‌ ఆధారిత కంపెనీలలో పనిచేస్తున్న మహిళా కార్మికులకు సరైన వేతనాలు లభిస్తున్నాయా అంటే అదీ లేదు. గత కొన్ని సంవత్సరాలుగా వారి ఆదాయం తగ్గిపోతోంది. ఢిల్లీలో ఇంటి పనివారు గంటకు సగటున రూ.200 సంపాదిస్తున్నారు. అది కూడా ప్రాంతాన్ని బట్టి మారుతుంటుంది. ఇప్పుడు 'ఇన్‌స్టా మెయిడ్‌' గంటకు రూ.49 సంపాదించవచ్చునని చెప్పడం కంపెనీ ఫ్యూడల్‌ మనస్తత్వానికి అద్దం పడుతోంది. ఎందుకంటే నైపుణ్యం లేని పనివారు దేశ రాజధానిలో గంటకు వంద రూపాయలు సంపాదిస్తున్నారు. పైగా ఇంటి పని అనేది అసంఘటిత రంగానికి సంబంధించింది. వారికి రక్షణగా ఎలాంటి చట్టాలు ఉండవు. వీరు లేబర్‌ కోడ్ల పరిధిలోకీ రారు. ఇప్పటికీ దేశంలో 47.5 లక్షల మంది ఇంటి పనివారు ఉన్నారని అంచనా. వారి కోసం జాతీయ విధానాన్ని రూపొందిస్తామని ఐదు సంవత్సరాల క్రితం చెప్పిన కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా ఒక్క అడుగూ వేయలేదు.

పనిలో చేరేటప్పుడు శిక్షణ, ప్రాక్టీస్‌ కిట్‌ నిమిత్తం అర్బన్‌ కంపెనీ తమ వద్ద లక్ష రూపాయల చొప్పున వసూలు చేస్తోందని సెల్వీ తెలిపారు. కంపెనీ ఇచ్చే కమిషన్‌ 20-35 శాతం మధ్యన ఉంటుందని, అన్ని మినహాయింపులు పోగా చేతికి వచ్చేది స్వల్పమేనని ఆమె వాపోయారు. అర్బన్‌ కంపెనీలో పనిచేస్తున్న సెలూన్‌ కార్మికుల వేతనాలు గత రెండు సంవత్సరాల కాలంలో బాగా తగ్గాయి. అవసరమైన సామగ్రిని కంపెనీ నుండే విధిగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది. సేవల ధరను కూడా కంపెనీయే నిర్ణయిస్తుంది. ఇంటి పనివారికి కూడా కంపెనీ నిబంధనల ప్రకారం శిక్షణ ఇస్తామని అర్బన్‌ అంటోంది. ఇక విధినిర్వహణలో ఏదైనా ప్రమాదం జరిగితే అంతే సంగతులు. ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలేవీ ఉండవని కార్మికులు వాపోతున్నారు. మహిళా కార్మికులకు ప్రసూతి సెలవుల వంటి సామాజిక భద్రతా ప్రయోజనాలేవీ ఉండవు.

రాజ్యాంగానికి కట్టుబడి ఉండాలి

అలా అయితేనే మణిపూర్‌లో సవాళ్లను అధిగమించొచ్చు : సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్‌ కోటీశ్వర్‌ సింగ్‌



ఇంఫాల్‌ : ప్రజలు రాజ్యాంగానికి కట్టుబడి ఉంటేనే మణిపూర్‌లో సవాళ్లను అధిగమించవచ్చని సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్‌ ఎన్‌.కోటీశ్వర్‌ సింగ్‌ నొక్కి చెప్పారు. జస్టిస్‌ బి.ఆర్‌ గవాయ్‌ నేతృత్వంలోని సుప్రీంకోర్టు జడ్జిల బృందం శనివారం చురాచాంద్‌పూర్‌, బిష్ణుపూర్‌ జిల్లాల్లో పర్యటన సందర్భంగా ప్రజలలో ఆశావాదాన్ని చూసిందని తెలిపారు. మణిపూర్‌ హైకోర్టు 12వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. "ఒక చిన్న రాష్ట్రంగా మణిపూర్‌లోనూ సవాళ్లున్నాయి. కానీ, అదృష్టవశాత్తు కష్టకాలంలో మనకు మార్గదర్శకత్వం అందించే రాజ్యాంగం మనకు ఉన్నది" అని తెలిపారు.

అత్యున్నత న్యాయస్థానం జడ్జిల బృందం తమ పర్యటనలో భాగంగా ప్రజలలో ఉత్సాహాన్ని చూసిందన్నారు. "చురాచాంద్‌పూర్‌, బిష్ణుపూర్‌లలో చాలా ఆశావాదం ఉన్నది. సవాళ్లు ఉన్నాయి. రాజ్యాంగ విలువలకు కట్టుబడి ఉండటం ద్వారా వాటిని అధిగమించొచ్చు. చురాచాంద్‌పూర్‌ గొప్ప సంప్రదాయాలు, శక్తివంతమైన సమాజాన్ని కలిగి ఉన్నది. పలు కారణాలరీత్యా ఇంఫాల్‌ నుంచి ప్రజలు చురాచాంద్‌పూర్‌కు వెళ్లేవారు. న్యాయవ్యవస్థకు చురాచాంద్‌పూర్‌ సహకారాన్ని మనం చూశాం. ఇది మణిపూర్‌ హైకోర్టుకు ఇద్దరు ప్రముఖ జడ్జిలను అందించింది" అని చెప్పారు.

దేశాన్ని బలోపేతం చేయటంలో భాగంగానే ప్రజలు పని చేయాలనీ, బలహీనపర్చేలా వ్యవహరించొద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. "మీ కృషి, నిజాయితీ గుర్తింపు పొందుతాయని నేను హామీ ఇస్తున్నాను. మణిపూర్‌లాంటి సుదూర రాష్ట్రంలో ఉన్నందుకు మీరు ఒంటరిగా ఉన్నట్టుగా భావించకండి. మీ పనిని శ్రద్ధగా కొనసాగించండి. కష్టానికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుంది" అని కార్యక్రమానికి హాజరైన లాయర్లను ఉద్దేశిస్తూ జస్టిస్‌ కోటీశ్వర్‌ సింగ్‌ అన్నారు. ఐదుగురు సుప్రీంకోర్టు జడ్జిల ప్రతినిధి బృందం శనివారం మణిపూర్‌కు చేరుకొని, సహాయ శిబిరాలను సందర్శించిన విషయం విదితమే.

సమాఖ్య స్ఫూర్తిపై డీలిమిటేషన్‌ దాడి



(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించుకుంటున్నామని, ఈ సమ్మేళనంలో ఒక కార్యచరణను నిర్దేశించుకొని ముందుకు కదలాలని సూచించారు.

మనువాదంలోనే అసమానతలు : ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

ప్రపంచంలో ఏ మతంలో మనుషుల మధ్య అసమానతలు లేవని, కేవలం మనువాదంలోనే అసమానతలున్నాయని వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. మతం పేరిట జరుగుతున్న దౌర్జన్యాన్ని ఎండగట్టాలన్నారు. మనువాదాన్ని ఓడించడానికి ఎస్సీలు, బీసీలు మాత్రమే కాదని, అగ్రవర్ణాల్లోని ప్రగతిశీల భావాలున్న వారందరినీ కలుపుకుపోవాలని సూచించారు. మా మాష్టారు వెంకటరెడ్డి వల్లే తాను ఎస్‌ఎఫ్‌ఐలో చేరానని గుర్తు చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ పేరు వినగానే తన మనస్సు విశాలమవుతుందన్నారు. సాధారణంగా బతకడం కూడా విలువైనదని ఎస్‌ఎఫ్‌ఐ నేర్పిందని తెలిపారు. మనిషిని, మనిషిగా ఉన్నతీకరించేలా చూడాలన్నారు. ప్రస్తుతం కులం పిచ్చి పెరిగిందని, కుల రహిత సమాజాన్ని కోరుకోవాలన్నారు. త్యాగధనులను ప్రపంచం మరిచిపోదన్నారు. దుర్మార్గం అనేది తాత్కాలికంగానే భయపెడుతుందన్నారు. శ్రామిక ప్రజలతో నడవడమే చైతన్యమన్నారు. వారంలో ఒక్కరోజన్న మీ బిడ్డల్ని పనిచేయమని చెప్పండని కోరారు. మనిషిగా సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

విద్యార్థి ఉద్యమం, కమ్యూనిస్టు ఎర్రజెండాల ద్వారానే.. : సుద్దాల అశోక్‌ తేజ

విద్యార్థి ఉద్యమం, కమ్యూనిస్టు పార్టీలు, ఎర్రజెండాల ద్వారానే ప్రేరణ పొంది గుండెలను రగిలించే మాటనుండే పాట పుడుతుందని సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌ తేజ అన్నారు. పాట పల్లవి గెరిల్లాలా ఉండాలని తన తండ్రి చిన్నప్పుడే చెప్పారని, నాడు అందుకున్న మాటా పాటా ఈ రోజుకూ కొనసాగుతోందని అన్నారు. పాట రాయడం గొప్పకాదని, అది వృత్తి అని, పాట.. ఇతి వృత్తాన్ని ఎంచుకోవడమే గొప్ప కళ అని అన్నారు. పాట పాడటం, ట్యూన్‌ చేయడం, పాడటం, అనువదించడం అనేది కేవలం తెలంగాణ వాగ్గేయకారులకే ఉందని అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ వరంగల్‌ జిల్లా మాజీ అధ్యక్షులు జి. రాములు మాట్లాడుతూ.. 1960-70 మధ్యకాలంలో విద్యార్థి ఉద్యమాలు అంతర్జాతీయ స్థాయిలో జరిగాయని అన్నారు. ఫ్రాన్స్‌, వియత్నాం, కంపూచియలో ఉద్యమాలు పతాకస్థాయిలో జరిగాయని గుర్తుచేశారు. విద్యార్థి ఉద్యమాలే వ్యక్తిత్వ వికాసాన్ని కలిగిస్తాయన్నారు. నాడు హనుమకొండలోని కుమార్‌పల్లి వామపక్ష కేంద్రంగా ఉందని, అక్కడే ఎస్‌ఎఫ్‌ఐలో చేరి హాస్టల్స్‌, ఆర్ట్స్‌ కాలేజీ, కాకతీయ యూనివర్సిటీలో విద్యార్థి ఉద్యమాన్ని పటిష్టం చేశామని తెలిపారు. ఇలాంటి విద్యార్థి సమ్మేళనాలు కొనసాగాలని కోరారు. సమ్మేళనం ప్రారంభానికి ముందు ఎస్‌ఎఫ్‌ఐ పతాకాన్ని జి రాములు ఆవిష్కరించారు. ఈ సమ్మేళనంలో తెలంగాణ గ్రంథాలయ పరిషత్‌ చైర్మెన్‌ మహ్మద్‌ రియాజ్‌, ఎస్‌ఎఫ్‌ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్‌. వీరయ్య, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ల నాగరాజు, కేయూ మాజీ వైస్‌ఛాన్స్‌లర్‌ డాక్టర్‌ రమేశ్‌, పూర్వ విద్యార్థి నాయకులు ఎ నర్సింహారెడ్డి, బి. సాంబశివ, డాక్టర్‌ పసునూరి రవీందర్‌, కె. సారయ్య, జి. ప్రభాకర్‌రెడ్డి, సిహెచ్‌ రంగయ్య, టి ఉప్పలయ్య కోల వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, రాగుల రమేష్‌, మేరుగు అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.



రంజాన్‌ షాపింగ్‌ సందడి

చార్మినార్‌, మక్కా మసీదు వద్ద రద్దీ

రంజాన్‌ మాసంలో ముస్లింలంతా ఉపవాసదీక్షలు ఉంటారు. ఇఫ్తారీ అయిన తర్వాత షాపింగ్‌కు వెళ్లటం ఆనవాయితీ. హైదరాబాద్‌లో రాత్రి కూడా పగలు మాదిరిగా ఉంటోంది. ఈదుల్‌ ఫితర్‌ (రంజాన్‌ పండుగ) మరి కొద్ది రోజుల్లో రానున్నది. ఈ నెలంతా చార్మినార్‌, మక్కా మసీదు ప్రాంతాల్లో షాపింగ్‌ రద్దీగా ఉంటుంది. ఆదివారం ప్రకాశవంతమైన వెలుగుల మధ్య వ్యాపారులు, కొనుగోలు దారులతో రహదారులన్నీ కిటకిటలాడాయి.

నేను ఆరోగ్యంగానే ఉన్నా..

ఆస్పత్రి బాల్కనీ నుంచి దర్శనమిచ్చిన పోప్‌ ఫ్రాన్సిస్‌

రోమ్‌ : ఆసుపత్రిలో చేరిన సుమారు ఆరు వారాల తరువాత పోప్‌ ఫ్రాన్సిస్‌ ఆదివారం తొలిసారిగా ప్రజలకు బహిరంగంగా కనిపించారు. రోమ్‌లోని జెమెల్లి ఆస్పత్రి ప్రధాన ద్వారం బాల్కనీ వద్దకు ఆదివారం ఉదయం చక్రాల కుర్చీలో వచ్చి ప్రజలకు దర్శనమిచ్చారు. 88 ఏండ్ల పోప్‌ తన కుడిచేతి వేలును పైకెత్తి ఆస్పత్రి ప్రధాన ద్వారం వెలుపల గుమిగూడి ఉన్న ప్రజా సమూహాన్ని అభినందించారు. ఆస్పత్రి నుంచి పోప్‌ను త్వరలో డిశ్చార్జి చేస్తామని శనివారం సాయంత్రం ఆస్పత్రి వైద్యులు ప్రకటించిన సందర్భంలో ఈ విధంగా దర్శనమిచ్చారు. దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న పోప్‌ ఈ ఏడాది ఫిబ్రవరి 14న ఆస్పత్రిలో చేరారు. బ్రోన్కై టిస్‌ తీవ్రతరం కావడం, రెండు ఊపిరి తిత్తుల్లో న్యూమోనియా, ఫంగల్‌ శ్వాసకోశ సంక్ర మణ వంటి సమస్యలతో పోప్‌ బాధపడుతు న్నట్టు వైద్యులు తెలిపారు. ఈ నెల11నే పోప్‌ కోలుకు న్నారని, అయితే మరికొన్ని రోజులు ఆస్పత్రిలో ఉండాలని వైద్యులు తెలిపారు. శనివారం కూడా పోప్‌ను త్వరలో విడుదల చేస్తామని చెప్పిన వైద్యులు అయితే పోప్‌ సుమారు రెండు నెలల పాటు విశ్రాంతి తీసుకోవాలని, భారీ ప్రజా సమూహాలను కలవడం మానుకోవాలని తెలిపారు. న్యుమోనియా ఇన్ఫెక్షన్‌ విజయ వంతంగా నయం చేయబడినప్పటికీ, పోప్‌ ఫ్రాన్సిస్‌ తన ఊపిరితిత్తులలోని ఫంగల్‌ ఇన్ఫెక్షన్‌ చికిత్స కోసం చాలాకాలం పాటు నోటి ద్వారా తీసుకునే మందులు తీసుకోవడం కొనసాగించా లని, శ్వాసకోశ, శారీరక ఫిజియోథెరపీని కొనసాగిం చాలని వైద్యులు చెప్పారు. కాగా, పోప్‌ యువకుడిగా ఉన్న సమయంలోనే ఒక ఊపిరితిత్తులో కొంత భాగాన్ని తొలగించారు.



అకాల సూచి

అటూ ఇటూ అదే పనిగా
మోట బొక్కేనలా తిరగడుమూ
నీకు సరదానే కావచ్చు
వున్న చోటే చెట్టులా చేతుల కొమ్మలూపుకుంటూ
స్వేచ్ఛను పెయినిండా కప్పుకోవడం
నీకు జీవితాశయం కావచ్చు.
వాళ్లకు మాత్రం నువ్వు అనుమానిత సంఖ్యవే
తప్పి పోయిన పక్షి చూపులాంటి నిజం కోసం
చిక్కుబడిన శిబి చెయ్యిలాంటి
మానవీయత కోసం
కళ్ల కెమెరాలను అదే పనిగా
తిప్పడమూ నేరమే
నాది మనది అనే పదాలు
పూలభాషంతస్వచ్ఛమైనవికావచ్చు
మట్టిపై పుట్టిన ఊరుపై
తొలి జాము రెక్కలిరిచిన డేగలా
దౌడుకు సిద్ధమైన గుర్రంలా
నిర్భయంగా ఛాతి విరవడమూ శిక్షార్హమే
ప్రజలూ సమాజం హక్కులూ
దోపిడీ వివక్ష అణిచివేత పదాలు
గొంతుగుహలోనే వుడికిపోవాలికాని
స్వరమై భాస్వరమై పెకిలిపోయి
మండీ మండీ పేలడం దేశ ద్రోహమే
అన్నీ మరచి అన్నిటికీ తల వంచి
అల్లిన స్తోత్రాలు పంచిన శ్లోకాలు
ఉన్నదున్నట్లు అదే పనిగా
గానుగ కుర్రలా తిరగడమే
అసలు మనిషి ఆనవాలు
ఇన్ని వేధింపులు ఇన్నిఅణిచివేతలు
నిజంగా ఎంత గొప్ప జీవితం!
ఎంత గొప్ప స్వాతంత్ర్యం.!!

- డా. ఉదారి నారాయణ,
9441413666

కవిత్వంలో తాజా డిక్షన్

అరిగిపోయిన పదాలు అన్ని భాషలలో ఉంటాయి. నవ్యత కోసం ఆరాటపడేవాళ్లు వాటిని పరిహరించేందుకు సాధ్యమైనంత వరకు ప్రయత్నం చేస్తుంటారు. ప్రతి అరిగిపోయిన పదాన్ని మానుకోవడం అంత సులభం కాకపోవచ్చు. ఎందుకంటే, వాటి సంఖ్య పెద్దదిగా ఉంటుంది. పైగా కొన్ని పదాలు విభజనరేఖ మీద ఉంటాయి. అంటే, అవి అరిగిపోయిన పదాలు అని వంద శాతం కచ్చితంగా చెప్పలేం. పద్యకవిత్వంలో, భావకవిత్వంలో పాత పదాలను పూర్తిగా నిర్మూలించకపోయినా ఫరవాలేదు అని, నిజానికి అవి ఆ తరహా కవిత్వాలకు నప్పుతాయి అనీ అనిపిస్తుంది. కాని, ఇది సంశయం లేకుండా చెప్తున్న మాట కాదు.





- ఎలనాగ

తెలుగు భాషతో పోల్చి చూస్తే, ఇంగ్లిష్‌లో పాత పదాలకు స్వస్తి పలకడం కోసం ఎక్కువ ప్రయత్నాలు జరుగుతున్నాయన్నది పరిశీలనలో తేలిన విషయం. ఆ భాషలో మాట్లాడే, రాసే ఆధునికులు ఇప్పుడు వెరీ అనే పదాన్ని వదులుకోవాలంటున్నారు. ఉదాహరణకు very angry కి బదులు ఫ్యూరియస్‌బీ వెరీ ఫాస్ట్, వెరీ స్లో, వెరీ కోల్డ్‌లకు బదులు అదే క్రమంలో రాపిడ్, స్లగిష్, ఫ్రీజింగ్ రాయాలంటున్నారు. అదే విధంగా ప్రతిసారి congratulations అనే బదులు కొన్నిసార్లు వెల్ డన్, కుడోస్, వే టు గో అని; థాంక్యూకు బదులు గ్రేట్ ఫుల్, ఐ అప్రీషియేట్ ఇట్, ఐ ఓ యు వన్ అని; వెల్ కమ్ కు బదులు మై ప్లెజర్, ఎనీ టైమ్ అనీ రాయాలంటున్నారు. మై ఓన్ కు బదులు మై సరిపోతుందని, రియల్లీ, క్వైట్, ఇన్‌ఫాక్ట్ మొదలైనవాటిని పూర్తిగా మానుకోవాలనీ ... ఇట్లా, భాషలో తాజాదనం కోసం ఎన్నో విధాల సూచనలు చేస్తున్నారు. అంతే తప్ప, అవి భాష పరంగా తప్పులు అని కాదు. ఇంగ్లిష్ భాషలోని ఇటువంటి పదాల, పదబంధాల జాబితా పెద్దదిగా ఉంది కనుక, కొన్నింటిని మాత్రమే చెప్పి, తక్కినవాటిని వదిలేస్తున్నాను.

తెలుగులో కూడా విడిచిపెట్టవలసిన పాత పదబంధాలు ఉన్నాయి కొన్ని. నేను చెప్పబోయే పదాలలో కొన్ని అంతర్ధానం అయ్యాయి, కొన్ని అవుతున్నాయి, కొన్ని మాత్రం ఇంకా కొనసాగుతున్నాయి.

ఈ వాక్యాలను పరిశీలించండి:

- అధ్యక్షులవారికి భాష మీద మక్కువ ఎక్కువ.
- పురస్కారం పొందిన మిత్రునికి అభినందన చందనాలు.
- మన దేశం క్రికెట్ కప్పును గెల్చుకున్న సందర్భంగా సంబరాలు అంబరాన్నంటాయి.
- ఫలానా నటి ఆస్పత్రిలో పండంటి బిడ్డను కన్నది.
- భద్రాచలంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువుగా జరిగింది.
- చంద్రయాన్ - 3 ని ఆబాల గోపాలం ఆనందించడం విశేషం.
- మ్యాచ్ ఆసాంతం నరాలు తెగే ఉత్కంఠతో సాగింది.
- ఫలానా ఆటగాడు ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు.
- ఆ బుడతడు పోలీసులకే చుక్కలు చూపించాడు.
- వారు ఒప్పందానికి తూట్లు పొడిచారు.
- ఆ అధికారులు నియమాలను తుంగలో తొక్కారు.
- సభకు విచ్చేసిన అందరికీ స్వాగతం.

వీటిలో మక్కువ ఎక్కువ, అభినందన చందనాలు, సంబరాలు అంబరాన్నంటాయి, పండంటి బిడ్డను, కన్నుల పండువుగా, ఆబాల గోపాలం, నరాలు తెగే ఉత్కంఠ, ఆకాశమే హద్దుగా, చుక్కలు చూపించాడు, తూట్లు పొడిచారు, తుంగలో తొక్కారు, విచ్చేసిన - ఇవి అరిగిపోయిన పదబంధాలు అని అందరూ ఒప్పుకుంటారనుకుంటాను. మొదటి రెండు, ఉపన్యాసాలలో ఎక్కువగా వినిపించేవి. ఈ మధ్యకాలంలో వాటి వాడకం కొంచెం తగ్గినట్టుంది. అరిగిపోయిన పదాలనన్నింటినీ పూర్తిగా బహిష్కరించడం కాకుండా, కొన్ని సార్లు ప్రత్యామ్నాయ పదాలను, పదబంధాలను రాస్తే అవి అరిగిపోయిన (స్టీరియోటైప్డ్/ హాక్నీడ్/ క్లిషే) పదాలు అనిపించవు. ఉదాహరణకు మక్కువ ఎక్కువకు బదులు చాలా మక్కువ, ఎంతో మక్కువ, ఎక్కువ ఇష్టం, ఎంతో ఇష్టం... ఇలా వివిధ సందర్భాల్లో వివిధ రకాలుగా.

మరికొన్ని పదబంధాలు మరీ అంతగా కాకపోయినా కొంత వరకు అరిగిపోయాయి. ఉదాహరణకు దిక్కులు పిక్కటిల్లేలా, ధరలు మిన్నంటాయి, మాటలు కోటలు దాటాయి మొదలైనవి. అరిగిపోయిన పదాలు మన భాషలో మరెన్నో ఉండి ఉండవచ్చు. నిజానికి ఏ పదమైనా, పదబంధమైనా అతిగా వాడుకలో ఉన్నప్పుడు అది అరిగిపోయిందిగా మారుతుంది. ఐతే వీటిలో కొన్నింటిని పరిహరించే అవసరం లేదేమో. ఎందుకంటే, ఇవి తెలుగు భాషలోని నుడికారపు సొంపును కలిగి ఉన్నాయి. వేటిలోనైతే కేవలం ప్రాస మాత్రమే ఉంటుందో అవి కొన్నేళ్ల తర్వాత ఎబ్బెట్టుగా అనిపించడం ఖాయం.

ధన్యవాదాలు అని రాసేవాళ్లను గేలి చేయడమే కాకుండా వారిమీద తీవ్రమైన కోపాన్ని కురిపించారు రాచమల్లు రామచంద్రారెడ్డి తన పుస్తకం 'అనువాద సమస్యలు'లో. ఆ మాట ఒరిజినల్‌గా హిందీ భాషలోనిదని, కాబట్టి దాన్ని వాడేవారికి అసలు తెలుగే రాదనీ ఎద్దేవా చేశారు. నిజమే. అందుకే ఆ పదం ప్రామాణిక తెలుగు నిఘంటువులలో కనిపించదు. కానీ, సామాజిక మాధ్యమాలలో ఒక్కోసారి యాభై అరవై మంది అభినందనలు తెలుపుతారు. అప్పుడు ప్రతి ఒక్కరికి 'కృతజ్ఞతలు' అని రాయబుద్ధి కాదు కదా!? అందుకే కొన్నిసార్లు ధన్యవాదాలు అని రాస్తాం. అటువంటి సైట్లు 'లాంఛనాన్ని పాటించే అవసరం లేని భాషను (informal language ను) వాడేందుకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి.

ఇప్పటి వరకు చెప్పిందంతా వచనానికి సంబంధించింది. ఇక కవిత్వం విషయానికి వస్తే, ఆధునికులు ప్రతి సంస్కృత శబ్దాన్ని అరిగిపోయిందిగానే ఎంచుతారు. అది సబబే అనిపిస్తుంది కూడా. కానీ, చాలాసార్లు వాటిలోని కొన్ని పదాలు భాషకు శోభను చేకూరుస్తాయి. కేవలం పదాల శోభ కారణంగానే కవిత్వం స్ఫురించే సందర్భాలుంటాయని కూడా చెప్పవచ్చు. ఆ శోభకు కారణం ఆ పదాలలోని శాబ్దిక సౌందర్యం (phonetic beauty). ఐనా అవి ఆధునికులకు అసలే నచ్చవు. నచ్చకపోవడానికి కారణం అవి సంస్కృతం నుంచి వచ్చినవి కావడమే! అంటే వాళ్లు అటువంటి స్థిరమైన, బలమైన అభిప్రాయాన్ని ఏర్పరచుకుంటారన్న మాట.

సంస్కృతం లేకుండా తెలుగు భాష స్వతంత్రంగా మనలేదని, అందుకే సంస్కృత పదం/ అలంకారం ఒక్కటి కూడా లేకుండా కవిత్వం రాసి మెప్పించడం సాధ్యం కాదని అనుకుంటాం. కానీ, ఈ అభిప్రాయం తప్పు అని నిరూపించిన ఆధునిక కవులున్నారు కొందరు. రాజేశ్వరరావు లేదాళ్ళ, రాళ్ళబండి శశిశ్రీ, సాంబమూర్తి లండ, అనురాధ బండి, భారతి కోడె, డాక్టర్ కాళ్ళకూరి శైలజ, దాసరి మోహన్, గజ్జెల రామకృష్ణ మొదలైన మరెందరినో ఉదాహరణలుగా చూపవచ్చు. నేను కొత్త తరం కవులలోని కొందరి పేర్లను మాత్రమే సూచిస్తున్నాను. వీరి కవితలలో తాజా డిక్షన్ కోసం ప్రయత్నం కనిపిస్తుంది. మరెందరి కవితలలో కూడా తాజా భాష ఉండవచ్చు కానీ, డిక్షన్ అనే కోణంలోంచి మాత్రమే కాకుండా ఓవరాల్ గా పరిశీలించి చెప్తున్నాను. ఈ విధంగా చూసినా నా దృష్టికి రానివారు మరికొందరు ఉండవచ్చు.

సంస్కృత పదాలను ఉపయోగిస్తూ కవిత్వం రాసి మెప్పించడంకన్న, దాదాపు అన్నీ అచ్చతెలుగు పదాలనే రాసి మెప్పించడం కష్టం. ఎందుకంటే అప్పుడు, కేవలం పదాల శోభ తాలూకు అడ్వాంటేజ్ (అనుకూలత కలిగిన ప్రయోజనం) లేకుండా రాసి మెప్పించాలి. తాజాదనంతో కూడుకున్న భాషకు వచన కవిత్వంలో ప్రాధాన్యం ఉండటం సమంజసమైన విషయమే.

కేవల వ్యాసంగానికి కాక



నవ నాగరిక వీధులన్నీ నగ్నంగానే కనిపిస్తాయి కానీ
వాటిలో నివసించే అవకాశవాదాల్ని అవలోకించి
ఇమడలేక ముక్కుసూటిగా ముందుకే దూసుకెళ్తాను
కాలానుగుణంగా ఆశయాలను మార్చుకోలేని అశక్తతతో
స్థితప్రజ్ఞుడనై నిరంతరం రాజీలేని పోరాటాన్ని సాగిస్తాను
అసూయా అత్యాశలు కొలువుదీరిన రంగస్థలంపై
ఎవరికీ చెందని గూటికోసం అన్వేషిస్తాను
రాత్రిపడ్డ పొగమంచును కొద్దికొద్దిగా విడదీస్తూ
తుషార బిందువులతో మెరిసే గడ్డిపరకలకు
మరింత హరిత వర్ణాన్ని అద్దాలని తలపోస్తాను
నేలమీద చెల్లాచెదురుగా వెదజల్లబడి రాలినట్లుండే
పగడపువ్వుల పరిమళాలను ఆఘ్రాణిస్తూ
వారసత్వ భవిష్యత్తుకై విశ్వాసాన్ని ప్రోదిచేస్తాను
బలవంతుల కుట్రలకు బలైన బాధితులకు
క్షితిజరేఖ వద్ద ఎదురుచూసే విధివంచితులకు
బాధ్యత గుర్తెరిగి బలమైన చేయూతనందిస్తాను
నా అంతస్సాక్షి కొలిమిలో కాలుతున్న అంతరాత్మను
ఒక ఆకృతిగా మలచడానికి దహించుకుపోతుంటాను
వదరుబోతుతనంతో కేవల వ్యాసంగానికి కాక
లక్షోపలక్షల కార్యరూపాల్లోకి దాల్చాలని
చలికీ చీకటికీ నక్కుకోక ఓ దయామయీ!
నీకై నీవు స్వయంగావస్తే అక్కునచేర్చుకుంటాను
ప్రేయసీ ప్రేయసీ! పేదవాడను నేను
విసరవే నీ చూపులను విస్తారం చేసి!!

- కరిపె రాజ్ కుమార్, 8125144729


తల్లిదండ్రి

నువ్వు తల్లివి
పొలాన్ని నాగలితో దువ్వుతావు
అది బోడితలైతేనేం
ఆప్యాయంగా నీళ్ళంటుతావు విత్తుతావు
జుత్తు ఒత్తుగా పెరిగి
పేలు పడితే కలుపు తీస్తావు
నాలుగు నెలల్లో
నీ పొలం బిడ్డ తల పండుతుంది
తండ్రీ! ఈ లోకం కడుపు అచ్చంగా నిండుతుంది.

- నలిమెల

వ్యంగ్య రచనలో ల్యాండ్‌మార్క్








శీతాకాలం ఉదయం తొమ్మిది గంటల ఎండలా మిలమిల్లాడిన వయసులో కళ్లలో పడి ఇప్పటికీ హృదయ కొసలని దాటని పుస్తకం. అప్పుడప్పుడే పై పెదవి మీద మొలిచిన రాగి తీగల్లాంటి వెంట్రుకల నడుమ, ఊరుతున్న టెస్టోస్టిరాన్ వేగానికి తల్లడిల్లిపోయే బాడీని కాపాడిన పుస్తకం. కళ్ళకి అడ్డుపడే కౌమార దశ ఉక్కిరిబిక్కిరి ఊగిసలాటలోంచి బయటికి లాగిన సతత ప్రియ పుస్తకం పతంజలి గారి ఒక దెయ్యం ఆత్మ కథ. ఇంటర్ మొదటి ఇయర్ లైబ్రరీలో చూసి,ఒక దెయ్యం ఆత్మకథ టైటిల్ నచ్చి తీసుకుని చదవడం మొదలు పెడితే ఏదో తెలియని ఇదీ అని చెప్పలేని రాయలేని అనుభూతి కలిగింది గానీ అర్థం కాలేదు. నరాల్లోకి ఇంకలేదు. రక్తంలో కలవలేదు. అదే ఏడు పది పన్నెండు సార్లు లైబ్రేరియన్‌ని ఇవ్వను అన్నప్పుడల్లా బతిమాలుకొని చదివాను. చివరికి ఇచ్చేస్థాయి దాటిపోయాక తస్కరించి సూట్‌కేస్ లో దాచాను. ఆ నవలిక ప్రారంభ వాక్యాలు నన్నో నీలికళ్ల గులాబీరంగు ఆడపిల్లలా ఆకర్షించాయి. అనేకానేక సీతాకోక చిలుక రెక్కల మీద ఒక ప్రముఖ దెయ్యం రాసుకున్న ఆత్మ కథ అనే వాక్యాల్తో ప్రారంభం అయ్యి, అక్షరాలా యాభయి తొమ్మిది పేజీల ఈ చిన్ని నవలిక ఆద్యంతం ప్రతి పేజీ కళ్లు తిప్పకుండా చదివిస్తుంది. దెయ్యాల గురించి రాసినట్టు ఉంటుంది. ఆ దెయ్యం నేనే అనిపిస్తుంది. నేనే కాదు నా చుట్టూ మనుషులు కూడా దెయ్యాలే అని కూడా అనిపిస్తుంది. ఒక్కమనిషి పాత్ర లేని కథ. చిలక కథ. సాలె పురుగు కథ, తాబేలు కథ. కుందేలు కథ. తెల్ల కాకుల కథ. గబ్బిలాల కథ. మిడతల కథ. ఇలా పన్నెండు కథల కథ ఈ నవలిక మిడతల కథ నన్ను బాగా ఊహల్లో ముంచింది. వ్యంగ్య రచనలో ల్యాండ్‌మార్క్ ఈ రచన అనిపిస్తుంది. జంతువుల ద్వారా రకరకాల మానవ దుష్ట నష్ట నికృష్ట కృత్య నృత్యాల్ని దెయ్యాన్ని ప్రతీకాత్మకంగా చేసి రాశారు. ఈ టెక్నిక్ ఈ ఫామ్ ఈ స్టైల్ ఇప్పటికీ నన్ను అబ్బురపరుస్తానే ఉంటాయి. ఇప్పటికీ ఎప్పటికప్పుడు ఈ టెక్స్ట్ కొత్త కొత్తగా అర్థమవుతూ ఉంటుంది. తల పండిన తార్కికుడు జీవితాన్ని నిర్వచిస్తే ఎలా ఉంటుందో అచ్చం అలా ఉంటుంది. రసవిద్య తెలిసిన కవి దుఃఖాన్ని రాస్తే ఎలా ఉంటుందో అలానే ఉంటుంది. ప్రారంభంలో ఇలా రాయాలని తెగ ప్రయత్నించే వాడ్ని కానీ కుదిరేది కాదు. నాకే కాదు పతంజలి గారిలా రాయడం ఎవరికీ సాధ్యం కాదు. ఎవరైనా నేనూ ఇలా రాగలను రాస్తాను అనుకుంటే దానికి మించిన జోక్ ఇంకోటి ఉండదు. నా ఆల్ టైం బెస్ట్ ఒక దెయ్యం ఆత్మకథ.

- మారాబత్తుల పెద్దన్న

బన్న అయిలయ్య జీవితం - సాహిత్యం



కవిగా, విమర్శకుడిగా ప్రసిద్ధిగాంచిన బన్న ఐలయ్య 36 సంవత్సరాలు కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగు విభాగంలో అధ్యాపకులుగా పనిచేసి - ప్రొఫెసర్, హెడ్, డీన్, ప్రిన్సిపాల్‌గా అంచెలంచెలుగా ఎదిగారు. తెలుగు శాఖ అధ్యక్షులుగా, పాఠ్య ప్రణాళికా మండలి అధ్యక్షులుగా, ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్‌గా, అదనపు పరీక్షల నియంత్రణ అధికారిగా, పీఠాధిపతిగా, ప్రిన్సిపాల్‌గా ఎన్నో పదవులను సజావుగా నిర్వహించి ఆ పదవులకే వన్నెతెచ్చారు. బన్న అయిలయ్య పదవీ విరమణ సందర్భంగా షష్టిపూర్తి అభినందన సంచిక తీసుకురావాలని పాత విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు కలిసి చేసిన ప్రయత్నమే ఈ బృహత్ సంచిక. 600 పేజీలతో ఒక అభినందన సంచిక తీసుకురావడం అపూర్వం, అద్భుతం.

ఈ సంచికను "అభినందన, ఆత్మీయం, అక్షర యానం" అనే విభాగాలుగా వర్గీకరించారు. మొదట 'అభినందన' లో 28 మంది ప్రముఖులు తమ సందేశాలను అందజేశారు. 'ఆత్మీయం' లో 107 వ్యాసాలున్నాయి. ఇందులో తన పాత క్లాస్ మెట్లు, తన గురువులు, కొలీగ్స్, మిత్రులు, కవులు, రచయితలు, ఉద్యమకారులు, తన అభిమానులు, విద్యార్థులు, బంధువులు- ఇలా ఎంతోమంది తమ పరిచయాలనుండి బన్న అయిలయ్య విశిష్టతను, గొప్పతనాన్ని తెలియజేశారు. అధ్యాపకుడిగా బన్న అయిలయ్య నిబద్ధతను- అంకితభావాన్ని కొన్ని వ్యాసాలు, పరిపాలనాదక్షునిగా కొన్ని వ్యాసాలు, విద్యార్థుల పురోగతిని కాంక్షించే గురువుగా కొన్ని వ్యాసాలు, స్నేహితులు- బంధువులు- విద్యార్థులకు పంచిన ఆత్మీయతను వెల్లడించిన వ్యాసాలు కూడా ఇందులో ఉన్నాయి. ఈ వ్యాసాలు అన్నీ బన్న అయిలయ్య వివిధ పార్శ్వాలను, బహుముఖీనతను తెలియజేస్తాయి. 'అయి లయ్య చైతన్య శక్తి' అని కాత్యాయని విద్మహే వివరించగా, తెలంగాణ అరిస్టాటిల్ అని కత్తి పద్మారావు కొనియాడగా ఆధునిక కవి విమర్శకులని రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, సంయమనం- సమన్వయం- సమగ్ర వ్యక్తిత్వం అని నందిని సిద్దారెడ్డి విశ్లేషించారు. నిలువెత్తు విజ్ఞాన భాండాగారం అని కొలిపాక శ్రీనివాస్, నిత్య సాహిత్య స్ఫూర్తి అని కోయి కోటేశ్వరరావు చివరకు 'సామాజిక అస్తిత్వ చైతన్యమే అయిలన్న జీవితం' అని అన్నవరం దేవేందర్ నిర్ధారించారు. బన్న అయిలయ్య సహృదయులు, స్నేహశీలి అని తెలిసినా, ఇందులోని వ్యాసాలు చదువుతుంటే అది ఎంత నిజమో అందరికీ తెలిసిపోతుంది.

'అక్షర యానం' విభాగంలో కవిగా, విమర్శకుడిగా, సాహిత్య వేత్తగా బన్న అయిలయ్య రచనలను వివిధ కోణాలలో విశ్లేషిస్తూ 45 మంది తమ వ్యాసాలను రాశారు. 'చైతన్య జ్వలిత అయిలయ్య కవిత' అని ఎలగొండ రాములు రాయగా, 'రహస్య చిత్రం' కవితా సంపుటి మీద కొందరు రాయగా, నిప్పు కణిక దీర్ఘకావ్యం మీద అందులోని సామాజికాంశాల మీద సునారి కిష్టయ్య, దళిత దృక్పథం మీద కల్వడపు రమేష్, దళిత బహుజన తత్వము మీద దార్ల వెంకటేశ్వరరావు, ఆత్మగౌరవ సంకేతంగా జీవి రత్నాకర్ మొదలైన వారు విశ్లేషించారు. తెలంగాణ కథ మీద బన్న ఐలయ్య గారి కృషిని వివరిస్తూ ప్రొఫెసర్ సూర్య ధనంజయ్, స్వప్న భువకర్ వ్యాసాలను రాశారు. 'విమర్శకుడిగా ఆచార్య బన్న అయిలయ్య' గా అంపశయ్య నవీన్, 'నిశిత పరిశీలకుడు ఆచార్య అయిలయ్య' గా డాక్టర్ ముదిగొండ సుజాతారెడ్డి, దళిత సాహిత్య విమర్శకుడిగా ఏటూరి జ్యోతి, మంథని శంకర్- కవితా విమర్శకుడిగా భూదాటి వెంకటేశ్వర్లు, అస్తిత్వవాద విమర్శలో బన్న అయిలయ్య అని సిహెచ్ లక్ష్మణ చక్రవర్తి, తెలంగాణ సాహిత్య చరిత్ర పునర్నిర్మాణ ఉపయుక్తగా డాక్టర్ ఎస్ రఘు, 'ధార' విమర్శ పుస్తకాన్ని విశ్లేషిస్తూ సుంకిరెడ్డి నారాయణరెడ్డి, కరిమిండ్ల లావణ్య రాసిన వ్యాసాలు ఉన్నాయి. 'అయిలయ్య కొన్ని వచన రచనలు' పై బివిఎన్ స్వామి, 'సామాజికాంశాల పర్యవేక్షకులు డాక్టర్ బన్న అయిలయ్య' అంటూ డాక్టర్ టి శ్రీరంగస్వామి, 'ఆచార్య బన్న పీఠికలు -సాహిత్య సారాంశ దీపికలు' అంటూ పొన్నాల ఉపేందర్, 'బాల సాహిత్యానికి చేయూతనిచ్చిన బన్న' అని డాక్టర్ వి ఆర్ శర్మ వివరణాత్మక వ్యాసాలు రాయగా- 'బోధనకు విమర్శకు దిక్సూచి' అంటూ డాక్టర్ పెద్ది వెంకటయ్య కొనియాడారు. ఈ 45 వ్యాసాలు కొన్ని రిపీటెడ్ గా కనిపించినా ఎవరి దృక్పథం వారిదే, ఎవరి శైలి వారిదే అని చదివిన తర్వాత అవి డిఫరెంట్ గా ఉన్నాయని మనం తప్పకుండా గుర్తిస్తాం. ఈ వ్యాసాలన్నీ సాహిత్యకారుడిగా బన్న అయిలయ్య విశ్వరూపాన్ని చూపిస్తాయి. బన్న అయిలయ్య జీవితాన్ని, సాహిత్యాన్ని గురించి తెలుసుకోవాలనుకునేవారికి ఈ సంచిక ఒక దిక్సూచిలా ఉపయోగపడుతుంది.



- కె.పి.అశోక్ కుమార్
9700000948

సాహితీ వార్తలు

ప్రజాశక్తి సాహితీసంస్థ కథ, పాటల రచనల పోటీ - 2025

ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా ప్రజాశక్తి సాహితీసంస్థ 'కథ, పాటల రచనల పోటీ - 2025' కు గాను రచనలను ఆహ్వానిస్తున్నది. ఇతివృత్తం సామాజిక స్పృహతో కూడినదై, ఎ4 సైజులో 3 లేదా 4 పేజీల కథ ఈ పోటీకి ప్రత్యేకంగా రాసి పంపించాలి. పాట కనీసం 4 చరణాలకు తగ్గకూడదు. 6 చరణాలకు మించకూడదు. psrachanalapoti2025@gmail.com కు ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్ రూపంలో కూడా రచనలను పంపవచ్చును. రచనలు పంపించవలసిన చిరునామా : ప్రజాశక్తి సాహితీసంస్థ, 'మేడే కథలు, పాటల రచనల పోటీ - 2025', ప్రజాశక్తి భవన్, డోర్.నెం. 12- 402/1/1, అమరారెడ్డి కాలనీ, అరవిందా హైస్కూల్ వద్ద, తాడేపల్లి, - 522 501. చివరి తేది 2025 ఏప్రిల్ 25. సమాచారం కొరకు : 9490099059

- వి. కృష్ణయ్య, ఛైర్మన్, ప్రజాశక్తి సాహితీసంస్థ

కె.వి.మేఘనాధ రెడ్డికి డాక్టర్ వి. చంద్రశేఖరరావు సాహిత్య పురస్కారం

విలక్షణ రచనాశీలి డాక్టర్ వి.చంద్రశేఖరరావు 13 జయంతి సందర్భంగా ఆయన పేరున చంద్రశేఖరరావు సాహిత్య పురస్కారాన్ని 2025 సంవత్సరానికి గాను యువ కథా, నవలా రచయిత చిత్తూరు జిల్లా పలమనేరుకు చెందిన కె.వి.మేఘనాధ రెడ్డికి ప్రదానం చేయాలని చంద్రశేఖరరావు సాహితీ కుటుంబం నిర్ణయించింది.

- డాక్టర్ వి.ప్రసూన

కథలపోటీ

వాసాఫౌండేషన్ సాహితీకిరణం సంయుక్త ఆధ్వర్యంలో డా॥వాసా ప్రభావతి స్మారక కథలపోటీ నిర్వహిస్తున్నది. ఏదైనా సామాజిక అంశానికి సంబంధించినదై ఉండి కుల, మత, వర్గ ప్రశస్తి లేకుండా రాతప్రతిలో ఎ4 సైజులో నాలుగు పేజీలు, డిటిపి అయితే రెండు పేజీలకు మించరాదు. కథలు పోస్ట్/కొరియర్ ద్వారా మాత్రమే ఏప్రిల్ 30వ తేదీ లోపు పంపాలి. చిరునామా: సాహితీకిరణం, ఇం.నెం.11-13-154, అలకాపురి, రోడ్‌నెం.3, హైదరాబాద్-500102. సెల్: 9490751681

- పొత్తూరి సుబ్బారావు, సంపాదకులు

ఔటర్ రింగ్ రోడ్డుపై కారు బీభత్సం

- ఒకరు మృతి, ఐదుగురికి తీవ్ర గాయాలు
- నార్సింగి పీఎస్ పరిధిలో ఘటన



నవతెలంగాణ-గండిపేట్

రంగారెడ్డి జిల్లా నార్సింగి ఔటర్ రింగ్ రోడ్డుపై ఓ క్యాబ్ (కారు) బీభత్సం సృష్టించింది. అతివేగంతో డివైజర్‌ను ఢీకొట్టి.. పల్టీలు కొట్టుకుంటూ అవతలి రోడ్డులో వెళ్తున్న టాటా సఫారీ కారుని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం జరిగింది. నార్సింగ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ నియోజకవర్గం శివరాంపల్లికి చెందిన ఆనంద్ కాంబ్లీ (40) క్యాబ్ డ్రైవర్. ఆదివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి గచ్చిబౌలికి కారులో వెళ్తున్నారు. నార్సింగ్ వద్దకు రాగానే కారు అతివేగంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి, అనంతరం అవతలి రోడ్డులో గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళ్తున్న టాటా సఫారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్ కాంబ్లీ అక్కడికక్కడే మృతిచెందాడు. కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్షతగ్రాతులను వెంటనే ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో రెండు కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అర్థవంతమైన చర్చేదీ..?

(మొదటిపేజీ తరువాయి)

జూనియర్ల నుంచి ఇదే రకమైన పోకడ కనిపించింది. స్వపక్షానికి చెందిన సీనియర్లు జోక్యం చేసుకుని, మందలించిన తర్వాత కూడా ఈ రకమైన చేష్టలు ఆగకపోవటం గమనార్హం. మరోవైపు ప్రశ్నోత్తరాల సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలంటూ స్పీకర్ ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ... సభ్యులు ఆయన విజ్ఞప్తిని పట్టించుకున్న దాఖలాలు కనబడటం లేదు. ప్రశ్నలు, జవాబులకు బదులు సుదీర్ఘమైన వివరణలు, రాజకీయ ప్రసంగాలు చేస్తుండటంతో మొత్తం 10 నుంచి 15 ప్రశ్నలు పూర్తి కావాల్సిన సమయంలో కేవలం నాలుగైదు మాత్రమే పూర్తవుతున్నాయి. ఈ క్రమంలో స్పీకర్ మిగతా వాటిని రద్దు చేయటమో, లేదంటే రాతపూర్వక సమాధానాలు ఇస్తామంటూ సర్దిజెప్పటమో చేయాల్సి వస్తోంది. చివరకు ప్రజలకు సంబంధించిన అత్యంత కీలకమైన సమస్యలు, ప్రశ్నలు లేకుండానే 'క్వశ్చన్ అవర్' ముగిసిపోతోంది. ఫలితంగా ప్రజలకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అంశంపై ఇటీవల ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఓవైసీ నిరసన వ్యక్తం చేస్తూ తమ సభ్యులతో కలిసి సభ నుంచి వాకౌట్ చేసిన సంగతి విదితమే. దీంతోపాటు ముఖ్యమైన పద్దులపై చర్చ జరుగుతున్నప్పుడు కూడా ప్రభుత్వ విప్‌లు 'కోరం' కోసం వెదుక్కోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. శనివారం వ్యవసాయ పద్దుపై చర్చ జరుగుతున్న సమయంలో అన్ని పక్షాల నుంచి కలిపి మొత్తం 14 మందే సభలో ఉన్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో అసెంబ్లీలో వామపక్ష సభ్యుల బలం తగినంతగా లేని లోటు స్పష్టంగా కనిపిస్తోంది. అధికారపక్షం తప్పుడు నిర్ణయాలు తీసుకున్నప్పుడు గతంలో లెఫ్ట్ పార్టీల సభ్యులు 'తమదైన శైలి'లో చాకచక్యంగా, లౌక్యంగా వ్యవహరించి సర్కారును ఇరుకున పెట్టేవారు. బడ్జెట్‌పైనా, ఇతర అంశాలపైనా నిర్దిష్ట సమాచారంతో సభకు హాజరై అర్థవంతమైన చర్చల ద్వారా ప్రజలకు న్యాయం చేసేవారు. అధికార పక్షం 'అదుపు' తప్పినప్పుడు, ప్రధాన ప్రతిపక్షం దాన్ని నిలువరించలేక 'చతికిలబడ్డప్పుడు', ఆ రెండింటి మధ్య ఆగ్రహావేశాలు పెల్లుబకినప్పుడు వామపక్షాల సభ్యులు వాతావరణాన్ని చల్లబరిచి, చక్కదిద్దేవారు. ఆ రకంగా సభా హుందాతనాన్ని కాపాడుతూనే ప్రజల పక్షాన నిలబడేవారు. ఇప్పుడు ఆ పార్టీలకు సభలో తగినంత సంఖ్యాబలం లేని లోటు స్పష్టంగా కనబడుతోంది. కాగా అసెంబ్లీకి పెద్ద దిక్కయిన స్పీకర్ మాత్రం 'పెద్ద మనసుతో' కొత్త సభ్యులకు మాట్లాడేందుకు కావాల్సిన సమయమిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు. గత రెండు మూడు రోజుల నుంచి ఆయన ఇదే రకంగా వ్యవహరిస్తున్నారు. జీరో అవర్‌ను సభాపతి ఇందుకు వినియోగించుకుంటున్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులకు కూడా ఆయన కావాల్సినంత సమయమిచ్చారు. కానీ ఒక్క సీపీఐ తప్ప మిగతా ఏ పక్షమూ దాన్ని వినియోగించుకోకపోవటం విచారకరం.

నాగ్‌పూర్‌లో కర్ఫ్యూ ఎత్తివేత

- అల్లరు జరిగిన ఆరు రోజుల తర్వాత..

సున్నితమైన ప్రాంతాల్లో పెట్రోలింగ్


మహారాష్ట్ర: నాగ్‌పూర్‌లోని అన్ని ప్రాంతాల నుంచి ఆరు రోజుల తర్వాత కర్ఫ్యూ ఎత్తివేశారు. సున్నితమైన ప్రాంతాల్లో పెట్రోలింగ్ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. 17న జరిగిన హింసాకాండ తర్వాత, నాగ్‌పూర్‌లోని కొత్వాలి, గణేష్‌పేట్, తహసీల్, లకడ్‌గంజ్, పంచ్‌పావ్లి, శాంతి నగర్, సక్కర్‌దార, నందన్‌వన్, ఇమాంబర, యశోధర నగర్ , కపిల్ నగర్ పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో కర్ఫ్యూ విధించారు. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సమాధిని తొలగించాలని డిమాండ్ చేస్తూ విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ నిర్వహించిన నిరసన సందర్భంగా మతపరమైన శాసనం ఉన్న 'చాదర్'ను దహనం చేశారని సోమవారం రాత్రి పుకార్లు వ్యాపించడంతో నాగ్‌పూర్ కేంద్ర ప్రాంతాలలో హింస చెలరేగింది.

హింసకు పాల్పడిన వారు నష్టాలను భర్తీ చేయకపోతే, వారి ఆస్తులను జప్తు చేసి వేలం వేస్తామని ఆయన అన్నారు. హింసాకాండలో పోలీసు అధికారులపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

రైతుకు భరోసా ఏది?

పంట అమ్ముకోవడం అంత ఈజీ కాదు

- బడ్జెట్‌కు ఆమడదూరంలో మార్కెటింగ్ శాఖ?
- నిర్వహణ పద్దులే తప్ప... ప్రగతి పద్దు జీరో
- మౌలిక వసతుల బాధ్యత మార్కెటింగ్ కమిటీలదే
- పంటలమ్మిన కమీషన్, అద్దెలతోనే మనుగడ



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతు తమ పంటను అమ్ముకోవడం అంత ఈజీ కాదు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు అన్నదాత అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. మార్కెట్‌లో రైతుకు కనీస వసతుల కొరత, రవాణా చార్జీల భారం, సకాలంలో పంట అమ్ముడుపోతుందో, లేదోననే ఆందోళన. పంటను మార్కెట్‌కు తీసుకొచ్చిన తర్వాత అధికారుల కొర్రీలు, దళారుల మోసం, వానల భయం, అందుబాటులో ఉండని టార్పాలిన్ కవర్లు, గోనెసంచులు... ఇలా అడుగడుగునా ఆటంకాలు. వీటన్నింటిని దాటుకుంటూ పంటను అమ్ముకోవడం కత్తిమీద సామే. ఆర్నెల్లు పడ్డ కష్టం ఒకెత్తయితే దాన్ని అమ్ముకోవడం మరో ఎత్తయి పెనుసవాల్‌గా మారుతోంది. ఒకవైపు రైతు సంక్షేమమే లక్ష్యమంటూ చెబుతున్న సర్కారు... పంటను అమ్ముకునేందుకు అన్నదాతకు ఆసరాగా ఉండటం లేదు. తమ ఉత్పత్తులకు ధర గ్యారంటీ అన్న భరోసా లేదు. మార్కెట్ల అభివృద్ధికి నిధులు కేటాయించకుండా ఈ ప్రభుత్వం తన వైఖరేంటో చెప్పకనే చెబుతున్నది.

ప్రగతి పద్దు 'జీరో'

మూడు లక్షల, నాలుగువేల కోట్ల రూపాయల బడ్జెట్‌ను ప్రతిపాదించిన రాష్ట్ర ప్రభుత్వం... ఆ కేటాయింపుల్లో మార్కెటింగ్ శాఖను ఆమడ దూరంలో ఉంచింది. పైసా కేటాయించకుండా మార్కెట్లు ఎలా అభివృద్ధి చెందుతాయన్నదే ఇప్పుడు రైతులను తొలిచివేస్తున్న ప్రశ్న. ఆయా మార్కెట్లలో కనీస వసతులైన రైతులకు విశ్రాంతిగదులు, మరుగుదొడ్లు, ఆహారం, మంచినీరు, రవాణా సౌకర్యం, పంటల భద్రతకు బడ్జెట్‌లో 'జీరో' నిధులిచ్చింది. మార్కెట్ల నిర్వహణ బాధ్యతను వ్యవసాయ మార్కెట్ కమిటీలకు అప్పగించినట్టు కనిపిస్తున్నది. ఒక శాతం కమీషన్, అద్దెల రాబడితో రైతులకు సరైన వసతులను కల్పించడం సాధ్యమా? అన్నది చర్చనీయాంశమవుతున్నది. అరకొర నిధులతో వ్యవసాయ మార్కెట్ కమిటీలు కూడా ఏమీ చేయలేక చేతులెత్తేస్తున్నాయి. మార్కెట్ నిర్వహణ కూడా సక్రమంగా ఉండటం లేదు. చాలా మార్కెట్లకు ప్రహరీలు కూడా లేవు. పార్కింగ్ సమస్య తీవ్రంగా ఉన్నది.

ఒక శాతం కమీషన్...వసతులు కల్పించేదెలా?

రాష్ట్రంలో 197 వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలు, 85 సబ్ మార్కెట్ యార్డులున్నాయి. మరో 40 రైతు బజార్లు పని చేస్తున్నాయి. ఈ మార్కెట్లలో మూడు సేవల కింద (ప్రభుత్వ సేవ, వ్యవసాయ మార్కెట్ కమిటీ సేవ, కేంద్ర మార్కెట్ నిధి సేవ) 2,229 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వరి, మొక్కజొన్న, కంది, వేరు శనగ, సోయా, పెసర్లు, పత్తి, పొద్దు తిరుగుడు, సెనగలకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధరను అమలు చేస్తున్నది. పంటల దిగుబడిని బట్టి రాష్ట్ర మార్కెట్ శాఖ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుంది. మార్కెటింగ్ శాఖకు ఒక శాతం కమీషన్ వస్తుంది. దీంతో కవర్లు, తూనిక యంత్రాలు, తేమ మీటర్లు, ధాన్యం శుభ్రపరిచే యంత్రాలను అందుబాటులో ఉంచుతుంది. ప్రస్తుత బడ్జెట్‌లో వీటి నిర్వహణకు రూ.141 కోట్లు మాత్రమే కేటాయించి ప్రభుత్వం చేతులు దులుపుకున్నది.

మధ్యదళారుల పెత్తనమే

అన్ని మార్కెట్లలో మధ్యదళారుల పెత్తనమే రాజ్యమేలుతున్నది. మార్కెట్‌కు పంటను తీసుకొచ్చిన తర్వాత దానికి ధర విషయంలోనూ వారిదే తుది నిర్ణయం. రైతుకు నచ్చినా, నచ్చకపోయినా అడ్డికి పావుసేరు అమ్ముకుని పోవాల్సిందే. నిజామాబాద్ పసుపు మార్కెట్‌లో పసుపు క్వింటాల్‌కు రూ. 8వేలు పలుకున్నది. అదే పసుపు మహారాష్ట్ర మార్కెట్‌లో రూ. 13వేల పలుకుతున్నది. దళారులు సిండికేటుగా ఏర్పడి తక్కువకు కొని ఎక్కువ ధరకు అమ్ముకుంటున్నారు. దీనికి అధికారులు కూడా వంత పాడుతున్నారనే ఆరోపణలున్నాయి. పంటకు సరైన ధర రాకపోతే అక్కడే రైతులు తమ ధాన్యాన్ని నిల్వ చేసుకునేందుకు గోదాములు, కోల్డ్ స్టోరేజీలు ఉండవు. అంతర్గత రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయి. ముఖ్యంగా కూరగాయలు, పండ్లను నిల్వ చేసుకునే అవకాశం లేకపోవడంతో వాటిని ఆరోజు అమ్ముకోవాల్సిందే. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వరి ధాన్యాన్ని కూడా తాలు, మట్టిపెళ్లలు, నాసిరకం పేరిట దళారులు దోపిడీ చేస్తున్నారు. చివరకు తరుగు పేరుతో తూకంలో ఐదారు కిలోలు తీస్తున్నారు. దీనితో రైతు పెట్టిన పెట్టుబడి పోను మిగిలేది నామమాత్రమే. ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో వ్యవసాయ మార్కెట్లను సర్కారు గాలికొదిలేస్తున్నది. బడ్జెట్‌లో మార్కెటింగ్ శాఖకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోయినా 'ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి' నుంచి అవసరానికి ఇస్తారని మలక్‌పేట్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కోట్ల శ్రీనివాస్ నవతెలంగాణకు చెప్పారు.

బీసీలకు రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్
- ఏప్రిల్ 2న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బీసీల పోరుగడ్డ



నవతెలంగాణ - బంజారాహిల్స్

రాష్ట్ర అసెంబ్లీలో ఏకగ్రీవంగా ఆమోదించిన బీసీల 42శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఏప్రిల్ 2న 'చలో ఢిల్లీ ముట్టడి' కార్యక్రమాన్ని చేపట్టామని, దీనికి వేలాదిమంది బీసీలు తరలిరావాలని పిలుపునిచ్చారు. జంతర్ మంతర్ వద్ద జరిగే బీసీల పోరుగడ్డ దేశంలోని 29 రాష్ట్రాల బీసీలు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని కోరారు. రాష్ట్రంలో రిజర్వేషన్ల పోరాటం ముగిసిందని, ఇక ఢిల్లీకి వెళ్లి కొట్లాడుతామని చెప్పారు. బీసీల సత్తా ఏంటో తెలిసేలా కేంద్రానికి రుచి చూపిస్తామని హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్‌ను ఆయనతో పాటు బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మెన్ కుందారపు గణేశాచారి, కన్వీనర్ బాలగోని బాలరాజుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు విక్రమ్ గౌడ్, మహిళా రాష్ట్ర అధ్యక్షులు మణిమంజిర తదితరులు ఆవిష్కరించారు. అనంతరం జాజుల మాట్లాడుతూ.. కేంద్రం ఏప్రిల్ 2లోపు ఈ పార్లమెంట్ సమావేశాల్లో బీసీ బిల్లును ఆమోదించకపోతే ఢిల్లీలో అగ్గి రాజేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు మద్దతిచ్చిన బీసీ బిల్లుకు అదే పార్టీకి చెందిన కేంద్రమంత్రి అమిత్ షా మైనార్టీలు చేర్చినందునే దాన్ని ఆమోదించబోమని పేర్కొనడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలంటే తక్షణమే పార్లమెంట్‌లో బీసీ బిల్లును ఆమోదించాలని, లేకపోతే పోరుగడ్డకు సిద్ధమవ్వాలని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంఘం నేతలు జనార్ధన్, శ్యాం కురుమ, సింగం గణేష్, మహిళా సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

రహీం ఆగాఖాన్‌కు

సీఎం అభినందనలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

షియా ఇస్మాయిలీ ముస్లిం సమాజానికి 50వ వారసత్వ ఇమామ్‌గా, ఆగాఖాన్ ట్రస్ట్ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన రహీం ఆగాఖాన్‌కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అభినందనలు తెలిపారు. తెలంగాణలోని చారిత్రక వారసత్వ సంపద పరిరక్షణ, విద్య, స్థిరమైన అభివృద్ధి కోసం చేస్తున్న కృషి ఎంతో అమూల్యమైందని గుర్తు చేశారు. రహీం ఆగాఖాన్ నాయకత్వంలో రాష్ట్రానికి సహకారం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. మానవాళి సేవలో ఆయన గొప్ప విజయాలు సాధించాలని అభిలాషించారు.

బ్రహ్మోత్సవాలకు సీఎంను ఆహ్వానించిన మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భద్రాచలం ఆలయంలో జరిగే శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ ఆహ్వానించారు. ఆదివారం బంజారాహిల్స్‌లోని నివాసంలో సీతారామచంద్రస్వామి దేవస్థానం అర్చకులు, అధికారులతో కలిసి సీఎంకు ఆహ్వాన పత్రికను ఆమె అందించారు. అలాగే ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కతో పాటు మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు సైతం ఆహ్వాన పత్రిక అందించారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన భూసేకరణ, ఇతర వివరాలను ఈ సందర్భంగా సీఎం అధికారులనడిగి తెలుసుకున్నారు. కల్యాణ ఏర్పాట్లలో ఎలాంటి లోటు రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్,కమిషనర్ శ్రీధర్, భద్రాచలం ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

అసలు లక్ష్యం వెనక్కి

- కొసరు పనుల కోసం కొర్రీలు
- ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో గందరగోళం
- నియామకాలను ఏజెన్సీకి అప్పగించేందుకు యత్నం?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆ సొసైటీని ఒక ఉదాత్త లక్ష్యంతో ఏర్పాటు చేశారు. ఆ లక్ష్య సాధన దిశగా పయనించాల్సిన సొసైటీ నిత్యం వివాదాలతో ఆరోపణలను ఎదుర్కొంటుంది. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా, రోగులకు మెరుగైన సేవలందించేందుకు ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీని ఏర్పాటు చేశారు. జాతీయస్థాయిలో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ ఉండగా, రాష్ట్ర స్థాయిలో తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఉంది. అయితే అసలు లక్ష్యం దిశగా ఎంత పని చేస్తుందో ఏమో గానీ, నియామకాలు, నిధుల వినియోగం తదితర విషయాలకు సంబంధించి తరచూ ఆరోపణలు ఎదుర్కొంటుంది. దీంతో ఉద్యోగుల్లో ఆందోళన, సొసైటీలో గందరగోళం పెరిగిపోతున్నది. ఇంతకాలం నియామకాల ప్రక్రియను సొసైటీ చేపట్టగా, తాజాగా నియామకాలను ఏజెన్సీకి అప్పగించాలని అధికారులు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి లో నియంత్రణ కొరవడడంతో అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాట అన్నట్టు వ్యవహారం కొనసాగుతున్నది. సొసైటీకి నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ నుంచి నిధులు వస్తున్నాయి. ఆ నిధులతో సొసైటీ లక్ష్యం కోసం నియామకాలు చేపట్టి ముందుకెళ్లాల్సి ఉంటుంది. అయితే సొసైటీ ద్వారా చేపట్టాల్సిన నియామకాలను, కాసులకు కక్కుర్తి పడిన అవుట్ సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగించేందుకు పావులు కదుపుతున్నట్టు తెలుస్తున్నది. అవుట్ సోర్సింగ్ విధానంలో ఉండగా గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే టీశాక్స్‌కు డైరెక్టుగా అటాచ్ చేశారు. మళ్లీ అందుకు భిన్నంగా గతంలో నేరుగా నియామకాల కోసం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేసి అవుట్ సోర్సింగ్ దిశగా అడుగులు వేస్తున్నట్టు సమాచారం. గతంలో టెక్నికల్ ఆఫీసర్లు, కౌన్సెలర్లు, ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు.

స్థానిక నిరుద్యోగులకు అన్యాయం

నేరుగా నియామకాలు చేపడితే స్థానిక నిరుద్యోగులకు ఉండే అవకాశాలు ఏజెన్సీ ద్వారా చేపడితే కోల్పోతారని ఆందోళన వ్యక్తమవుతున్నది. అప్పగించిన ఏజెన్సీకి ఇష్టమొచ్చినట్టు ఇతర రాష్ట్రాల వారితో పోస్టులను భర్తీ చేస్తారని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని ఏజెన్సీకి అప్పగించే ప్రయత్నాలను ఆపాలని కోరుతున్నారు.

ఊసేలేని రూ.10 వేల వేతన హామీ

పెండింగ్‌లో మూడు నెలల వేతనాలు

- ఎనిమిది నెలల నుంచి అందని గుడ్ల బకాయిలు
- గుడ్ల సమస్యను అసెంబ్లీలోనూ లేవనెత్తుతున్న ఎమ్మెల్యేలు
- అయినా పట్టని రాష్ట్ర సర్కారు
- నేడు చలో హైదరాబాద్‌కు మధ్యాహ్న భోజన కార్మికుల పిలుపు
- ఎక్కడికక్కడ అరెస్టులు చేయిస్తున్న రాష్ట్ర సర్కారు


(ఫైల్)

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'మా నియోజకవర్గంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో గుడ్లు పెట్టడం లేదు. పిల్లలకు గుడ్లు పెట్టాలని ఆదేశించా. డబ్బులు నేనిస్తానని చెప్పా' అసెంబ్లీలో ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రస్తావించారు. '8 నెలలకు సంబంధించి గుడ్ల బకాయిలు రావడం లేదనీ, పైగా, వారానికి మూడు గుడ్లు పెట్టాలని ఒత్తిడి తెస్తున్నారు' మధ్యాహ్న భోజన కార్మికులు నెత్తీనోరు బాదుకుంటున్నారు. వారి చెప్పేది నిజమని అసెంబ్లీలో సాక్షిగా దానం నాగేందర్ ప్రస్తావించడాన్ని బట్టే తెలుస్తున్నది. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వర్లు చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర సర్కారు ఇటీవల గొప్పగా ప్రకటించింది. కోటీశ్వర్లు చేయడం దేవుడెరుగుగానీ..ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు వంట వండిపెడుతున్న మహిళా సంఘాల సభ్యులకు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తున్నది. గత ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులను విస్మరించిందని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎండగట్టింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే వారి సమస్యలను పరిష్కరిస్తామనీ, మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.10 వేల వేతనం ఇస్తామని గొప్పగా ప్రకటించింది. మ్యానిఫెస్టోలోనూ పొందుపర్చింది.

నెల దాటింది..ఏడాది దాటింది...ఏడాదిన్నర కావొస్తుందిగానీ మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. ఈ నేపథ్యంలో తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చింది. ప్రజాస్వామ్య పరిరక్షణే తమ ఏడో హామీ అని రాష్ట్ర సర్కారు ఓవైపు చెబుతూనే కార్మికుల గొంతునొక్కే ప్రయత్నం చేస్తున్నది. ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తే తమ సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్తాయనీ, కొంతలో కొంతమేరకైనా పరిష్కారమవుతాయనే చిన్న ఆశతో ఉన్న కార్మికుల ఆశలపై రాష్ట్ర సర్కారు నీళ్లు చల్లింది. ఓవైపు ఇందిరాపార్కు వద్ద ధర్నాకు అనుమతిలిస్తూనే..మరోవైపు జిల్లాల నుంచి హైదరాబాద్‌కు మధ్యాహ్న భోజన కార్మికులు రాకుండా అడ్డుకునే క్రమంలో ఆదివారం నుంచే వారిని ఎక్కడికక్కడ నిర్బంధించడం, ఎదురుతిరిగేవారిని అరెస్టు చేయించే పర్వం కొనసాగుతున్నది.

మధ్యాహ్న భోజన కార్మికులు రాష్ట్ర సర్కారును గొంతెమ్మ కోరికలేం కోరడం లేదు. ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనం ఇవ్వాలనీ, కార్మికుల ఖాతాల్లో నేరుగా వేయాలని విన్నవిస్తున్నారు. దీన్ని అధికార పార్టీ పట్టించుకోవడం లేదు. పైగా, మూడు నెలల నుంచి వారిచ్చే అరకొర వేతనాలనూ పెండింగ్‌లో పెట్టి కూర్చున్నది. అంతేకాదు, కోడిగుడ్లకు ఇచ్చే పైసలనూ 8 నెలలుగా ఇవ్వడం లేదు.

నిధులివ్వకపోగా, వారంలో విద్యార్థులకు మూడు కోడి గుడ్లు పెట్టాలని కార్మికులపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారు. దీంతో ఇన్నేండ్ల నుంచి పనిచేస్తున్నాం..సర్కారు దయతలిచి వేతనాలు పెంచితే..పర్మినెంట్ చేస్తే అన్న చిన్న ఆశతో వారు చేతికి అందినకాడల్లా అప్పులు తెచ్చి మరీ వంట చేసిపెడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు ఇస్తున్నమాదిరిగానే సర్కారు బడ్లకూ ప్రభుత్వమే గుడ్లను సరఫరా చేయాలనే డిమాండ్‌ను ప్రభుత్వం అస్సలే పట్టించుకోవడం లేదు. దేశంలో 39 శాతం మంది పిల్లలు పౌష్టికాహారలేమితో బాధపడుతున్న నేపథ్యంలో కనీసం ఒక్కపూటైనా నాణ్యతతో కూడిన భోజనాన్ని పాఠశాలల్లో అందించాలనే గొప్ప లక్ష్యంతో మధ్యాహ్న భోజన పథకం తీసుకొచ్చారు. ఆ పథకం వచ్చాక డ్రాపౌట్స్ తగ్గాయి. పిల్లల సంఖ్య పెరిగింది. వేడివేడి భోజనం పాఠశాలలోనే ఉపాధ్యాయుల సమక్షంలో మధ్యాహ్న భోజన కార్మికులు వండిపెడుతున్నారు. కానీ, రాష్ట్ర సర్కారు దానికి చరమగీతం పాడేందుకు సిద్ధమవుతున్నది. గత ప్రభుత్వం ప్రయివేటు ఏజెన్సీలకు భోజనం సరఫరా చేసే బాధ్యతను అప్పగిస్తున్నది. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌తో పాటు పలు జిల్లాల్లో ప్రయివేటు ఏజెన్సీలకు అప్పగించింది. దీంతో పిల్లలకు వేడివేడి భోజనం అందించాలనే దానికి తూట్లు పడ్డాయి. ప్రయివేటు ఏజెన్సీలు పిల్లలకు గుడ్లు పెట్టడం లేదు. దీని ఫలితంగా పథకం ప్రాథమిక లక్ష్యానికే గండి పడుతున్నది. పాఠశాలలను మహిళా సంఘాల చేతుల్లో పెట్టి ఆదర్శంగా తీర్చిదిద్దబోతున్నామనీ, మహిళా సంఘాల సభ్యులు సొంత కాళ్ల మీద నిలబడేలా తోడ్పాటునందిస్తామని ప్రభుత్వం చెబుతున్న విషయం విదితమే. అక్కడ భోజనాలను వండిపెడుతున్నది కూడా మహిళా సంఘాల సభ్యులే కదా? వారికి ఎందుకు తోడ్పాటు అందించదనే విమర్శ వస్తున్నది.

భోజనం వండిపెడుతున్నది ఆడబిడ్డలే కదా..వారి సమస్యల్ని తీర్చరా?



పాఠశాలల్లో విద్యార్థులకు వేడివేడి భోజనం వండిపెడుతున్నది ఆడబిడ్డలే. వారి సమస్యల్ని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు పరిష్కరించదు. ఇచ్చేదే అరకొర వేతనం ఏడెనిమిది నెలల నుంచి గౌరవ వేతనం ఇవ్వకపోతే ఆ కుటుంబాలు ఎలా బతుకుతాయి? వెంటనే వాటిని విడుదల చేయాలి. రూ.10 వేల వేతనం మీరే ఇస్తానన్నారు గదా అదే అడుగుతున్నం. ప్రభుత్వ స్కూళ్లకు గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే సరఫరా చేయాలి. అక్షయ పాత్ర లాంటి స్వచ్ఛంద, ప్రయివేటు సంస్థలకు మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను అప్పగించి కార్మికుల ఉపాధికి గండికొట్టొద్దు. పీఎఫ్ఎంఎస్ ద్వారా బిల్లులు, వేతనాలు చెల్లించాలి. ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలి. గోడు చెప్పుకునేందుకు హైదరాబాద్‌కు వస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులను అరెస్టు చేయడం తగదు.

- ఎస్వీ.రమ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్(సీఐటీయూ)



రాజ్యాంగాన్ని రక్షించుకోకపోతే ముప్పే

- కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు
- 'జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్'లో టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్
- జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే..
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నుంచి రాజ్యాంగాన్ని రక్షించుకోకపోతే దేశానికి తీవ్ర ముప్పు ఉంటుందని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలో త్వరలో మరో 24 అసెంబ్లీ నియోజకవర్గాలు ఏర్పడే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో డీసీసీ అధ్యక్షులు చల్లా నరసింహ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన 'జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ అభియాన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పెద్ద సంఖ్యలో సీట్లు పెరిగే అవకాశం ఉందన్నారు. వాటిలో ఆశావాహులందరికీ పార్టీ అవకాశం కల్పిస్తుందని చెప్పారు. ఎమ్మెల్యేగా పోటీ చేయాలని భావించే వారు ఇప్పటి నుంచే సీరియస్‌గా పార్టీ కోసం పని చేయాలని, నిత్యం ప్రజల్లో ఉండాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పని చేసి పార్టీ అభ్యర్థులను గెలుపించుకోవాలని తెలిపారు. తెలంగాణలో ఒక్క సీటు తగ్గినా.. ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బీజేపీ స్వతంత్ర సమరయోధులను అవమానపరిచిందని, మనువాద రాజ్యాంగాన్ని తీసుకురావాలనే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మహాత్మాగాంధీ, నెహ్రూ వంటి మహనీయుల గొప్పతనాన్ని మరిపించే విధంగా బీజేపీ నేతలు మాట్లాడుతున్నారని, మతవాద శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇందుకు 'జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్' పేరుతో గ్రామాల్లో పర్యటించి, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కార్యకర్తలకు సూచించారు. లోక్‌సభ స్థానాలను యథావిధిగా కొనసాగించాలని తమిళనాడు సీఎం స్టాలిన్ నేతృత్వంలో జరిగిన సమావేశానికి సీఎం సహా తాను కూడా వెళ్లినట్టు గుర్తు చేశారు. జనాభా ప్రతిపాదికను నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు.

జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాల్సిందే : ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి గెలుపొందిన ఎమ్మెల్యేలకు మంత్రి మండలిలో ప్రాతినిధ్యం కల్పించకపోవడంతో జిల్లా ప్రజలు నష్టపోవాల్సి వస్తోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపు సహా కార్యకర్తలకు ఏదైనా సమస్య వస్తే ఎవరికి చెప్పుకోవాలో తమకు అర్థం కావడం లేదన్నారు. ఉమ్మడి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. సామాజిక వర్గాలే అడ్డయితే తాను రాజీనామా చేసి మరొకరిని పోటీలో నిలిపేందుకు కూడా సిద్ధమేనని ప్రకటించారు. ఇదే అంశంపై జిల్లా ముఖ్య నేతలంతా ఓ తీర్మానం చేసి, పార్టీ అధిష్టానానికి పంపారు. ఈ సమావేశంలో సీడబ్ల్యూసీ సభ్యులు వంశీచంద్‌రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలు నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్, పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, కారు ఢీకొని ముగ్గురు మృతి

- మృతులు ఒకే కుటుంబానికి చెందినవారు
- నలుగురు చిన్నారుల పరిస్థితి విషమం, హైదరాబాద్‌కు తరలింపు
- బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లి వస్తుండగా ప్రమాదం

నవతెలంగాణ-చివ్వెంల

ఆర్టీసీ బస్సు, కారు ఢీ కొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు దుర్మరణం చెందిన ఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం బీబీగూడెం వద్ద ఆదివారం జరిగింది. సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కంఠాయపాలెం గ్రామానికి చెందిన గడ్డం రవీందర్, తన సొంత కారులో అతని భార్య రేణుక, కుమార్తె రితిక(8), కుమారుడు రిషి కృష్ణ కలిసి సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ మండలంలోని కోటపహాడ్ గ్రామంలో తమ బంధువుల ఇంట్లో జరిగే ఫంక్షన్‌కు బయల్దేరారు. కోటపహాడ్ నుంచి తన కారులో చిన్న పిల్లలు, కుటుంబ సభ్యులు మొత్తం 11 మందితో కలిసి సూర్యాపేటకు బయలుదేరి వస్తుండగా బీబీగూడెంలోని విజేత పైపుల కంపెనీ వద్దకు రాగానే ఖమ్మం వెళ్తున్న సూర్యాపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు.. ఓవర్‌టేక్ చేస్తూ ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ఘటనలో గడ్డం రవీందర్, రేణుక, రితిక అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిన్నారులు గడ్డం రిషి కృష్ణ, గంధం శాన్విక, మల్లికార్జున్, కడారి జగ్విన్ పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. కుటుంబంతో సంతోషంగా గడిపిన చిన్నారులు ప్రమాదంలో గాయపడటంతో చిన్నారుల తల్లిదండ్రులు శోకంలో మునిగిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెన్త్ పరీక్షా ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో ఆరుగురికి రిమాండ్

- మరో ఐదుగురిపై కేసు నమోదు
- నల్లగొండలో ఘటన, రిమాండ్‌కు నిందితులు

నవతెలంగాణ-నకిరేకల్

పది ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో ఐదుగురితో పాటు ఒక మైనర్ బాలున్ని ఆదివారం నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణంలోని స్థానిక మున్సిఫ్ కోర్టులో రిమాండ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 21న నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో యువకుడు వచ్చి పరీక్ష రాస్తున్న స్థానిక విద్యార్థిని నుంచి ప్రశ్నాపత్రం ఫొటో తీసి వైరల్ చేసిన విషయం విధితమే. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ చేయగా 11 మందిపై కేసు నమోదు చేసి ఆదివారం ఆరుగురి అరెస్టు చేసి రిమాండ్ చేశామని సీఐ రాజశేఖర్ తెలిపారు. అరెస్టయిన వారిలో వాసవీనగర్‌కు చెందిన చిట్ల ఆకాశ్, చిట్ల శివ, నకిరేకల్ మండలం గోరేంకలపల్లికి చెందిన నల్ల శ్రీను, శివాజీనగర్‌కు చెందిన గుడుగుంట్ల శంకర్, జిరాక్స్ తీసిన బ్రహ్మదేవర రవిశంకర్, గది ఎక్కి ఫొటో తీసిన మరో మైనర్ బాలున్ని అరెస్టు చేసి స్థానిక మున్సిఫ్ కోర్టులో హాజరు పర్చారు. ఈ ఆరుగురిలో మేజర్ అయిన ఐదుగుర్ని నల్లగొండ జైలు, మైనర్ బాలున్ని హైదరాబాద్‌లోని మైనర్ జైలుకు తరలించారు. మరో ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వన్య'పానీ'యం

అడవి జంతువుల దాహం తీర్చేందుకు చర్యలు

చెక్‌డ్యామ్‌లు, నీటికుంటలు, సాసర్ పిట్ల ఏర్పాటు

సోలార్ విద్యుత్ బోరు మోటార్లతో నీరు

రాష్ట్రంలో 27,402.98 చదరపు కి.మీ అటవీ విస్తీర్ణం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 8వేలకు పైగా వన్యప్రాణులు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

వేసవి దృష్ట్యా వన్యప్రాణుల దాహం తీర్చేలా అటవీశాఖ చర్యలు చేపడుతోంది. అడవిలో నీటి సౌకర్యాల కల్పనకు ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 8వేలకు పైగా ఉన్న అడవి జంతువులను నీటి కష్టాలకు దూరం చేసేందుకు సమాయత్తం అయింది. ఉమ్మడి జిల్లాలో వేసవి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవుతాయి కాబట్టి ముందు జాగ్రత్త చర్యలకు పూనుకుంది. అడవిలో నీటికుంటలు, చెలిమలు, వాగులు ఎండిపోతాయి కాబట్టి బోర్లు వేయించింది. వాటికి సోలార్ విద్యుత్ ఆధారంగా నడిచే మోటార్లు బిగించింది. నీటి ఎద్దడి నెలకొనకుండా ఇప్పటికే సమగ్ర చర్యలు చేపట్టినట్టు ఖమ్మం జిల్లా అటవీశాఖ అధికారి విక్రమ్‌సింగ్ మాన్ తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లోనూ వేసవి నీటి ఎద్దడి నుంచి అడవీ జంతువులను రక్షించేందుకు ఇప్పటికే ప్రభుత్వం చర్యలు చేపట్టినట్టు చెప్పారు.



27,402 చ.కి.మీ అటవీవిస్తీర్ణం

రాష్ట్ర వ్యాప్తంగా 27,402.98 చదరపు కి.మీ అటవీ విస్తీర్ణం ఉంది. దీనిలో 2 టైగర్ రిజర్వ్ (అమ్రాబాద్, కవ్వాల్) జోన్లు, 7 అభయారణ్యాలు, 3 జాతీయ పార్కులు ఉన్నాయి. వీటిలో పులులు, జింకలు, చిరుతలు, మనుబోతులు, తోడేళ్లు, ఎలుగుబంట్లు, నక్కలు, అడవిదున్నలు ఇలా వివిధ రకాల జంతువులు జీవిస్తున్నాయి. అడవి జంతువుల దాహం తీర్చేందుకు కొన్నిచోట్ల ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు చేపడుతుండగా.. కొన్నిచోట్ల అరకొర వసతులు కల్పిస్తున్నారు. సాసర్‌పిట్లలో సరిగ్గా నీరు నింపట్లేదనే ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల నీటి సౌకర్యాల మరమ్మతులు కూడా చేపట్టట్లేదు. కాంట్రాక్టర్లకు నీటి మరమ్మతులు, నిర్మాణ బాధ్యతలు అప్పగించినా సరైన చర్యలు తీసుకోవటం లేదు. అయితే అనేక జిల్లాల్లో మాత్రం సరైన చర్యలు చేపడుతున్నారు.

దట్టమైన అడవుల నిలయం..

ఉమ్మడి ఖమ్మం జిల్లా దట్టమైన అడవులకు నిలయంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో ఖమ్మం, సత్తుపల్లి, భద్రాచలం, కిన్నెరసాని, కొత్తగూడెం, మణుగూరు, పాల్వంచ, ఇల్లెందు 8 అటవీ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 680.02 చదరపు కిలోమీటర్ల దట్టమైన అడవులున్నాయి. 1764.15 చదరపు కి.మీ మేర మధ్యరకం అడవులు ఉన్నాయి. పచ్చికబయళ్ల వంటి బాహ్య అడవులు 1024.96 చ.కి.మీ మేర విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల్లో అడవి గేదెలు 1,890, చుక్కల దుప్పులు 4,275, కొండగొర్రెలు 656, అడవి పిల్లులు 672, ఎలుగుబంట్లు 410, కణుజులు 506 వరకు ఉన్నాయి. వేసవికాలంలో నీటి సౌకర్యాలు కల్పించకపోతే ఇవి జననివాసాల్లోకి వెళ్తాయి. ఈక్రమంలో ప్రమాదాల బారిన పడి అడవి జంతువులు ప్రాణాలు కోల్పోతాయి. పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని అటవీశాఖ అప్రమత్తమైంది.

నీటివెతలు తీర్చగా..

ఉమ్మడి జిల్లాలో అడవి జంతువుల నీటివెతలు తీర్చేందుకు ఫారెస్టు అధికారులు చెక్‌డ్యామ్‌లు, సాసర్ పిట్లు, నీటికుంటలు నిర్మిస్తున్నారు. వీటిలో మూడురోజులకోసారి ట్యాంకర్లతో నీరు నింపుతున్నారు. వీటికి తోడుగా అనేక చోట్ల బోర్లు వేశారు. వీటికి సోలార్ ఆధారంగా నడిచే మోటార్లు బిగించారు. దీనికోసం కంపా, బయోసాట్ నిధులు వినియోగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 591 చెక్‌డ్యామ్‌లు, 861 సాసర్ పిట్లు, 402 పెద్దనీటి కుంటలు, 379 చిన్ననీటి కుంటలు, 100 వరకు సోలార్ పంపుసెట్ల ద్వారా వన్యప్రాణులకు తాగునీరందించేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టింది. నీటికోసం వచ్చిన అడవి జంతువులకు ప్రాణహాని కలిగించకుండా బేస్‌క్యాంప్‌లను సైతం ఏర్పాటు చేస్తోంది. అటవీశాఖ సిబ్బంది ఎప్పటికప్పుడూ పర్యవేక్షణ చేపట్టేలా చర్యలు చేపట్టారు. వేటగాళ్ల నుంచి అటవీజంతువుల రక్షణకు ట్రాపింగ్ కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు.



నిధుల కొరతతో కొన్ని జిల్లాల్లో లేని వసతులు..

నిధుల కొరతతో కొన్ని జిల్లాల్లో ఎలాంటి సాసర్ రింగ్‌లు నిర్మించలేదు. కొన్నిచోట్ల సాసర్‌పిట్లు ఉన్నా వాటిలో నీళ్లు నింపటం లేదు. మరమ్మతు చర్యలు కూడా చేపట్టడం లేదు. పలుమార్లు ప్రతిపాదనలు పంపినా నిధులు విడుదల కాకపోవడంతో కొన్నిచోట్ల అటవీజంతువులు దాహంతో అల్లాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొన్నిచోట్ల కంపా నిధులు విడుదల కావట్లేదు. ఎస్‌డీఎఫ్ నిధుల కోసం అటవీశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపుతున్నారు. ఇప్పటికే ఎండల తీవ్రత పెరగటంతో కొన్ని జిల్లాల్లో దాహంతో వన్యప్రాణులు అలమటిస్తున్నాయి. వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు చర్యలు చేపట్టని చోట అవి బయటకు వస్తున్నాయి. ఇలా జనారణ్యంలోకి వచ్చిన అడవి జంతువులకు హాని తలపెడుతున్న సంఘటనలు ఉన్నాయి. నాలుగైదేండ్ల క్రితం నీటి కోసం అడవి నుంచి బయటకు వచ్చిన సాంబర్ జింక కాళ్లను దుండగులు నరికారు.

మహిళల పట్ల లింగ వివక్షతను అరికట్టాలి

మహిళా వికలాంగుల ఆరోగ్య సంరక్షణ బాధ్యత ప్రభుత్వానికి లేదా?

అందాల పోటీలతో మహిళల ఆత్మగౌరవం తాకట్టు పెడుతున్న రాష్ట్ర ప్రభుత్వం : డాక్టర్ పి.నీలిమ

ఎన్‌పీఆర్‌డీ ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్యంపై సెమినార్



నవతెలంగాణ-ముషీరాబాద్

మహిళల పట్ల లింగవివక్షతను అరికట్టాలని, మహిళా వికలాంగుల ఆరోగ్య సంరక్షణ బాధ్యత ప్రభుత్వానికి లేదా అని డాక్టర్ పి. నీలిమ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు టి. వరమ్మ అధ్యక్షతన "మహిళల ఆరోగ్యం-సమస్యలు-తీసుకోవాల్సిన జాగ్రత్తలు" అనే అంశంపై ఆదివారం సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నీలిమ మాట్లాడుతూ.. వైకల్యం ఉన్న స్త్రీలకు ఇతర మహిళల మాదిరిగానే ఆరోగ్య సమస్యలు ఉంటాయన్నారు. సరైన పరికరాలు అందుబాటులో లేకపోవడం వల్ల వైకల్యం ఉన్న స్త్రీలకు సరైన వైద్యం అందడం లేదని తెలిపారు. మహిళలపై అన్ని రకాల వివక్షతలను తొలగించాలని ఐక్యరాజ్యసమితి చెప్పినా అమలు చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. వైకల్యం ఆధారంగా వివక్షత లేకుండా అత్యున్నత స్థాయి ఆరోగ్యాన్ని పొందే హక్కు వైకల్యం ఉన్న వ్యక్తులకు ఉందన్నారు. వికలాంగ మహిళలు సమాజంలో అడ్డంకులు ఎదుర్కొంటున్నారని, ఆరోగ్య సేవలకు సంబంధించిన విధానాలు వికలాంగ మహిళల అవసరాలకు అనుగుణంగా లేవన్నారు. లింగ వివక్షతను మహిళల పాలిట శాపంగా మారిందని, మహిళలు చదువుకోవడం వల్ల చైతన్యం అవుతారని, పాఠశాలల్లో లైంగిక విద్యను పాఠ్యంశాంగా చేర్చాలని డిమాండ్ చేశారు. మహిళలకు ప్రభుత్వమే ప్రోటీన్స్, ఐరన్ పోషకాలు ఉండే ఆహార పదార్థాలను అందించాలని అన్నారు. ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.జ్యోతి, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు టి.వరమ్మ మాట్లాడుతూ.. 1990 తర్వాత యునైటెడ్ స్టేట్స్‌లో మహిళల ఆరోగ్య సమస్యలతో పాటు వికలాంగ మహిళల ఆరోగ్య సమస్యలపై అధ్యయనం జరిగిందన్నారు. శారీరక, మేథో వైకల్యాలున్న మహిళలకు వైద్యం అందడంలో వివక్షతను ఎదుర్కొంటున్నారని అధ్యాయనంలో వెల్లడయిందని చెప్పారు. మేథో వైకల్యం ఉన్న మహిళలకు లైంగిక ఆరోగ్యంపై సరైన అవగాహన లేదన్నారు. ఆర్థిక సమస్యల వల్ల వైకల్యం ఉన్న మహిళలు రొమ్ము, గర్భకోశ క్యాన్సర్‌కు గురవుతున్నారని తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. అడివయ్య మాట్లాడుతూ.. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై లైంగికదాడులు, హత్యలు పెరిగిపోతున్నాయని అన్నారు. గృహహింస, అత్యాచార నిరోధక చట్టం, ఆస్తి హక్కు వంటి అనేక చట్టాలు ఉన్నా అవి అమలుకు నోచుకోవడం లేదని తెలిపారు. ఇందిరా క్రాంతి పథకం ద్వారా మహిళా వికలాంగులకు ప్రత్యేక పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మే 7 నుంచి హైదరాబాద్‌లో అందాల పోటీలు నిర్వహించాలని నిర్ణయం చేయడం సిగ్గుచేట న్నారు. మహిళలు తన అక్క, చెల్లెలు అని గొప్పలు చెబుతున్న సీఎం రేవంత్ రెడ్డి అందాల పోటీలు పెట్టి మహిళల ఆత్మగౌరవాన్ని కార్పొరేట్ సంస్థలకు తాకట్టుపెడుతున్నారని అన్నారు. మహిళా వికలాంగులకు సకలాంగుల మహిళలతో పాటు సమాన అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళా వికలాంగుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు కె.వెంకట్, కేంద్ర కమిటీ సభ్యులు ఆర్.వెంకటేష్, సాయమ్మ, రాజు, రాష్ట్ర నాయకులు నాగలక్ష్మి, యశోద, సావిత్రి, సంతోష, జయలక్ష్మి, స్వామి, దశరథ్, కాషాప్ప, మధుబాబు, గంగాధర్, ప్రకాష్, వివిధ జిల్లాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే రైతులకు భరోసా



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి / కరీంనగర్

కేసీఆర్ ఉన్నప్పుడే రాష్ట్రం బాగుండేదని, రైతులకు భరోసా ఉండేదని, ఇప్పుడు ఏ జిల్లాకెళ్లినా.. ఏ ఊరికెళ్లినా.. ఏ వాడకెళ్లినా.. కదిలించిన ప్రతిరైతూ 'కేసీఆర్ ఉంటేనే మాకు భరోసా' అని అంటున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్యే కే.తారకరామారావు (కేటీఆర్) అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్‌ను, కేంద్రంలోని బీజేపీని మరింత ఎండగట్టేందుకు సన్నద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని వీ కన్వెన్షన్ హాల్‌లో బీఆర్ఎస్ పార్టీ ఉమ్మడి జిల్లా కార్యకర్తలతో ఆదివారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. సభకు ముందుగా మంకమ్మతోట నుంచి కన్వెన్షన్ హాల్ వరకు బీఆర్ఎస్ నేతలు బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను చెబుతూనే.. కేంద్రంలోని బీజేపీ హయాంలో రాష్ట్రం ఎదుర్కొంటున్న అన్యాయాన్ని ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కేసీఆర్ పాలనలో ఉన్న స్థిరత్వం లేక, ప్రజలు గందరగోళానికి గురవుతున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు, రాయితీలు, ఉచిత విద్యుత్తు అందుబాటులో ఉండేవని, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయి రైతుల బతుకులు ఆగమయ్యాయని తెలిపారు. ఉద్యోగులూ ఇదే స్థితిలో ఉన్నారని, 70శాతం వేతనాలు పెంచి, స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇచ్చిన కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని అన్నారు. ఇప్పటికీ రాష్ట్రంలో కేసీఆర్ ఇచ్చిన పీఆర్‌సీయే అమలవుతోందని, ప్రస్తుతం ఉన్న ముఖ్యమంత్రి.. జీతం ఎప్పుడు ఇవ్వగలమో తెలియదని చెబుతున్నారని అన్నారు. రాహుల్ గాంధీ 2023లో హైదరాబాద్‌లో సభ పెట్టి.. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారని, ఇప్పటివరకు ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. కాంగ్రెస్ మాటలు చెప్పడం తప్ప, పనిలో నిబద్ధతత లేదన్నా రు. యువత కాంగ్రెస్‌ని నమ్మి ఓటు వేసి మోసపోయిందని స్పష్టం చేశారు.

పార్టీ రజతోత్సవాలతో చరిత్రను వివరించాలి

బీఆర్ఎస్ రజతోత్సవాలను ఘనంగా నిర్వహించబోతున్నామని, గ్రామాగ్రామాన, ప్రతి జిల్లాలో ఉద్యమ చరిత్రను తెలియజేసేలా ఫొటో ఎగ్జిబిషన్లు, డాక్యుమెంటేషన్‌లు, శిక్షణ తరగతులు ఏర్పాటు చేయబోతున్నట్టు కేటీఆర్ ప్రకటించారు. 'బండి వెనుక బండి కట్టి.. పదహారు బండ్లు కట్టి' అన్నట్టుగా, ప్రతి కార్యకర్త తన పరిధిలో పార్టీ చరిత్రను ఈ తరం పిల్లలకు గుర్తు చేయాలని పిలుపునిచ్చారు. ఈ రజతోత్సవాల తర్వాత శ్రేణులంతా తిరుగుబాటుకు సిద్ధం కావాలని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, ఇప్పుడు తమను అణిచివేస్తున్న వారిని ఎవరినీ వదలబోమని అన్నారు. రిటైర్మెంట్ అయినా, సప్త సముద్రాలు దాటినా తీసుకొచ్చి మరీ చట్టం ముందు దోషులుగా నిలబెడతామని తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడికౌశిక్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌కుమార్ సహా పార్టీ సీనియర్‌నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీలిమిటేషన్‌పై నిర్ణయం తీసుకోలేదు

2026 జనగణన అనంతరమే కమిటీ ఏర్పాటు



ఆ తర్వాతే విధివిధానాలు రూపొందిస్తాం

తమిళనాడు ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు డీఎంకే కుట్ర : కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డీ లిమిటేషన్‌పై కేంద్ర ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చెన్నైలో శనివారం జరిగిన డీ లిమిటేషన్ సదస్సుపై కీలక వ్యాఖ్యలు చేశారు. 2026 జనగణన తర్వాత పార్లమెంట్‌లో చట్టం చేస్తామనీ, అనంతరమే డీ లిమిటేషన్‌పై కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొన్నారు. పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పాటైన కమిటీ రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా పౌర సమాజం అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే విధివిధానాలు రూపొందిస్తామని చెప్పారు. ఇదంతా జరగాలంటే ఏడాది నుంచి రెండేండ్ల సమయం పడుతుందని పేర్కొన్నారు. వాస్తవ పరిస్థితి ఇలా ఉంటే ఇప్పుడికిప్పుడే దక్షిణాది రాష్ట్రాలకు ఏదో జరిగిపోతోందని ప్రచారం చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం డీ లిమిటేషన్‌పై ఉన్న చట్టాలు కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చినవేనని గుర్తు చేశారు. వారు తెచ్చిన చట్టాలను వారే ఎందుకు వ్యతిరేకిస్తున్నారో ఆలోచించాలని కోరారు. "తమిళనాడులో కుటుంబ, అవినీతి పాలన నడుస్తోంది. స్టాలిన్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది. తండ్రీకొడుకులు అక్కడ ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నారు. భాషల పేరు మీద దక్షిణాదికి అన్యాయం చేయాలని బీజేపీ అనుకోవడం లేదు. ప్రభుత్వ వ్యతిరేకతను డైవర్ట్ చేసేందుకు డీలిమిటేషన్ అంశాన్ని తెరపైకి తెచ్చారు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు. "వచ్చే శాసనసభ ఎన్నికల్లో కర్నాటక, తెలంగాణలో అధికారంలోకి వస్తాం. తమిళనాడులో బీజేపీ మరింత బలపడుతోంది. కాంగ్రెస్ పాలిత మూడు రాష్ట్రాల్లో ఎన్నికలు వస్తే తామే అధికారంలోకి వస్తాం. అన్ని రాష్ట్రాల్లో అభివృద్ధి జరగాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటోంది" అని కిషన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు పార్టీలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. చెన్నై సమావేశానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ జతకట్టిపోవడం వారి చీకటి ఒప్పందానికి నిదర్శనమని పేర్కొన్నారు. గతంలో ఇవే రాజకీయ పార్టీలు రాజ్యాంగం మారుస్తారని ప్రచారం చేశారనీ, ఏది జరిగినా ఏ ప్రాంతానికి అన్యాయం జరగదని స్పష్టం చేశారు.

కేటీఆర్ సభలో అపశృతి..

ర్యాలీలో కానిస్టేబుల్‌పైకి దూసుకెళ్లిన బైక్

నవతెలంగాణ - కరీంనగర్ క్రైమ్

కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కేటీఆర్ సభలో అపశృతి చోటుచేసుకుంది. సభ ప్రారంభానికి ముందు మంకమ్మతోట నుంచి బీఆర్ఎస్ నేతలు బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కరీంనగర్ కోతిరాంపూర్ చెందిన శ్రీకాంత్ అనే యువకుడు బుల్లెట్ బండి మీద బీభత్సం సృష్టించాడు. బుల్లెట్ బైక్‌ని వేగంగా నడుపుతూ జనం పైకి దూసుకెళ్లాడు. ఈ ఘటనలో అక్కడే విధులు నిర్వహిస్తున్న పద్మజ అనే కానిస్టేబుల్ కాలుపైకి బైక్ ఎక్కించాడు. దాంతో కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడటమే కాకుండా కాలు విరిగింది. వెంటనే అక్కడే ఉన్న పోలీసు సిబ్బంది శ్రీకాంత్‌ని పట్టుకుని బుల్లెట్ బండిని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రమాదంలో గాయపడ్డ కానిస్టేబుల్ పద్మజను కరీంనగర్ నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో ఆమెను కేటీఆర్ నేతలతో కలిసి పరామర్శించారు. మెరుగైన చికిత్స అందిస్తామని భరోసా ఇచ్చారు.

ఆమెపై ఆంక్షలు

(మొదటిపేజీ తరువాయి)

మహిళలు కుటుంబ సభ్యుల ఆమోదాన్ని తీసుకోవటం అవసరమని చెప్పారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో లింగ సమానత్వం వైపు అసమాన పురోగతిని ఈ సర్వే నొక్కి చెప్తున్నది.

ఇంటి నిర్ణయాల్లో పురుషులకు జై

ఇక ఆర్థిక స్వయంప్రతిపత్తితో పాటు విస్తృత లింగ వైఖరులను ఈ సర్వే గుర్తించింది. దేశం ఆధునిక ఆకాంక్షలు, వేళ్లూనుకున్న పితృస్వామ్యానికి మధ్య నలిగిపోతున్నదని వివరించింది. ఇంటి నిర్ణయాలలో పురుషులదే తుది నిర్ణయమని 69 శాతం మంది అన్నారు. అయితే, 30 శాతం మంది దీనిని వ్యతిరేకించారు. మరింత సమానత్వం ఉండాలని తెలిపారు. ఇంటి విషయాల్లో పురుషుల ఆధిపత్యానికి జై కొట్టిన రాష్ట్రాలలో యూపీ ముందు వరుసలో ఉన్నది. ఇక్కడ 96 శాతం మంది పురుషులదే తుది నిర్ణయమని చెప్పారు. అయితే, కేరళలో 75 శాతం మంది దీనిని వ్యతిరేకించారు.



విద్య, ఉద్యోగంపై..

మహిళల వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించి కూడా ఈ సర్వేలో విరుద్ధమైన అభిప్రాయాలు వెల్లడయ్యాయి. కొడుకులతో సమానంగా కూతర్లనూ విద్యను అభ్యసించేలా ప్రోత్సహించాలని 93 శాతం మంది అభిప్రాయపడ్డారు. ఆరు శాతం మంది మాత్రం వ్యతిరేకించారు. ఒడిశాలో 98 శాతం మంది బాలికలకు సమాన విద్యా అవకాశాలను సమర్థించారు. బీజేపీ పాలిత గుజరాత్‌లో మాత్రం 22 శాతం మంది వ్యతిరేకించారు. కుటుంబంలోని మహిళలు గడపదాటి ఉద్యోగాలు చేసేలా ప్రోత్సహించాలని 84 శాతం మంది చెప్పారు. 15 శాతం మంది అలా చేయొద్దని అన్నారు. ఇక రాష్ట్రాలవారీగా చూసుకుంటే యూపీలో అత్యధికంగా 98 శాతం మంది ఈ నిర్ణయాన్ని సమర్థించారు. గుజరాత్‌లో 38 శాతం మంది వ్యతిరేకించారు.

భార్యను కొట్టటంలో తప్పులేదు..!

దేశంలో ఎందరో మహిళలు ఎదుర్కొంటున్న సమస్య గృహ హింస. దీనికి సంబంధించిన విషయంలోనూ సర్వేలో వివిధ అభిప్రాయాలు వెల్లడయ్యాయి. ఇంటికి సంబంధించి తన నిర్ణయాలకు భార్య అభ్యంతరం చెప్తే ఆమెను భర్త కొట్టడాన్ని కూడా కొందరు సమర్థించారు. చాలా మంది వ్యతిరేకించారు. 83 శాతం మంది ఈ హింసను వ్యతిరేకించారు. 16 శాతం మంది మాత్రం అది సరైందేనని చెప్పారు. గృహ హింసను ఉత్తరాఖండ్‌లో రెండు శాతం మంది మాత్రమే సమర్థించారు. ఇది ఆంధ్రప్రదేశ్‌లో 31 శాతంగా ఉండటం గమనార్హం.

పురుషులు ఓటు వేసినవారికే మహిళలు ఓటు వేయాలట..!

ప్రజాస్వామ్య రంగంలోనూ సాంప్రదాయ లింగ పాత్రలు కొనసాగుతున్నాయి. మహిళల నిర్ణయాలపై ఇతరుల ప్రభావం, ఆధిపత్యం ఉంటున్నది. అయితే, ఈ విషయంలో కేరళ మిగతా అన్ని రాష్ట్రాల కంటే చాలా చక్కటి స్థానంలో ఉన్నది. మహిళలకు స్వతంత్రంగా ఓటు వేసే స్వేచ్ఛ ఉండాలని 93 శాతం మంది చెప్పారు. ఇక కుటుంబంలోని పురుషులు ఎవరికి ఓటు వేస్తే మహిళలు కూడా వారికే ఓటు వేయాలని యూపీలో 91 శాతం మంది తమ అభిప్రాయాన్ని వెల్లడించటం గమనార్హం. మొత్తంగా, చూసుకుంటే 51 శాతం మంది ఇదే అభిప్రాయాన్ని చెప్పారు. ఇక మహిళలు వారికి నచ్చినవారికే ఓటు వేసుకోవచ్చని 48 శాతం మంది తెలిపారు.

మహిళలపై వేధింపుల గురించి..

సమాజంలో మహిళలపై వేధింపులు, భద్రత గురించి కూడా ఈ సర్వేలో అభిప్రాయాలు వెల్లడయ్యాయి. తమ ప్రాంతాల్లో బహిరంగ ఈవ్-టీజింగ్, వేధింపులు అనేవి తరచుగా జరుగుతున్న సమస్య అని దేశవ్యాప్తంగా 42 శాతం మంది చెప్పారు. 56 శాతం మంది మాత్రం అలా ఏమీ కాదని అన్నారు. తమిళనాడులో 17 శాతం మంది ఇవి తరచుగా జరుగుతున్నాయని చెప్పారు. కర్నాటకలో 79 శాతం మంది ఈ అభిప్రాయాన్ని తెలిపారు. ఇది దేశంలో మహిళలు ఎదుర్కొంటున్న వేధింపుల సమస్యను హైలెట్ చేస్తున్నది.

రాష్ట్రాలతో చర్చించాకే డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలి

ప్రభుత్వ సలహాదారు కేకే

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అన్ని రాష్ట్రాలతో చర్చించాకే కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. డీలిమిటేషన్ అంశంపై చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. పార్లమెటులో చట్టం ఆమోదం పొందాకే కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్ చేయాలని కోరారు. పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం ఇంకా పెరగాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. కొన్ని రాష్ట్రాలు కేవలం సీట్లు గురించి మాత్రమే పోరాడటం లేదని తెలిపారు. పార్లమెంటులో తమ గళానికి ప్రాధాన్యత ఉండాలనే లక్ష్యంతో పోరాడుతున్నాయని చెప్పారు. ఈ అంశంపై దక్షిణాది నేతలు అంతా ఒక్కటి కావాలనీ, లేదంటే తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. జనాభా ప్రకారం నియోజక వర్గాల పునర్విభజన చేయాలని కేంద్రం ప్రయత్నిస్తున్నదని చెప్పారు. ఆదాయం ఎక్కువ, జనాభా తక్కువగా ఉన్న దక్షిణాది రాష్ట్రాలు ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని ఆయన గుర్తు చేవారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
సోమవారం మార్చి 24, 2025 www.navatelangana.com

చంపాపేట్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే



నవతెలంగాణ-చంపాపేట్

చంపాపేట్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట డివిజన్ పరిధిలోని కర్మన్‌ఘాట్ ఓల్డ్ విలేజ్ నందు శ్రీ భవాని సమేత నాగలింగేశ్వర స్వామి ఆర్చ్‌ని ఆదివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ కమిషనర్ సరస్వతికి డాక్టరేట్



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పుప్పాల సరస్వతికి అమెరికా అధ్యక్షులు రోనాల్డ్ ట్రాంప్, సలహాదారుడు డాక్టర్ మార్క్ బాన్స్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ సరస్వతి మాట్లాడుతూ ప్రజా జీవితంలో ఒక అధికారిగా నాకు డాక్టరేట్ అవార్డు రావటం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ప్రతి ఒక్కరు పేద ప్రజలకు సేవ చేయాలని కోరారు. అనంతరం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ శ్యాం సుందర్, డిఈఈ వెంకన్న, మేనేజర్ నాగేశ్వర్ రావు, అర్.ఓ.వేణు గోపాల్ రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, సిబ్బంది పూల మాలలు వేసి శాలువాతో కమిషనర్‌ను ఘనంగా సన్మానించారు.

ఒక్క సీసీ కెమెరా

వంద మంది పోలీసులతో సమానం

• ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 1వ డివిజన్ పరిధిలోని నవయుగ ఎంక్లేవ్ కాలనీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో సీసీ కెమెరా ఏర్పాటు చేయడం ప్రజలకు శాంతి, భద్రతలు, పరిరక్షణ కోసం చేపట్టిన గొప్ప కార్యక్రమం అని కొనియాడారు. కమ్యూనిటీలో విశ్వాసాన్ని నియోజకవర్గానికి రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. గతంలో వర్ష కాలం వచ్చిందంటే లోతట్టు ప్రాంతాల కాలనీలన్నీ వరద నీటితో ఇండ్లలోకి చేరి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే వారని గుర్తుచేశారు. కోట్లాది రూపాయల నిధులతో ఎస్ఎన్‌డీపీ నాలాలను ఏర్పాటు చేయటంతో సమస్య పరిష్కారం అయిందని హర్షం వ్యక్తం చేశారు. కాలనీలు అభివృద్ధి కోసం ప్రభుత్వాన్ని ఎదిరించి అయినా సరే నిధులు తీసుకొస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం



పెంచుతాయని, సీసీ కెమెరాలు దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలను నిరోధించడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం జరిగిందన్నారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం రాష్ట్రంలో 12వందల కోట్ల నిధులు మంజూరు చేయగా.. అందులో మహేశ్వరం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, సూర్లగంటి అర్జున్, పెద్దబావి ఆనంద్ రెడ్డి, లిక్కి కృష్ణారెడ్డి, సంరెడ్డి వెంకట్ రెడ్డి, భీమిడి జంగారెడ్డి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

రైతు బజార్

చిరు వ్యాపారస్తులకు అండగా ఉండండి

సీఐటీయూ నాయకుల విజ్ఞప్తి



నవతెలంగాణ-ఎల్బీనగర్

వనస్థలిపురం రైతు బజార్ చిరు వ్యాపారస్తులకు అండగా ఉండాలని సంక్షేమ సంఘాల ప్రతినిధులకు సీఐటీయూ నాయకులు విజ్ఞప్తి చేశారు. వనస్థలిపురం రైతు బజార్ దగ్గర చిల్లర వ్యాపారస్తులతో సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో రైతు బజార్ తోపుడు బండ్లు, చిరు వ్యాపారస్తుల కార్మికులతో ఆదివారం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షత నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్ మాట్లాడుతూ గత 40 సంవత్సరాల నుండి వనస్థలిపురం ముందు చిరు వ్యాపారం చేసుకుంటూ దాదాపు 130 కుటుంబాలు జీవనం కొనసాగించే వారు అన్నారు. గత ఐదు నెలల కిందట చుట్టుపక్కల కాలనీవాసులు సంక్షేమ సంఘాలు ట్రాఫిక్ ఇబ్బంది అవుతున్నాయని జీహెచ్ఎంసీ అధికారులకు ట్రాఫిక్ అధికారులకు కంప్లీట్ ఇయ్యడం మూలంగా చిరు వ్యాపారస్తులను మరియు తోపుడుబండ్లను తొలగించారని గుర్తుచేశారు. తర్వాత సీఐటీయూ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి రాష్ట్ర ప్రచార కార్యదర్శి మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్‌కి ప్రభుత్వ తరపున ప్రత్యామ్నాయం ఉంచాలని కోరగా..ఆయన సహకారంతో జీహెచ్ఎంసీ పోలీసు ట్రాఫిక్ అధికారులతో మాట్లాడి గత నెలలో 7న పెట్టించడం జరిగిందన్నారు. మళ్లీ చిరు వ్యాపారస్తుల్ని తొలగించాలని సంక్షేమ సంఘాల పేరుతో కాలనీవాసులు.. కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ ఇంచార్జి మధుయాష్కీని విమర్శిస్తూ వార్తలు పెడుతున్నారని అన్నారు. దయచేసి రాజకీయాలను వ్యాపారస్తులపైన రుద్దవద్దని ఎమ్మెల్యే జోక్యం చేసుకొని బీఆర్ఎస్ పార్టీ సంబంధించిన నాయకులతో వార్తలు ఇప్పించవద్దని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రజలకు చిరు వ్యాపారస్తులకు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా, ఇబ్బందులు రాకుండా చూడాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సమావేశంలో భారతమ్మ, చిన్న శ్రీను, కోటేశ్వరరావు, జయమ్మ నరసమ్మ, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

మాతృ దేవోభవ అనాథ ఆశ్రమంలో అన్నదానం



నవతెలంగాణ-బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని మాతృ దేవోభవ అనాథ ఆశ్రమంలో భూక్య శ్రీనిత నాయకన్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం 150 మందికి విశేష అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ వ్యవస్థాపకుడు గట్టు గిరి మాట్లాడుతూ అభాగ్యుల ఆకలిని తీర్చిన వారి తల్లిదండ్రులు భూక్య శంకర్-అనితలకు, అన్నయ్య భీంరావ్ సాకేత్ వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. చి.భూక్య శ్రీనిత నాయకన్ మీరు ఇలాంటి పుట్టినరోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలని అన్నారు. మాతృదేవోభవ మానసిక వికలాంగుల అనాథ ఆశ్రమంలో మతిస్థిమితం కోల్పోయిన 150 మంది అభాగ్యులున్నారని తెలిపారు. మీ పుట్టినరోజులు, పెళ్లి రోజులు, మరేదైనా మీ ఇంట్లో శుభాకార్యములుంటే మన మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలో జరుపుకోవాలని కోరారు. మన ఆశ్రమానికి సహాయం చేయాలనుకున్న దాతలేవరైనా మానవతా దృక్పథంతో స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

రంజాన్ మాసంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి, సోదర భావానికి ప్రతీకలని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న పహాడీ షరీఫ్ ప్రీమియర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రంజాన్ మాసం పవిత్రత, ఉపవాస దీక్ష ప్రాముఖ్యత, మత సామరస్యంపై అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఆమె గత ప్రభుత్వ మాజీ సీఎం కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో ముస్లింలకు అందించబడిన రంజాన్ తోఫా ప్రస్తావిస్తూ, ప్రస్తుత ప్రభుత్వాన్ని ముస్లింల సంక్షేమం కోసం వెంటనే రంజాన్ తోఫా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అవినాష్, రంగారెడ్డి జిల్లా సీనియర్ నాయకులు కైసర్ బాం, నాసర్ అవల్గి, అబ్దుల్లాబీన్, పైసల్బామ్, సూరెడ్డి కృష్ణారెడ్డి, అబ్దుల్లా లడ్డి, మేరాజ్ ఖాన్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

'యువత భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి'



నవతెలంగాణ - మీర్‌పేట్

భగత్ సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకొని భగత్ సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ అన్నారు. భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీఐటీయూ ఆధ్వర్యంలో బాలాపూర్ చౌరస్తాలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా సీపీఐ(ఎం) కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్, నవతెలంగాణ సీనియర్ జర్నలిస్ట్ ఎస్‌కె.సలీమ లు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన యువ కిషోరాలకు లాల్ సలాం తెలిపారు. 24ఏళ్ల అతి చిన్న వయసులో దేశం కోసం ఉరి కంబాన్ని నవ్వుతూ ముద్దాడిన యువ కిషోరాలు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ అని, యువతకు ఎంతో ధైర్యాన్ని ఇస్తూ దేశం కోసం వాళ్ళ ప్రాణాలను ఉరుకొయ్యలకు తృణపాయంగా అర్పించిన వీరులని కొనియాడారు. అటువంటి వీరులు జన్మించిన ఈ గడ్డపై జన్మించినందుకు మేం ఎంతగానో గర్విస్తున్నామన్నారు. వారి త్యాగ ఫలాలను అనుభవిస్తున్న ప్రతి దేశ పౌరుడు ఆ వీరుల అడుగుజాడల్లో నడిచి దేశాన్ని ఇంకా ముందుకు తీసుకెళ్లాలని కోరారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినాదాలు చేస్తూ భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని పోరాటం చేసిన మహనీయులు అని గుర్తుచేశారు. దేశంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక అసమానతలు లేని సమాజం రావాలని కోరుకున్నారని చెప్పారు. సూర్యచంద్రులు ఉన్నంత వరకు, భూమి ఆకాశము ఉన్నంత వరకు దేశ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వారు నిలుస్తారని తెలిపారు. నేటి యువత జాతీయ ఉద్యమ స్ఫూర్తితో కుల, మతాల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుతున్న నాయకులకు, పార్టీలకు వ్యతిరేకంగా ప్రజలను ఏకం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ బాలాపూర్ మండల అధ్యక్షులు ప్రకాష్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ మల్లాపూర్ మండల అధ్యక్షులు దాసరి అరవింద్, సీఐటీయూ పాలపూర్ మండల అధ్యక్షులు దాసరి బాబు, కార్యదర్శి శేఖర్ యాదవ్, కృష్ణమూర్తి, సీపీఐ(ఎం) నాయకులు యాదగిరి చారి, నిరంజన్, ఆంజనేయులు, లక్ష్మి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-చంపాపేట్

సీపీఐ(ఎం) చంద్రాయణగుట్ట జోన్ కమిటీ ఆధ్వర్యంలో షాహిద్ భగత్ సింగ్ 94 వర్ధంతి సందర్భంగా ఫలక్నుమా సీపీఐ(ఎం) ఆఫీస్ వద్ద ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) చంద్రాయణ గుట్ట జోన్ కమిటీ కార్యదర్శి ఎస్. కిషన్, ఏ. కృష్ణ వీరాంకుమార్, చంద్రాయణ గుట్ట జోన్ కమిటీ సభ్యులు శ్రీను, సోమన్న, వీరన్న, మల్లేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-తుర్కయంజాల్



రాగన్నగూడ సీపీఐ(ఎం) పార్టీ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పార్టీ మున్సిపల్ కమిటీ సభ్యుడు ఆశీర్వాదం, నాయకులు కొండిగారి శంకర్, నకుమార్ల యాదగిరి, నిమ్మ లక్ష్మయ్య, వెంకటేష్, అశోక్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ- అబ్దుల్లాపూర్‌మెట్

పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ, కుంట్లూర్, రావినారాయణ రెడ్డి కాలనిలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు తైలి మధు, చింత వెంకటేష్ ల ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజ్ రవీంద్రా చారి, కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డిలు హాజరై భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్పించారు. ఈ కార్యక్రమంలో యువజన విద్యార్థి సంఘ నాయకులు వీరేష్, శ్రావణి, నిఖిల్, కార్తీక్, సంజయ్, గణేష్, అంజి, భాను, స్వామి తదితరులు పాల్గొన్నారు.

బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో...

బీసీ హక్కుల సాధన సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కేతరాజు నరసింహ ఆధ్వర్యంలో అబ్దుల్లాపూర్ మెట్ గ్రామ పంచాయతీ పరిధిలోని జేఎన్ఎన్ యూ ఎంఆర్ కాలనీలో సర్దార్ భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోదాల రామకృష్ణ, సీనియర్ నాయకులు ఐతరాజు భిక్షపతి, వెనుగోటి లక్ష్మి, కొత్తపల్లి అన్నపూర్ణ తెరాల లక్ష్మి, కన్య, వైశాలి, మంజుల, గీత, పసుపులేటి శివ తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ- బడంగ్‌పేట్

దేశ స్వాతంత్ర పోరాటంలో అమరులైన మహా నాయకులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల జీవితాలను ప్రజలు ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని రంగారెడ్డి జిల్లా గిరిజన సమాఖ్య ప్రధాన కార్యదర్శి జర్పుల శివ ప్రచండ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేటలోని బాలాపూర్ మండలం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న కామ్రేడ్ నరసింహారెడ్డి స్తూపం వద్ద సర్దార్ షహీద్ భగత్ సింగ్ 94వ వర్ధంతి వేడుకలను మారేబోయిన నరేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అమరుడు భగత్ సింగ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సభ్యులు మారబోయిన నరేందర్, నాగిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-చంపాపేట్

సీపీఐ(ఎం) మలక్‌పేట్ యాకుత్‌పుర జోన్ కమిటీ ఆధ్వర్యంలో కుర్మగూడ డివిజన్ చంద్రయ్య హట్స్‌లో షహీద్ భగత్ సింగ్ 94వ వర్ధంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలు మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం. బాలు నాయక్, సీపీఐ(ఎం) స్థానిక నాయకులు వి.లింగయ్య, వి. యాదయ్య, వీకే. నాగరాజు, ఎన్. వి.వెంకటేష్, వెంకటేష్, సత్యనారాయణ, మోహన్, వి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- హయత్‌నగర్



భారత స్వాతంత్ర్య పోరాటంలో అసమాన ధైర్యం, త్యాగం ప్రదర్శించిన విప్లవ వీరులు షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతిని పురస్కరించుకుని అఖిల భారత విద్యార్థి సమాఖ్య అఖిల భారత యువజన సమాఖ్య హయత్ నగర్ సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ హయత్‌నగర్ మండల కార్యదర్శి బొంగు అరుణ్ కుమార్ గౌడ్ అధ్యక్షత వహించగా, ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిల్లా గర్ల్స్ కన్వీనర్ కాటి శ్రావణి హాజరయ్యారు. తర్వాత భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి మర్రి శోభన్, ఏఐఎస్ఎఫ్ నాయకులు ఈనపల్లి ఉపేందర్, వీరమల్ల శివ, జూనోతల భాను ప్రకాష్, గాలెంక కాశి, ఏఐవైఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-చంపాపేట్

నేడు భారతదేశం మతోన్మాదంతో ఉట్టుడికి పోతోందని, మతోన్మాదం ఎంత ప్రమాదమో వంద సంవత్సరాల కిందటే భగత్ సింగ్ గుర్తించాడని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మహమ్మద్ అబ్బాస్ అన్నారు. సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో ఐఎస్‌సదన్ చౌరస్తా, సంతోష్ నగర్‌లో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు జి. విఠల్, ఎం. శ్రావణ్ కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు శోభన్ నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు, హైదరాబాద్ సౌత్ కమిటీ కార్యదర్శి ఎం.బాలు, కిషన్, జంగయ్య, తదితర రంగాల్లోని కార్మికులు, ఉద్యోగులు, యువకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - దిల్‌సుఖ్‌నగర్



విప్లవ వీరకిశోరం భగత్ సింగ్ జీవితం నేటి యువతకు ఆదర్శం కావాలని డీవైఎఫ్ఐ మాజీ నేత మల్లెపాక వీరయ్య అన్నారు. చైతన్యపురి డివిజన్‌లోని సీపీఐ(ఎం) కార్యాలయంలో ఆదివారం భగత్ సింగ్ 94వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సమావేశంలో సరూర్ నగర్ సర్కిల్ డీవైఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడుగా పులిపప్పుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా మేకల కృష్ణలు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ మాజీ నేతలు సి హెచ్ వెంకన్న, కట్ట శ్రీనివాస్, జి. మనోహర్, కడారి రాములు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- అబ్దుల్లాపూర్ మెట్

అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో విప్లవ వీరులు షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ యువ కిశోరాల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు గుండె శివకుమార్, ముత్యాలు, జంగయ్య క్రిష్ణ, సురేష్, శివలింగం తదితరులు పాల్గొన్నారు.



వేంకటేశ్వర స్వామి

బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే దేవిరెడ్డి

నవతెలంగాణ-హయత్ నగర్

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని విజయ శ్రీ కాలనీలో పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవి రెడ్డి సుధీర్ రెడ్డి హాజరై స్వామి వారి ఆశీర్వాదం అందుకున్నారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకులు జక్కిడి రఘు వీర్ రెడ్డి, దేవాలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆర్య వైశ్యులకు అండగా ఉంటా

• టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త

నవతెలంగాణ -నాగోల్

ఆర్య వైశ్యులకు అన్ని విధాలుగా సహాయ సహకారాలను అందిస్తూ అండగా ఉంటానని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని జైపూర్ కాలనీలో గల సాయిబాబా దేవాలయంలో శ్రీ వాసవి అన్నపూర్ణ ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆదివారం ఎమ్మెల్సీ బుగ్గల దయానంద్ గుప్తతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తర్వాత నూతన అధ్యక్షుడు జగిని అశోక్, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, కోశాధికారి సాయి రమేశ్‌ల తో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం శ్రీనివాస గుప్త మాట్లాడుతూ 25 కోట్ల మంది ఉన్న ఆర్య వైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. 70% జీఎస్టీ, ఆదాయ పన్నులను వైశ్యులే అధిక మొత్తంలో చెల్లిస్తున్నారని చెప్పారు. పెద్ద పెద్ద వ్యాపారాలు కూడా ఆర్య వైశ్యులవే అని, ఆర్య వైశ్యులు అందరూ కలిసి మెలసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైతన్య పూరి కార్పొరేటర్ నర్సింహా గుప్త, మొగుళ్ళ పల్లి ఉపేందర్ అశోక్ గుప్త, స్థానిక కార్పొరేటర్ అరుణ సురేందర్, అశోక్ వాసు గుప్త, ఆర్య వైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను కలిసిన చిప్పల నర్సింగరావు



నవతెలంగాణ-ఘట్కేసర్

తెలంగాణ ఉద్యమ నేత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్‌ను ఆదివారం జాతీయ మాల మానాడు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పల నర్సింగరావు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బొగ్గుల వెంకటేష్, మాల మహానాడు నాయకుడు అల్లిబిల్లి మహేందర్, తదితరులున్నారు.

వాకర్స్‌కు నడకదారి చూపిస్తా : ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ - చర్లపల్లి

ప్రభుత్వ రంగ సంస్థ ఈసీఐఎల్ ప్రాంగణంలో ఉదయం వేళల్లో వాకర్స్ నడక కోసం అనుమతించేలా చూస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం ఈసీఐఎల్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యేను సైనిక్‌పురిలోని వారి నివాసంలో కలిసి తమకు నడకదారికి పరిష్కారం చూపాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈసీఐఎల్ సంస్థ సీఎండీ అనురాగ్ కుమార్‌తో మాట్లాడి, సమస్యను ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి వాకింగ్‌కు అనుమతి లభించేలా చూస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీఐఎల్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, చర్లపల్లి కాలనీల సమాఖ్య అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి, నాయకులు నేమురి మహేష్ గౌడ్, గంప కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం ప్రాణాలిచ్చిన వీరుడు భగత్ సింగ్

- సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం
- పలు చోట్ల భగత్‌సింగ్ వర్ధంతి



నవతెలంగాణ-కాప్రా

దేశం కోసం ప్రాణాలిచ్చిన వీరుడు భగత్‌సింగ్ అని సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భగత్‌సింగ్ వర్ధంతి నిర్వహించారు. కమలానగర్ పార్టీ కార్యాలయం నుంచి ఈసీఐఎల్ ఎక్స్ రోడ్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పి.సత్యం మాట్లాడుతూ భగత్ సింగ్ దేశం కోసం తన ప్రాణాలు విడిచిన గొప్ప వీరుడని అన్నారు. ఈ దేశం లౌకిక దేశంగా ఉండాలని కోరుకున్నాడని అన్నారు. మతం ప్రమాదకరమైందని కార్మికుల ఐక్యంగా ఉండి పోరాడాలని చెప్పాడని అన్నారు. పరాయి పీడనే కాదు సొంత దేశ పీడకుల విముక్తి కూడా జరగాలని కోరుకున్నాడని చెప్పారు. ఆయన ఆలోచనలు మిగతా నాయకులు కన్నా భిన్నంగా ఉండడంతో ప్రభుత్వాలు ఆయన జయంతి, వర్ధంతులను పట్టించుకోవడం లేదన్నారు. స్వాతంత్రం వచ్చి 8 దశాబ్దాలు అవుతున్న అసమానతలు మరింత పెరుగుతున్నాయన్నారు. దేశ సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమైందని అన్నారు. యువతకు ఉపాధి పగటి కలగానే మిగిలిందని చెప్పారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి మాట్లాడుతూ భగత్ సింగ్, రాజుగురు, సుఖదేవ్ ముగ్గురిని ఒక రోజు ముందుగానే ఉరితీసారని అన్నారు. దానికి కారణం తండోపతండోలుగా వస్తున్న జనాన్ని చూసి బ్రిటిష్ ప్రభుత్వం భయపడి అలా చేయవలసి వచ్చిందన్నారు. లాలాజపతిరాయిని బ్రిటిష్ సైన్యం తీవ్రంగా హింసించడంతో ఆయన చనిపోవడంతో దానికి ప్రతీకారంగా బ్రిటిష్ పార్లమెంట్‌లో భగత్ సింగ్ వారు అనుచరులు బాంబు వేసి పారిపోకుండా అక్కడే నిలబడ్డారని చెప్పా రు. ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినాదాలు ఇచ్చు కుంటూ పోలీసులకు లొంగిపోయారని తెలిపారు. పీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ..భగత్ సింగ్ దేశం లౌకిక దేశంగా ఉండాలని కోరుకున్నాడని తెలిపారు. కానీ ఇప్పుడున్న పాలకులు మతం, కులంతో రాజకీయాల చేస్తున్నారని అన్నారు. డిలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాలు చాలా నష్టపోతాయని, ఇకముందు దక్షిణాది రాష్ట్రాలను ప్రభుత్వాలు పట్టించుకోవని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎర్ర అశోక్, జి శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, గండూరి ఫుడ్స్ కార్మికులు, శ్రీమన్నారాయణ, యాదగిరి రావు, పీబీ చారి, తదితరులు పాల్గొన్నారు.



నేరేడ్‌మెట్‌లో..

సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కమిటీ ఆధ్వర్యంలో షహీద్ భగత్ సింగ్ 94వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి గుంటి లక్ష్మణ్ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథులుగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి హాజరయ్యారు. మల్కాజిగిరిలోని అనుటెక్స్ నుండి మల్కాజిగిరి చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోమటి రవి మాట్లాడుతూ.. భగత్ సింగ్ చిన్ననాటి నుండి దేశభక్తి, సమానత్వం, కులమత రహిత సమాజం కొరకు ఆలోచించే వారని తెలిపారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని చిన్ననాటి నుండే తన మనసులో కసిని నింపుకోని అనేకమంది యువకులను చేరదీసి బలమైనటువంటి ఉద్యమాన్ని రూపొందించారని తెలిపారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మా స్వాతంత్రం మాకు కావాలి అనే నినాదంతో అసెంబ్లీ హాల్ లోపల బాంబు దాడి చేసి నిరసన వ్యక్తం చేశారని తెలిపారు. బ్రిటిష్ పోలీసులు భగత్ సింగ్‌ను అరెస్టు చేసి తప్పుడు విచారణలతో మార్చి 23-1931లో భగత్ సింగ్, సుక్ దేవ్, రాజ్ గురును ఉరి తీశారని తెలిపారు. వారి ఆశయాలను అనుగుణంగా దేశ సమైక్యతను కాపాడుతూ భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. మోడీ గొప్ప గొప్ప స్వాతంత్ర సమరయోధుల చరిత్రను కనుమరుగు చేస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్త నాథూరామ్ గాడ్సే లాంటి వారిని వీరులుగా కీర్తించబడుతున్నారు. అనంతరం మల్కాజిగిరి మండల డీవైఎఫ్ఐ (యువజన)అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ.. యువతరం మత్తు పానీయాలకు డ్రగ్స్‌కు, అశ్లీలతకు, సంఘవిద్రోహ కార్యక్రమాలకులోను కాకుండా భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు కృపాసాగర్, విజయ్ కుమార్, సీఐటీయూ మండల నాయకులు బంగారు నర్సింగరావు, డీవైఎఫ్ఐ నాయకులు రాజ్ కుమార్, అంజి, ఆనంద్, కొండల్, యువతి, యువకులు, కార్మికులు, తదితరులున్నారు.

ఘట్కేసర్‌లో..

సీపీఐ(ఎం) ఘట్కేసర్ మండల కమిటీ ఆధ్వర్యంలో దేశ స్వతంత్రం కోసం అతి చిన్న వయసులోనే పోరాడి ఉరి కంబాన్ని ముద్దాడిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి కార్యక్రమానికి సీపీఐ(ఎం) నాయకులు చింతల యాదయ్య, మండల కార్యదర్శి ఎన్. సబితలు హాజరై వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.పోచయ్య బి. సునీత దేవి చింతల అనిల్, శ్రీను, సునీత, అర్చన, సంజన, షారుణ్, దేవకి, లక్ష్మమ్మ తదితరులున్నారు.



అభివృద్ధిలో కాలనీ సంక్షేమ సంఘాల పాత్ర కీలకం



- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా/చర్లపల్లి

కాలనీల అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఇటీవల ఎన్నికైన మధురానగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వంగ కొండల్‌రెడ్డి, వాకిటి అనిలారెడ్డిల ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆదివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని సైనిక్‌పుర్‌లోని ఇంటి వద్ద కలిసి శాలువా కప్పి పూల మొక్కను అందజేశారు. అనంతరం కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శాలువాలు కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో మధురానగర్ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాలనీ అభివృద్ధికి అవసరమైన నిధులను మంజూరు అయ్యేలా చొరవ తీసుకుంటానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య సీసీఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మారెడ్డి, నాయకులు నేమురి మహేష్ గౌడ్, గంప కృష్ణ, లింగం నాయక్, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ నాయక్, ఈశ్వర్, మంతు నాయక్, తదితరులున్నారు.

పార్కింగ్ ఇలా - ప్రయాణం సాగేదెలా..



- కాలనీల నుంచి బయటకు వెళ్లేందుకు ఇక్కట్లు

నవతెలంగాణ-బోడుప్పల్

కాలనీ రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాల పార్కింగ్ చేస్తుండటంతో బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని పలు కాలనీల వాసులు బయటకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోడుప్పల్ కార్పొరేషన్ మారుతీ నగర్‌కు వెళ్ళే మార్గంలో బంక్వెట్ హాల్, నాన్‌వెజ్ మార్కెట్, టిఫిన్ సెంటర్‌తో పాటు ఇతర వాణిజ్య సముదాయాలు ఉండడంతో తమ అవసరాలకు వచ్చే ప్రజలు రోడ్లపై పార్కింగ్ చేస్తుండటంతో ఆ కాలనీల గుండా ఇతర ప్రాంతాలకు వెళ్ళే వాహనదారులు, కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ బంక్వెట్ హాల్‌కు సరైన పార్కింగ్ లేకపోవడంతో ఫంక్షన్‌లకు వచ్చే వాళ్ళు రోడ్లపై వాహనాలు నిలుపుతుండడం వలన కూడా ఇబ్బందులు వస్తున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఈ సమస్యకు స్థానిక ట్రాఫిక్ పోలీసులు ఏ విధంగా పరిష్కారం చూపుతారో వేచి చూడాలి.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం



- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-కాప్రా

వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కాప్రా డివిజన్ పరిధిలోని నేతాజీ నగర్ చౌరస్తా, డాక్టర్ ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని పద్మశాలి టౌన్ షిప్‌లో నర్సింహా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతున్నదని, నిత్యం పరిసర ప్రాంతాలనుంచి నుంచి వివిధ పనుల కోసం వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి ఇలాంటి చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. బాటసారులు దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బీఆర్ఎస్ నాయకులు మహిపాల్ రెడ్డి, భైరీ నవీన్ గౌడ్, కుమార స్వామి ,రహీం రామ్ రెడ్డి, కార్యకర్తలు, తదితరలున్నారు.

షహీద్ భగత్ సింగ్ యువతకు ఆదర్శం



- ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 94వ వర్ధంతి

నవతెలంగాణ-కాప్రా

షహీద్ భగత్ సింగ్ నేటి యువతకు ఆదర్శప్రాయుడని అఖిల భారత యువజన సమాఖ్య మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి సల్మాన్ బేగ్, టి. సత్య ప్రసాద్ పిలుపునిచ్చారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతిని పురస్కరించుకుని ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ వద్ద భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి సల్మాన్ బేగ్, టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ నిర్వహించిన పాత్ర యావత్తు దేశం విస్మరించరానిదని, 12ఏండ్ల అతి చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 23 ఏండ్ల యువ ప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించి ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలిచి దేశ భక్తిని రగిలించిన సమరయోధుడు భగత్ సింగ్ అని వారు కొనియాడారు. 1907 సెప్టెంబర్ 28న జన్మించిన భగత్ సింగ్ 1931 మార్చి 23న తన సహచరులు రాజ్ గురు, సుఖ్ దేవ్‌లతో కలిపి ఉరితీయబడ్డారని, భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావ శీల విప్లవకారులలో భగత్ సింగ్ అగ్రగణ్యుడని అన్నారు. ఈ కారణంగానే షహీద్‌గా దేశ ప్రజలు కొనియాడారని వారు గుర్తు చేశారు. మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడమే భగత్ సింగ్‌కు నేటితరం అందించగలిగే నిజమైన నివాళి అని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, గిరి బాబు, రాజ్ కుమార్, సందీప్ ఏఐఎస్ఎఫ్ నేతలు ఏడే.సతీష్ కుమార్,కళా సతీష్, మహేష్ బాబు, రవి, గిరి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి 'పోరుబాట యాత్ర'

- లోతుకుంటలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం



నవతెలంగాణ-అల్వాల్

గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్ ప్రజలకు అందుబాటులో లేరని, ఆయనను పదవి నుంచి తొలగించి, ఉప ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పోరుబాట పట్టారు. సిద్దిపేట కలెక్టరేట్ నుంచి రాజ్‌భవన్‌కు నర్సారెడ్డి చేపట్టిన పాదయాత్ర ఆదివారం అల్వాల్ సర్కిల్‌లోని లోతుకుంటకు చేరుకుంది. లోతుకుంట చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి నర్సారెడ్డి, స్టేట్ మహిళా యూత్ వైస్ ప్రెసిడెంట్ అంక్షారెడ్డి క్షీరాభిషేకం చేశారు. మేడ్చల్ నియోజవకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు నర్సారెడ్డికి ఘన స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం అంక్షారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు అందుబాటులో లేరని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడిగా కేసీఆర్ శాసనసభలో ప్రజల సమస్యలను ప్రశ్నించడం లేదని ఆరోపించారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే నర్సారెడ్డి పాదయాత్ర చేస్తున్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో నాచారం టెంపుల్ మాజీ చైర్మన్ లక్ష్మీ నర్సింలు గౌడ్, గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

కులగణన చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ



- కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్
- రేవంత్ పాలనలో అన్ని వర్గాలకు సముచిత గౌరవం

నవతెలంగాణ - జవహర్ నగర్

దేశంలోనే కులగణన చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్ యాదవ్ అన్నారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ అధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణలకు చట్టబద్ధత కల్పించిన సందర్భంగా అంబేద్కర్ నగర్ రోజ్ గార్డెన్ నుండి బాలాజీ నగర్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిధిగా తోటకూర వజ్రేష్ యాదవ్ బాలాజీ నగర్‌లోని అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, విగ్రహాలతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మున్సిప ల్ కార్పొరేషన్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు గోనే మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు శంకర్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వినయ్ కుమార్, మహిళ అధ్యక్షురాలు విజయ, సీనియర్ నాయకులు సదానంద్, మాజీ కార్పొరేటర్లు కంటెస్టెంట్ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానమాల సమర్పణ



నవతెలంగాణ-కాప్రా

కాప్రా మండల పరిధిలోని జమ్మిగడ్డ ప్రాంతం బీజేఆర్ కాలనీలో జ్ఞానమాల టీం ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం చేపట్టే జ్ఞానమాల కార్యక్రమం 147వ వారానికి చేరింది. జ్ఞానమాల టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, సభ్యులు ఎస్. ఏ.రహీమ్, నర్సింహ్మా చారి, దయానంద్, నాగేష్, కిరణ్, ధర్మేందర్, తదితరులు మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలతో జ్ఞానమాల సమర్పించారు.

వనజ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కీసర

దమ్మాయిగూడ మున్సిపాలిటీ 8వ వార్డు శ్రీవేదాద్రి నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకుల భాస్కర్ఆధ్వర్యంలో శ్రీవేదాద్రి నగర్ కాలనీలో వనజా హాస్పిటల్ (ఏ ఎస్ రావు నగర్) వారు ఉచితంగా మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ కౌన్సిలరు సంపనబోలు స్వప్న హరి గౌడ్, బీ ఆర్ఎస్ నాయకులు హరిగౌడ్ పాల్గొన్నారు. ఈ హెల్త్ క్యాంపుల ప్రజలు బీపీ, షుగర్, థైరాయిడ్, దంత సమస్యలు కంటి చెకప్ చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో వనజ హాస్పిటల్ డాక్టర్స్, సిబ్బంది కాలనీ వాసులు ప్రవీణ్, గోపి, చందు, అజయ్, మంజుల, ప్రతిభ, దీప, రమ్య, లక్ష్మి, విజయ, సాత్విక, సరిత , బాలమణి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో కాంగ్రెస్ నేతల సమావేశం

- ఆరు గ్యారెంటీ పథకాల అమలుపై చర్చ



నవతెలంగాణ-అల్వాల్

కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమంత్ రావు ఆదేశాల మేరకు మల్కాజిగిరి నియోజకవర్గంలోని క్యాంప్ ఆఫీసులో ఆదివారం 133వ డివిజన్ మచ్చ బొల్లారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాల అమలు తీరును ప్రతి ఇంటికి తిరిగి, ప్రతి ఓటరును అడిగి తెలుసుకోవాలని నిర్ణయించారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు ఏ విధంగా పనిచేయాలనే అంశంపై కూడా చర్చించారు. ఈ సమావేశంలో పీసీసీ డెలిగేట్ ఆర్. చంద్రశేఖర్, మల్కాజిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి తోట లక్ష్మీకాంత్ రెడ్డి, 133వ డివిజన్ కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్, సర్కిల్ (ఏబ్లాక్) అధ్యక్షుడు నిమ్మ అశోక్ రెడ్డి, కో-కన్వీనర్ సి.ఎల్. యాదగిరి, మహిళా సర్కిల్ అధ్యక్షురాలు వినాష్ మేరీ, మల్కాజిగిరి (బీ బ్లాక్) అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్, బి. సురేందర్ రెడ్డి, శ్రీశైలం యాదవ్, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

- కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్



నవతెలంగాణ - చర్లపల్లి

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ సూచించారు. ఆదివారం చర్లపల్లి డివిజన్‌లోని ఐజీ కాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ..ఆరోగ్యం ఉంటే అన్ని ఉన్నట్టు కాదు.. కానీ ఆరోగ్యం బాగా లేకపోతే ఏం ఉన్నా లేనట్టే అన్నారు. వైద్య శిబిరాన్ని కాలనీవాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో క్యాన్సర్, కార్డియాలజీ, పల్మనాలజీ, జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, గైనిక్, న్యూరో, జనరల్ మెడిసిన్, ఆప్తామాలజిస్ట్, ఆర్థోపెటిక్, యూరాలజీ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు సింగిరెడ్డి వెంకటరెడ్డి, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలకు న్యాయ సహాయంపై అవగాహన

నవతెలంగాణ - చర్లపల్లి

చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఖైదీలకు న్యాయసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బాల భాస్కరరావు, కార్యదర్శి జస్టిస్ కిరణ్ కుమార్‌లు హాజరై న్యాయసాయంపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్స్ ఖైదీల హక్కులను వివరించారు. న్యాయసేవాధికార సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. న్యాయమూర్తులకు జైలు ఆసుపత్రి, జైలు బ్యారక్స్ ఇతర ప్రాంతాలతో సహ జైలు ప్రాంగణంలో సందర్శించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి జైళ్ల సూపరింటెండెంట్ జి.రామచంద్రమ్, డిప్యూటీ సూపరింటెండెంట్లు వి.శశికాంత్, జి.రత్నం, జైలు ఉన్నంత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌కు స్వాగతం పలికిన బీఆర్ఎస్ నేతలు



నవతెలంగాణ-శామీర్‌పేట

కరీంనగర్‌లో జరగనున్న బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో భాగంగా ఆదివారం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు హైదరాబాద్ నుంచి కరీంనగర్ వెళుతున్నాడని సమాచారం అందుకున్న శామీర్ పేట బీఆర్ఎస్ నేతలు మార్గమధ్యలో శామీర్ పేట పెద్ద చెరువు కట్టమైసమ్మ వద్దకు పెద్దఎత్తున తరలివచ్చి ఘన స్వాగతం పలికారు. కేటీఆర్ వారికీ అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు సరసం మోహన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు బి నర్సింహా రెడ్డి, సీనియర్ నాయకులు తాళ్ల జగదీష్ గౌడ్, వంగ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగరిగారి ప్రీతంకు శుభాకాంక్షల వెల్లువ..



నవతెలంగాణ-కీసర

రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నాగరిగారి ప్రీతం పుట్టినరోజు వేడుకల్లో కీసర మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు బక్కని నర్సింగ్ రావు పాల్గొన్ని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలయ్య పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ - చర్లపల్లి

నిత్యం పరిసర ప్రాంతాలనుంచి నుంచి వివిధ పనుల కోసం ప్రజలు వస్తుం టారని, వారి దాహార్తిని తీర్చడానికి చలి వేంద్రాలను ఏర్పాటు చేయడం అభినంద నీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.ఆదివారం మల్లాపూర్ డివిజన్ నోమా బస్టాప్ దగ్గర ముస్కె సరస్వతి యాదవ్ జ్ఞాపకార్థం, ముస్కె రాములు యాదవ్ కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాటసారులు దాహార్తిని తీర్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, హౌసింగ్ బోర్డ్ కార్పొరేటర్ ప్రభుదాస్, బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి దయాకర్‌ను కలసిన కర్కనాగరాజు



నవతెలంగాణ-బాలానగర్

కాంగ్రెస్ సీనియర్ నేత అద్దంకి దయాకర్‌ను ఆయన స్వగృహంలో హిందూ స్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు కర్కనాగరాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏకగ్రీ వంగా ఎన్నికైన ఉద్యమకారుడు, ప్రముఖ అంబేద్కర్ వాది, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, అద్దంకి దయాకర్‌ను ఆదివారం శాలువాతో సత్కరించి, పూల బొకే అందజేశారు. ఐఎన్‌టీయూసీ కూకట్‌పల్లి నియోజక వర్గం అధ్యక్షులు, అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు కర్క నాగరాజు, అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం గ్రేటర్ ఉపాధ్యక్షులు కూతడి కృష్ణ, జై భీమ్ మాల బహుజన సంఘం ప్రధానకార్యదర్శి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులు పనులు ప్రారంభం



- నవతెలంగాణ వార్తకు స్పందన

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఈ నెల 20వ తేదీ గురువారం, కూకట్‌పల్లి డివిజన్ విజ్ఞాన్ పురి కాలని షెడ్డు సమీపంలో, రోడ్డు పక్కన వరద కాలువపై స్లాబ్ పలకలు ధ్వంసమయింది. దాంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని "రోడ్డు మరమ్మత్తులు చేయండి" అనే శీర్షికన ప్రచురించిన వార్తకు స్పందించిన అధికారులు వెంటనే పనులు ప్రారంభించారు. రోడ్డు పాడవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడి, వాహనదారులు ఇబ్బందులు పడటం నవతెలంగాణ ప్రతినిధి గమనించారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కావాలంటే రోడ్డు మరమ్మత్తులు చేయండి అనే శీర్షికన వార్త రాయడంతో వెంటనే పనులు ప్రారంభించడం జరిగింది. అందుకు కాలని సంక్షేమ సంఘం అధ్యక్షులు సంతోషం వ్యక్తం చేస్తూ.. కాలని వాసుల తరపున ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరికలు



నవతెలంగాణ-కూకట్‌పల్లి

హైదర్ నగర్ డివిజన్, రామ్ నరేష్ నగర్ మాజీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో.. 50 మంది కాంగ్రెస్ కార్యకర్తలు, బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గులాబీ కండువా కప్పి పార్టీ లోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్త నుంచి ముఖ్యమంత్రి వరకు, అబద్దాలతో పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలలో మొండి చేయి చూపుతున్నారన్నారు. బడ్జెట్ ప్రవేశంలో సంక్షేమ పథకాల జాడలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కినట్టుగా, బడ్జెట్ తయారుచేసారని తెలిపారు. సాక్షాత్తు అసెంబ్లీలోనే తుమ్మల నాగేశ్వరరావు రెండు లక్షల పైగా రుణమాఫీ చేయమని చెప్పడం హాస్యాస్పదమన్నారు. అబద్ధపు హామీలతో సర్కారును ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, రేవంత్ రెడ్డికి రాబోయే రోజుల్లో ప్రజలు బుద్ధి చెప్పుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బీఆర్‌ఎస్ నాయకులు కలీం, శ్రీకాంత్, నక్క శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పాబృందావనంలోని రాములోరి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే..

ఆల్విన్ కాలని డివిజన్, శిల్పా బృందావనం కాలనీలోని, శ్రీ కోదండ రాములవారి ఆలయ బ్రహ్మో త్సవ వేడుకల్లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొ న్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయ కులు ఎర్రబెల్లి సతీష్ రావు ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే పాల్గొని, స్వామి వారికి దర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ రంగారావు, ఆలయ అధ్యక్షులు వెరపనేని సుబ్రమణ్యం, ఆలయ కమిటీ సభ్యులు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



భగత్‌సింగ్ ఆదర్శప్రాయుడు



- విప్లవ వీరుల ఆశయాలు, నేటితరం యువతకు ఆదర్శం : సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

భగత్‌సింగ్, రాజ్ గురు సుఖ్ దేవ్ విప్లవ వీరుల ఆశయాలను, నేటితరం యువతకు ఆదర్శం అని కూకట్‌పల్లి మండల సీపీఐ(ఎం) నాయకులు అన్నారు. ఆదివారం సీపీఐ(ఎం) కూకట్ పల్లి మండల కమిటీ షహీద్ భగత్ సింగ్, రాజ గురు సుఖదేవ్, విప్లవ వీరుల 94వ వర్ధంతి సందర్భంగా విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాఘ వేంద్రనగర్ కాలనీ శాఖ, రాఘవేంద్ర బస్తీలో, హైదర్ నగర్ శాఖ, హెచ్‌ఎంటి హీల్స్ ఎల్.డి ప్రసాద్ ఇంటి వద్ద, భవ న నిర్మాణ కార్మిక సంఘం కూకట్‌పల్లి అడ్డా, కూకట్ పల్లి బస్టాండ్, ఎల్లమ్మ బండ హనుమాన్ నగర్ శాఖలా ఆధ్వర్యంలో, ఎల్లమ్మ బండ చౌరస్తాలో పలుచోట్ల నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి మండల కార్యదర్శి ఎం.శంకర్, కూకట్‌పల్లి శాఖ కార్య దర్శి పి.ధర్మారావు, రాఘవేంద్ర నగర్ శాఖ కార్యదర్శి ఎం.నరసింహ, హైదర్ నగర్ శాఖ కార్యదర్శి వీ.శివ ప్రసాద్, కేపీహెచ్‌బీ శాఖ కార్యదర్శి కే.కృష్ణ నాయక్, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు భీమేశ్వరరావు, తది తరులు మాట్లాడుతూ, భగత్ సింగ్, రాజ్ గురు సుఖ్ దేవ్ పేర్లు, తలుచుకోగానే భారతీయులలో సాహస స్ఫూర్తి కదలాడుతుందని తెలిపారు. ఒక దశలోనైతే భగత్ సింగ్ పేరు ప్రఖ్యాతలు ,మహాత్మా గాంధీని కూడా మించి పోయాయన్నారు. ఎప్పటికీ మరుపురాని స్ఫూర్తిగా నిలిచిపోవడం భగత్ సింగ్ ప్రత్యేకత అని అన్నారు. 1906 సెప్టెంబర్ 2న జన్మించిన భగత్ సింగ్, జీవిత రాజకీయ విశిష్టతలను విశ్లే శిస్తూ, అనేక పుస్తకాలు ఎంతోమంది మేధావులు రాశారని తెలిపారు. ఈ కార్యక మంలో శాంతమ్మ, అలివేల కురుమూర్తి, శేఖర్, కుమారి, రమేష్, విజయ్, భారతమ్మ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

యువత భగత్ సింగ్ అడుగుజాడల్లో నడవాలి..

జగద్గిరిగుట్ట: యువత భగత్ సింగ్ అడుగుజాడల్లో నడవాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ తంగ లక్ష్మారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం భరత మాత ముద్దుబిడ్డ సర్దార్ షహీద్ భగత్ సింగ్ 94 వ వర్ధంతి సభ చింతల్ డివిజన్ పరిధి భగత్ సింగ్ నగర్‌లో నిర్వహించారు. ఆయనతో పాటు బస్తీ నాయకులు, ప్రజలు భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్,రాజ్ గురు, సుఖదేవ్‌లు దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించడం మహెూన్నత ఆశయంగా గొప్ప త్యాగ మూర్తులని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీనాథ్, ప్రధాన కార్యదర్శి బి.సత్యం, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు జెల్లా వెంకటేష్, స్థానిక నాయకులు వై.జనార్ధన్ రెడ్డి, డి.కృష్ణమూర్తి, మజ్జారిశ్రీనివాస్, భాస్కరరావు, ఏ.రాజిరెడ్డి, ప్రేమ్ కుమార్, బీసు వెంకటేశ్ గౌడ్, కె.శ్యామల, విద్యాదేవి తదితరులు పాల్గొన్నారు.



భగత్ సింగ్ నేటితరం యువతకు స్ఫూర్తిదాయకం..

బాలానగర్ : భారత స్వాతంత్ర్యం కోసం భగత్ సింగ్ చేసిన ప్రాణత్యాగం నేటితరం యువతకు స్ఫూర్తి దాయకమని డీవైఎఫ్ఐ బాలానగర్ మండల కార్యదర్శి చైతన్య పేర్కొన్నారు. ఆదివారం భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య, కార్మిక సంఘం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు భగత్ సింగ్ కు పూలమాలలు, పువ్వులు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం 'భగత్ సింగ్ అమర్ రహే' అంటూ నినాదాలు ఇచ్చారు. భారత స్వాతంత్రం కోసం భగత్ సింగ్, సుఖదేవ్, రాజా గురు ముగ్గురూ నవ్వుతూ ఉరికంబం ఎక్కిన గొప్ప స్వాతంత్ర సమర యోధులు అన్నారు. వారి మరణం భారత దేశ ప్రజల్లో ఎంతో స్వాతంత్ర స్ఫూర్తి, చైతన్యం నింపిందన్నారు. ప్రాథమిక పాఠశాల పాఠ్యపుస్తకాలలో స్ఫూర్తి నింపే భగత్ సింగ్ పాఠ్యాంశం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు జగన్, మురళి, మహిళలు, తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.



అన్ని రంగాల్లోనూ మహిళలు రాణించాలి



నిజాంబాద్ ఎమ్మెల్యే శ్రీ ధన్ పాల్ సూర్య నారాయణ గుప్తా

నవతెలంగాణ-నిజాంపేట్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నిజామాబాద్ ఎమ్మెల్యే శ్రీధన్ పాల్ సూర్యనారాయణ గుప్త ఆకాంక్షించారు. ఆదివారం ఆయన మేడ్చల్ జిల్లా నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సప్తపది ఫంక్షన్ హాల్‌లో ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో నేటికీ మహిళలు లింగ వివక్ష ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వశక్తితో అన్ని రంగాలలో మహిళలు రాణించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజు యాదవ్, కల్వకుర్తి సీనియర్ బీఆర్‌ఎస్ నాయకులు ఉప్పాల వెంకటేష్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ రాష్ట్ర అధ్యక్షులు శిల్ప వందనపు, అధ్యక్షులు శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కట్ట రవి, మేడ్చల్ జిల్లా వైశ్య మహిళా విభాగం ప్రెసిడెంట్ కవిత, ఐ.వి. ఎఫ్ ప్రెసిడెంట్ నవీన్ కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

'బాటసారుల దాహార్తి తీర్చడం హర్షణీయం'



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మండు వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చడానికి దాతలు,స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం హర్షణీయమని సంఘ సేవకులు నల్ల జై శంకర్ గౌడ్, ఆకుల సతీష్‌లు అన్నారు. ఈ మేరకు ఆదివారం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి రాజీవ్ గృహకల్ప కాలనీ చెందిన రానా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మధ్య కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవసేవే మాధవ సేవ అన్న సంకల్పంతో ఉన్నదాంట్లో కొంత ఖర్చు పెట్టి వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేసిన దాతలు అభినందించారు.ఈ విధంగా ఆర్థిక స్థోమత అంతంత మాత్రమే ఉన్న రానా వారి మిత్రమండలి చందాలు వేసుకొని ప్రజలకి రోజు త్రాగునీరు, మజ్జిగ అందించడానికి ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రజలందరూ సద్వినియో గం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అరుణ్ రావు, గృహకల్ప కాలనీ వాసులు పాల్గొన్నారు.

శ్రీ కోటగుట్ట పెద్దమ్మ తల్లి 14వ వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని చింతల్ చెరువు లాల్ సాబ్ గూడలో గల శ్రీశ్రీ పెద్దమ్మ తల్లి 14వ వార్షికోత్సవం వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం వేదపండితుల ఆశీర్వచనల మధ్య అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి అనుగ్రహంతో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు అంజయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, కోశాధికారి లక్ష్మణ్, సభ్యులు యాదయ్య, బాల చిత్తారి, నగేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం'



నవతెలంగాణ-నిజాంపేట్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హనుమంత రెడ్డి అన్నారు. ఆదివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రెండవ వార్డ్ జీపీఆర్ లేఅవుట్‌లో మౌలిక సదుపాయాలు లేని కారణంగా ఇబ్బందులు పడుతున్న వారు హనుమంత్ రెడ్డిని కలిసి సమస్యలు వివరించారు. బస్తీలో ప్రధానంగా సీసీ రోడ్డు, డ్రయినేజీ లైన్స్ వేయించాలని బస్తీ వాసులు కోరారు.హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌తో మాట్లాడి బస్తీలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు వీరబాబు గౌడ్, మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొలను రాజశేఖర్ రెడ్డి, కొలను జీవన్ రెడ్డి, అంబరెడ్డి, రాకేష్ రెడ్డి, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నూతన పంచాంగం ఆవిష్కరణ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

శ్రీ వేద దార్మిక సేవ సమితి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి శాంతి నగర్‌లోని భారత వికాస పరిషత్‌లో, భాగవత సప్తాహంలో నూతన పంచాంగం ఆవిష్క రించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజాదేవి, మాజీ చైర్మెన్ సీహెచ్ హనుమంత్ రావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంపన్ముడు ఒబై వెంకటాచార్యులుచే గణించిన, నూతన సంవత్సర శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగంన ఆవిష్కరణ జరిగింది. అందులో భక్తులందరికి పంచా ంగాలు ఉచితంగా పంపిణి చేశారు. ఈ కార్యక్రమం సమితి రాష్ట్ర అధ్యక్షులు కొండపాక కృష్ణమాచార్య ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అస్తవధాని కులాశేఖరాచార్యులు, సముద్రాల వేణు గోపాల చార్యులు, సాధన నర్సింహ చార్యులు, కృష్ణమాచార్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-బాలానగర్

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్ నగరిగారి ప్రీతం జన్మదినాన్ని పురస్కరించుకుని బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్న కుమార్ ఆదివారం వారి నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జల్లా శివ, నాగేష్ సతీష్, చందు, నరేష్, శ్రీకాంత్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

'నిత్య వ్యాయామంతో మానసిక ప్రశాంతత'



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నిత్య వ్యాయామంతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత చేకూరుతాయని బీఆర్‌ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. 132 - జీడిమెట్ల డివిజన్ పరిధి రుక్మిణీ ఎస్టేట్ నందు గల పార్క్ లో రూ.11 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన "ఓపెన్ జిమ్" ను ఆదివారం ఎమ్మెల్యే పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆహ్లాదకర వాతావరణంలో కాలనీ వాసులకు ఉపయోగపడేలా ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల డివిజన్ సమన్వయ కమిటీ సభ్యులు, రుక్మిణీ ఎస్టేట్స్ అధ్యక్షులు శేఖర్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షులు నర్సింహులు, ప్రేమానందం, కోశాధికారి ప్రదీప్, సభ్యులు శంకర్ రెడ్డి, ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.



మూసాపేట్ యాదవ్ బస్తీలోని శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామి దేవాలయం కమిటీ ఆహ్వానం మేరకు.. శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామి వారి కళ్యానోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు ఎల్లేష్ యాదవ్, కాస నర్సింహ యాదవ్‌లతో కలిసి సప్పిడి భాస్కర్, మల్లేష్ , కుమార్, బాబు , ఎండీ నయీమ్, నవాజ్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో మూసాపేట్ రజక సంఘం ఆధ్వర్యంలో కైతలాపూర్ రోడ్‌లోని దోభి ఘాట్ లోని శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవి బోనాల జాతరలి రజక సంఘం, దేవాలయం కమిటీ ఆహ్వానం మేరక శ్రీ శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి బోనాల ఉత్సవంలో ఆలయ కమిటీ చైర్మెన్ నోముల సుందర్‌తో కలిసి సప్పిడి భాస్కర్, వెంకట్ నోముల శంకర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ-కూకట్‌పల్లి

'డ్రయినేజీ, రోడ్డు సమస్యలు పరిష్కరించండి'



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

డ్రయినేజీ, రోడ్డు సమస్యలు పరిష్కరించాలని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి అన్నారు. 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వినాయక్ నగర్‌లో వాసులు డ్రయినేజీ, రోడ్డు సమస్యతో ఇబ్బంది పడుతున్నామని భరత్ సింహ రెడ్డికి తేలియజేశారు. కాలనీ వాసులతో కలిసి ఆయన కాలనీలో పర్యటించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. వెంటనే పరిష్కరించాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో వీరారెడ్డి, నార్లకంటి దుర్గయ్య, అభిద్, వనజ, లావణ్య విజయ్ కుమార్, టైలర్ శేఖర్, ప్రకాష్, శివ ఉన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలని విద్యార్థినుల ఆందోళన



నవతెలంగాణ-ఓయూ

ఓయూ అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆదివారం రాత్రి ఓయూ సెంటినరీ హాస్టల్ విద్యార్థినిలు ఓయూ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. తమకు కనీస వసతులు కల్పించపోవటం సమంజసం కాదన్నారు. నీటి సౌకర్యం లేదని, క్వాలిటీ ఆహారం, వసతి గృహంలో సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మెస్ బిల్స్ కూడా అధికంగా వసూళ్లు చేస్తున్నారని వెల్లడించారు. మరోవైపు వసతిగృహానికి వెళ్లే ప్రధాన రహదారి వెంట కనీసం వీధిలైట్లు లేవని అధికారులకు చెప్పిన కూడా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఓయూ చీఫ్ గార్డెన్ డా. శ్రీనివాస్, లేడీస్ హాస్టల్ డైరెక్టర్ ప్రొ. కళ్యాణ లక్ష్మి విద్యార్థుల వద్దకు చేరుకుని నిరసనను విరమించుకోమని, సమస్యలు పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. చీఫ్ వార్డెన్ హామీ మేరకు విద్యార్థినులు ఆందోళన విరమించారు. వారు విద్యార్థినుల వెంట వెళ్లి వసథిగృహాన్ని పరిశీలించారు.

బోరబండలో 22వ రోజు సేహారి



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

బోరబండ డివిజన్‌లోని ఎస్ఆర్ఆర్ పురం సైట్ 1 కమాన్ వద్ద రంజాన్ సందర్భంగా 22వ రోజు ఆదివారం సుమారు 600 మందికి, ఉదయం 5 గంటల నుంచి 6 గంటల వరకు సేహరి భోజనాలను, బోరబండ కార్పొరేటర్ మాజీ డిప్యూటీ మేయర్ బాబా పసివుద్దీన్ తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. హిందూ సోదరులు పాల్గొని వంట చేయటం నుంచి, వడ్డించేవరకు సేవలు అందించడం బోరబండలో మతసామరస్యానికి నిదర్శనమని, అన్ని మతాలవారు కలిసిమెలిసి ఉంటూ, తనకు అండగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు.

భగత్ సింగ్ స్ఫూర్తిని కొనసాగిద్దాం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా బోరబండ డివిజన్ సైట్ 3 లోని హైటెక్ టీ పాయింట్ హోటల్ వద్ద జూబ్లీహిల్స్ జోన్ డీవైఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. 1931 మార్చి 23వ తేదీన బ్రిటిష్ వారు భారత దేశ సంపూర్ణ స్వేచ్ఛ స్వతంత్రం కోసం పోరాడుతున్న భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లను తమకు అడ్డువస్తున్నారనే నెపంతో దారుణంగా ఉరి తీశారని గుర్తుచేశారు. ఉరి తాడును ముద్దాడి, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రాణాలు అర్పించిన ధైర్యవంతులుగా చరిత్రలో నిలిచారు. వారు దేశం కోసం ముఖ్యంగా యువత స్వేచ్ఛ స్వాతంత్రాల కోసం చనిపోయి 94 ఏండ్లు దాటిన, భారతదేశ యువత మీద చెరిగిపోని ముద్ర వేశారని, వారి యొక్క జీవితమే యువతకు స్ఫూర్తి ఆదర్శమని, వారి ఆశయాలు కోసం అన్యాయాల మీద అక్రమాల మీద పోరాటం చేయాల్సిన ఆవశ్యకత నేటి తరం మీద ఉన్నదని పేర్కొన్నారు. మతం పేరు మీద, కులం పేరు మీద, దేవుళ్ళ పేరు మీద, దేశ యువతని ఐక్యంగా ఉండకుండా చేస్తూ రకరకాల పద్ధతుల్లో ఇప్పటి పాలకులు విడదీస్తున్నారని, అన్ని రాజకీయ పార్టీలు యువతను వాడుకొని వదిలి వేస్తున్నాయని, ఇంక్విలాబ్ జిందాబాద్ విప్లవం వర్ధిల్లాలని నినాదాలు చేస్తూ, భగత్ సింగ్ యువతలో స్వతంత్ర ఉద్యమాన్ని రగిలించారని, దేశం కోసం వీరమరణం పొందిన ఆత్మ త్యాగం చేసిన వారిలో ప్రథమంగా చెప్పుకుంటే ముందు వరుసలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవులే ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు టి సాయి శేషగిరిరావు, డీవైఎఫ్ఐ నాయకులు దాది మల్ల కృష్ణ, సునీల్, రాథోడ్, వెంకట్ రాజు, రాము, ఆనంద్, రాజేష్, సత్యనారాయణ, శీను తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-ఓయూ

భగత్ సింగ్, రాజా గురు, సుఖ్ దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల నుంచి లేడీస్ హాస్టల్ వరకు పీడీఎస్‌యూ, పీవైఎల్ సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం భగత్ సింగ్ రచనలను పాఠ్యాంశంలో చేర్చాలని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడమే నిజమైన దేశ భక్తి, హిందూ మతన్మోదాన్ని వ్యతిరేకించి కులం లేని మతం లేని సమాజం కోసం ఉద్యమిద్దామని విద్యార్థి యువజన సంఘాల నాయకులు విద్యార్థులను ఉద్దేశించి అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి అనిల్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేవీస్ ప్రదీప్, పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ ప్రెసిడెంట్ రాకేష్, కార్యదర్శి హరీష్, ఓయూ నాయకులు భరత్, స్పందన సతీష్, హరి కృష్ణ, దీక్షిత, భార్గవి విద్యార్థులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-ఓయూ

భారత జాతీయోద్యమ వీరులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఓయూ కమిటీ ఆధ్వర్యంలో కె.స్వాతి (ఓయూ అధ్యక్షులు) అధ్యక్షతన ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణంలో సాంస్కృతిక నివాళులు కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత జాతీయోద్యమ చరిత్రలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల త్యాగాలు అసమానమైనవి అని ప్రొ. కొండ.నాగేశ్వర్ అన్నారు. భగత్ సింగ్ అధ్యయనంలో అగ్రగామిగా ఉంటూ దేశ భవిష్యత్‌ను కలలు కన్నారు. అధికార మార్పిడి కాదు దేశంలో ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక సమానత్వం సాధించాలి అని పిలుపునిచ్చారని గుర్తు చేశారు. జార్జిరెడ్డి పీడీఎస్‌యూ నేతలు డా.ఎస్.నాగేశ్వర రావు, జార్జి రెడ్డి పీడీఎస్‌యూ గ్రేటర్ హైద్రాబాద్ అధ్యక్షులు ఎం.వెంకటేష్, ఎస్.అంజి, రుక్మత్ పాషా, రుక్మత్ పాషా, కోటేశ్వర్, సంతోష్, క్రాంతి, తిరుపతి, సాయికుమార్, నూతన, శ్రీను, అంజి పాల్గొన్నారు.



నవతెలంగాణ-ఓయూ

గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గం ఆదివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గం ఆధ్వర్యంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులైన మంద నవీన్ (ఓయూ) అధ్యక్షతన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్యులుగా పీడీఎస్‌యూ జాతీయ నాయకులు పి మహేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా.పొడపంగి నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్‌లు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లు కోరుకున్న సమసమాజ స్థాపన కోసం విద్యార్థులందరూ పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు సంతోష్, గౌతమ్, తీగల శ్యామ్, ఆసిఫ్, మౌనిక, రహీం, షబానా, సాయి, కిషోర్, రాజేష్, కిరణ్, సోమేష్, నరేష్ పాల్గొన్నారు.



నవతెలంగాణ-కంటోన్మెంట్

భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల 94వ వర్ధంతి కార్యక్రమం ఆదివారం స్వామి వివేకానంద వెల్ఫేర్ అస్సోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బోయిన్‌పల్లి ప్లేగ్రౌండ్ వద్ద వారి చిత్రపటాలను ఏర్పాటు చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా పాల్గొని పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం 23 ఏండ్ల వయస్సులోనే తమ ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లను ఆదర్శంగా తీసుకొని వారి ఆశయాలను నేటి యువత అనుసరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మద్ది భాస్కర్ రెడ్డి, మల్లేష్ యాదవ్, దాదా రావు, బి.కృష్ణ, ప్రకాష్ యాదవ్, ముత్యాలు, కరణ్ సింగ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-ఓయూ

ఓయూ కాంట్రాక్టు లైబ్రరీ ఉద్యోగి ఇస్లావత్ వెంకన్న (రాక్ ఆర్టిస్ట్) ఆధ్వర్యంలో భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతి సందర్భంగా వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇస్లావత్ వెంకన్న ఓయూ సరస్వతీ ఆలయం సమీపంలో రాళ్ళపై భగత్ సింగ్ పెయింటింగ్ వేసి వారికి ఆర్ట్‌తో నివాళులర్పించారు. వెంకన్న మాట్లాడుతూ.. భగత్ సింగ్ ధైర్యానికి ప్రతీక, దేశభక్తికి ప్రతిరూపం ధీరత్వానికి మరొక పేరు అన్నారు. నవ తరానికి ఒక స్ఫూర్తి, దోపిడికి అవకాశం లేని న్యాయ సమ్మతమైన సాంఘిక, ఆర్థిక, రాజకీయ, వ్యవస్థ కోసమే తాము విప్లవాన్ని ఆరాధిస్తున్నామని ఉక్కు పిడికిలితో బ్రిటిష్ వారికి సమాధానం చెప్పిన స్వతంత్ర యోధుడు అన్నారు. భగత్ సింగ్ తుది శ్వాస విడిచే దాక తెల్లదొరల గుండెల్లో నిదురించిన స్వతంత్ర వీరుడు అన్నారు. ఈ కార్యక్రమంలో ఓయూ పీజీ విద్యార్థులు, పీహెచ్డీ స్కాలర్స్, శ్రీనివాసరాజులు, రాజేందర్, బాలసుబ్రహ్మణ్యం, రవితేజ, గణేష్, భాస్కర్ పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం సీఎం ప్రత్యేక శ్రద్ధ



- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్
- శ్రీ గణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

నవతెలంగాణ-కంటోన్మెంట్

అభివృద్ధి కోసం సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. ఎండలు ముదురుతున్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం శ్రీ గణేష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం తాడ్ బండ్ క్రాస్ రోడ్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీగణేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవసేవే మాధవ సేవ అని ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలు పట్టాలని ఆయన కోరారు. అన్ని కులాలు, మతాల కన్నా మానవత్వం గొప్పదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి ఏడాది వేసవికాలంలో బాటసారిలా దాహార్తి తీర్చేందుకు శ్రీగణేష్ ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గం నలుమూలలా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా పెట్టుకుందని అందులో భాగంగానే ఈ వేసవిలో కూడా చలివేంద్రాలు ఏర్పాటు చేశారని అన్నారు. కంటోన్మెంటులోని ఇతర కాంగ్రెస్ నాయకులంతా తమ తమ వార్డుల్లో ప్రజల సౌకర్యార్థం చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుండడం సంతోషకరమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంటోన్మెంట్ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని చెప్పారు. అందులో భాగంగా రూ.9.4 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను మంజూరు, చేశారని తెలిపారు. ఆ నిధులకు తోడుగా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అదనంగా మరో రూ.5 కోట్ల నిధులు కేటాయించారని, వివరించారు. అలాగే ప్రభుత్వం తీసుకువచ్చిన రాజీవ్ యువ వికాస్ పథకాన్ని నియోజకవర్గంలోని నిరుద్యోగులు అంతా ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలే లక్ష్యంగా పనిచేయాలి





- కాంగ్రెస్ నేతలు

నవతెలంగాణ-బేగంపేట్

స్థానిక ఎన్నికలలో విజయం సాధించాలంటే ప్రజల సమస్యలను గుర్తించి, నేటి నుంచే పనిచేయాలని రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి డా. కోట నీలిమ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ దేశావ్యాప్తంగా పిలుపు నిచ్చిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఆదివారం గాంధీ భవన్‌లో సికింద్రాబాద్ పరిధిలోని ఐదు నియోజకవర్గాల నాయకుల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి డివిజన్‌లోనూ స్థానిక నాయకులు పాదయాత్ర చేపట్టాలన్నారు. ఏడాది మొత్తం ఈ కార్యక్రమం చేయాలన్నారు. జనవరి 26, 2026 వరకు నిరంతరాయంగా జరగాలన్నారు. డా. కోట నీలిమ మాట్లాడుతూ.. నాయకత్వ లక్షణాలు పెంచుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని అన్నారు. రాజ్యాంగానికి బీజేపీ తూట్లు పొడుస్తోందని విమర్శించారు. అదే రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పాటుపడుతున్నదని అన్నారు. ప్రతి డివిజన్‌లోనూ స్థానిక నాయకులు పాదయాత్ర చేపట్టాలన్నారు.

బీజేపీది స్వార్థ రాజకీయం.. కాంగ్రెస్‌ది సిద్ధాంత రాజకీయం



కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్

నవతెలంగాణ-కంటోన్మెంట్

గాంధీభవన్‌లో డీసీపీ ప్రెసిడెంట్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ అధ్యక్షతన ఆదివారం జై బాపు- జై భీమ్- జై సంవిధాన్ అభియాన్ డిస్ట్రిక్ట్ ప్రిపరేటరీ సమావే శం జరిగింది. ఈ సమావేశంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొని కార్య కర్త లకు దిశా నిర్దేశం చేశారు. బీజేపీది స్వార్థ రాజకీయాలని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం మానవత్వం, త్యాగం అని అన్నారు. దేశానికి స్వాతంత్రం తెచ్చింది మహాత్మా గాంధీ అని, దేశ ప్రజలందరూ స్వేచ్ఛ స్వతంత్రాలతో బతుకుతు న్నారంటే దేశానికి రాజ్యాంగం అందించిన డా. బీఆర్ అంబేద్కర్ కృషి అన్నారు. బీజేపీ కులము, మతము అని ద్వేషపూరిత రాజకీయాలు చేస్తోందని, ప్రతి గల్లీ లో ఇలాంటి ప్రచార చేస్తోందని ఆ పార్టీ మత్తులో పడకూడదని, ప్రజలు ఆ మత్తులో పడకుండా కాపాడుకోవాలని క్యాడర్‌కు హితవు పలికారు. కాంగ్రెస్ కులగణన, బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ ఇలాంటి చరిత్మకమైన నిర్ణయాలు తీసుకుంటుందని ఆ విజయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అప్పుడే పార్టీ బలోపేతం అవుతుందని విజయాలు సాధించగలమని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

నెం.1 శ్రీధర్ రావు తనయుడికి నెం.1 బహుమతి



నవతెలంగాణ-బంజారాహిల్స్

వాల్గో ఇన్‌ఫ్రా సీఎండీ నెంబర్ వన్ శ్రీధర్‌రావు తనయుడు అభిశ్రీ పుట్టినరోజునకి మినీ కూపర్ కారును బహుమతిగా అందజేశారు. జూబ్లీహిల్స్‌లో ఆదివారం రాత్రి దేశంలోని వివిధ పార్టీలకు చెందిన రాజకీయ ప్రముఖులు, వ్యాపారవేత్తలు, ఉన్నత అధికారులతో పాటు సినీ ప్రముఖులందరూ హాజరై ఈ పుట్టినరోజు వేడుకల్లో భాగస్వాములు అయ్యారు. ఈ వేడుకలకు శ్రీధర్ రావు రాజకీయ ప్రముఖులు యుటి ఖదీర్, గౌరవనీయ స్పీకర్, దొంతు మాధవరెడ్డి నర్సంపేట ఎమ్మెల్యే, నాయిని రాజేంద్రరెడ్డి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, అనిల్ రెడ్డి భువనగిరి ఎమ్మెల్యే, వీరేశం నకిరేకల్ ఎమ్మెల్యే, బీర్ల ఐలయ్య చీఫ్ విప్, బలరాం నాయక్ వరంగల్ ఎంపీ, నాగరాజు వర్ధన్నపేట ఎమ్మెల్యే, ఈటల రాజేందర్ ఎంపీ, యశస్విని రెడ్డి పాలకుర్తి ఎమ్మెల్యే, పాడి కౌశిక్ రెడ్డి హుజూరాబాద్ ఎమ్మెల్యే, చామల కిరణ్ భువనగిరి ఎంపీ, గాయత్రీ రవి రాజ్యసభ ఎంపీ, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, మెట్టు సాయి కిరణ్ మత్స్యకార బోర్డు చైర్మన్, దీపాలీ శుక్లా, డాక్టర్ మురళీ మనోహర్ ఫిల్మ్ ప్రొడ్యూసర్ చెన్నై, నిర్మల టిఎస్ఐఐసీ చైర్మన్, రోహన్ రెడ్డి హైదరాబాదు డీసీపీ ప్రెసిడెంట్, రామచంద్ర నాయక్ డోర్నకల్ ఎమ్మెల్యే, మదన్ మోహన్ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే, ఎ. మహేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యే బీజేపీ ఫ్లోర్ లీడర్, సురేంద్ర చెన్నై, వెంకట్ పులి జీనియస్ జంక్షన్ లిమిటెడ్, నరేంద్ర మున్నలూరి ఆర్టిస్ ఇంటర్నేషనల్, శ్రీకాంత్ ఎడ్వేన్ సాఫ్ట్, సంఘమిత్ర సీఈఓ, సీఎండీ గోజీల్ న్యూయార్క్, తహెర్ మహి చైర్మన్ శ్రీనిధి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ వంశలతో పాటు సినీ ప్రముఖులు రాజశేఖర్, జీవిత, కేథరిన్ థ్రెసా, లహరి శేరీ వంటి వారందరికి రెడ్ కార్‌పెట్‌టో ఆహ్వానం పలికారు.

మీడియా, పోలీసుల మధ్య ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్



- మ్యాచ్‌ను ప్రారంభించిన నర్మదా మల్లికార్జున్

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ మీడియా, బోయిన్‌పల్లి పోలీస్ టీం జట్ల మధ్య ఆదివారం ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ జరిగింది. న్యూ బోయిన్‌పల్లి మైదానంలో జరిగిన ఈ క్రికెట్ మ్యాచ్‌ను కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద, కంటోన్మెంట్ స్పోర్ట్స్ అసోసియేషన్ చైర్మెన్ జంపన ప్రతాప్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బానుక మల్లికార్జున్‌లు ప్రారంభించారు. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ జట్టు 15 ఓవర్లలో 96 పరుగులు చేసింది. 97 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన మీడియా జట్టు 86 పరుగులు చేసి రన్నర్‌గా మిగిలింది. అంతకుముందు నామినేటెడ్ సభ్యురాలు నర్మదా మల్లికార్జున మాట్లాడుతూ.. నిత్యం పని ఒత్తిడిలో ఉండే పోలీసులు మీడియా సభ్యులు అందరూ ఒకే చోట చేరి ఉల్లాసంగా ఆడడం సంతోషకర మని తెలిపారు. పోలీసుల జట్టులో సీఐ లక్ష్మీనారాయణ రెడ్డి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలాగే బానుక నర్మద సైతం బ్యాటు పట్టి అందరిని ఆకట్టుకున్నారు.

మతం పేరుతో నిధులు వృథా ఎందుకు?



- కుళ్ళిన మాంసం కల్తీ నూనెతో ఇఫ్తార్ దేనికి సంకేతం
- ఆస్పత్రి పాలు చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉందా?
- మాజీ జస్టిస్ చంద్రకుమార్

నవతెలంగాణ-బంజారాహిల్స్

మతం పేరుతో కోట్ల నిధులు వృధా చేయడం ఎందుకానీ, కుళ్ళిన మాంసం, కల్తీ నూనెతో ఇఫ్తార్ దేనికి సంకేతమంటూ.. ప్రజలను ఆస్పత్రి పాలు చేయాలనే యోచనలో ప్రభుత్వ ఉందా అంటూ మాజీ జస్టిస్ చంద్రకుమార్ ప్రశ్నించారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సభ అధ్యక్షత వహించిన లూబ్న సరావత్‌తో కలిసి మాట్లాడారు. విందుల పేరుతో కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం చేయడం ఎంతవరకు సమంజసమాని, ఆ నిధులను విద్య కొరకు వినియోగించాలన్నారు. 25న జరిగే ఇఫ్తార్ విందు దరుసాలెం, గాంధీ భవన్, బీఆర్ఎస్, టీడీపీ, ఇతర పార్టీ కార్యాలయలల్లో నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్య, ఆరోగ్యంతో పాటు వివిధ రకాల ఉపాధి అవకాశాలను పెంపొందించడం కోసం నిధులు వెంటనే విడుదల చేయాలన్నారు. కోట్ల రూపాయల నిధులు విడుదకాకపోవడంతో విద్య పూర్తి చేయాలకా నిరుద్యోగులుగా మగ్గిపోతున్నారని పేర్కొన్నారు. హాస్టల్లో ఒక రాజుకు 7.8 పైసలు చొప్పున ఖర్చు చేస్తున్న ప్రభుత్వం పౌష్టిక ఆహారం ఇవ్వకపోవడం ఒకేత్తేతే వారి ఆర్థిక సమానత్వంలో భాగస్వామ్యం చేయకపోవడం వల్ల వెనకబడి పోతున్నరాని తెలిపారు. ప్రభుత్వం పునరాలోచించాలి ఇఫ్తార్ విందు పట్ల వారి అభిప్రాయాన్ని తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైమద్ భాష, డి నాయక్, సైరభాను, సయ్యద్ రఫి, షోభ్ర బేగం, కుర్షియ తబస్సు, మక్బూల్ హేమద్ మాతిన్, షేక్ షాహిద బేగం, స్నేహ రెడ్డి, ఐయోష, అబ్దుల్ జాబార్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంఎస్ విద్యా విధానం భేష్



- ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ. బాలకిష్ట రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

ఆంధ్రమహిళ సభ విద్యా విధానం భేష్ అని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొ.వి.బాల కిష్టరెడ్డి అన్నారు. ఆంధ్రమహిళ సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఫర్ ఉమెన్ కళాశాల యానివల్ అండ్ స్పోర్ట్స్ డే 2025లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దుర్గాబాయ్ స్ఫూర్తితో అందిస్తున్న విద్యా పరమైన సేవాలు ఎనలేని అన్నారు. అనంతరం ఆయన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గౌరవ అతిథులుగా డీడీఎంఎస్ అధ్యక్షురాలు ఉషా కంద, డైరెక్టర్ ఆఫ్ అకౌంట్స్, పోస్ట్ తెలంగాణ సర్కిల్ సాయి పల్లవి, పాల్గొని మాట్లాడారు. వారు విద్యార్థులకు డిజిటల్ టెక్నాలజీ, సాంకేతిక నైపుణ్యాల ప్రాముఖ్యత గురించి తెలియజేస్తూ, 'ఎర్న్ వైల్ యూ లెర్న్' సూత్రాన్ని అవలంబించడం ద్వారా ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించవచ్చన్నారు. విద్యార్థులు సవాళ్లను స్వీకరించడం, ధైర్యం, సహనాన్ని పెంపొందించడం, అలాగే స్వీయాభివృద్ధిపై దృష్టి కేంద్రీకరించడం చాలా అవసరమని సూచించారు. ముఖ్యంగా ఉషా కంద విద్యార్థులు తాజా సాంకేతిక అభివృద్ధిని తెలుసుకుంటూ, భవిష్యత్తులో విశిష్టతను సాధించాలని ప్రోత్సహించారు. అధికారులు విద్యా, సాంస్కృతిక, క్రీడా పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ 2024-2025 విద్యా సంవత్సరంలో నిర్వహించిన ముఖ్యమైన కార్యక్రమాలు విధానాలపై సంపూర్ణ నివేదికను సమర్పించారు. కార్యక్రమంలో చైర్మెన్ అండ్ రిటైర్డ్ ఐఏఎస్ డి. చక్రపాణి, కార్యదర్శి డాక్టర్ పి. రాజని, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. కరుణా దేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వసుంధర, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రమీల, మ్యాగజైన్ కమిటీ కన్వీనర్ డాక్టర్ రాజలక్ష్మి, స్టూడెంట్ అడ్వైజర్ కన్వీనర్ పి. సంధ్యారాణి, స్టూడెంట్ అడ్వైజర్స్ సభ్యులు హేమ బిందు, రమ్య శ్రీ, దీపిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా భగత్ సింగ్ విగ్రహానికి సీఐటీయూ గోషామ హల్ జోన్ ఆద్వర్యంలో నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు.

నవతెలంగాణ-ధూల్‌పేట్

లంగ్ క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించాలి



- యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా.జి. స్. రావు
- శ్వాస కోశ క్యాన్సర్‌లపై అంతర్జాతీయ సదస్సు, లైవ్-వర్క్‌షాప్

నవతెలంగాణ-బేగంపేట్

లంగ్ క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించాలని డా.జి. స్. రావు అన్నారు. యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్, హైటెక్ సిటీ ఆధ్వర్యంలో (ఈబీయూఎస్) ఇబస్ (ఎండో బ్రాంకియల్ అల్ట్రాసౌండ్) అండ్ లంగ్ క్యాన్సర్‌లపై ఏర్పాటయిన అంతర్జాతీయ శిక్షణ సదస్సు, లైవ్ వర్క్ షాప్ ఆదివారం హైటెక్ సిటీ యశోద హాస్పిటల్స్‌లో ప్రారంభమైంది. యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డా.జి. స్. రావు ముఖ్య అతిథిగా పాల్గొని అంతర్జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ అత్యాధునిక లంగ్ క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ అండ్ చికిత్స ప్రక్రియలకు సంబంధించి దేశంలోని ప్రధాన పల్మనాలజిస్ట్ (శ్వాసకోశవ్యాధుల నిపుణుల)కు ఉన్నతస్థాయి శిక్షణ ఇచ్చేందుకుగాను 'ఇబస్ - మాస్టర్ క్లాస్' పేరిట యశోద హాస్పిటల్స్-హైటెక్ సిటీలోని ఇంట్రవెన్షనల్ పల్మనాలజిస్ట్ విభాగం దీనిని ఏర్పాటు చేసింది. లంగ్ క్యాన్సర్‌ను తొలి దశలోనే గుర్తించి, నిర్ధారించే అద్వితీయ చికిత్సగా అంతర్జాతీయంగా ఎంతో గుర్తింపు పొందుతున్న "ఇబస్" ఈ చికిత్సా ప్రక్రియ మనదేశంలోని అతికొద్ది అత్యాధునిక వైద్యకేంద్రాలలో మాత్రమే అందుబాటులోకి వచ్చింది. ఎండో బ్రాంకియల్ అల్ట్రాసౌండ్ (ఇబస్)కి సంబంధించి మనదేశంలో అగ్రగామిగా ఉన్న యశోద హాస్పిటల్స్ దేశవ్యాప్తంగా ఉన్న పల్మోనాలజిస్టులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం దృష్ట్యా అంతర్జాతీయ ప్రముఖ పల్మనాలజిస్టులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ శిక్షణా కార్యక్రమంలో పల్మనాలజిస్టులు వినూత్న చికిత్సా ప్రక్రియ అయిన ఇబస్ గూర్చి సమగ్రంగా తెలుసుకోవటమే కాకుండా లంగ్ క్యాన్సర్ చికిత్సలో అధునాతన చికిత్సా విదానాలు అమలుచేయటంలో అనుభవం పొందుతారని డా.జి. ఎస్. రావు తెలిపారు. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్-హైటెక్ సిటీ, సీనియర్ పల్మనాలజీ వైద్య నిపుణులు డా. వి. నాగార్జున మాటూరు మాట్లాడుతూ.. మన దేశంలో పురుషుల మరణాలకు కారణమవుతున్న కాన్సర్లలో ఊపిరితిత్తుల కాన్సర్ రెండో స్థానంలో ఉంది. దేశంలో ఏటా నమోదయ్యే కాన్సర్ కేసులలో 7 శాతం కేసులకు, కాన్సర్ మరణాలలో 10 శాతానికి కారణమవుతున్నది. శ్వాసకోశాల కాన్సర్లే. జనాభాలోని ప్రతీ లక్షమందిలో సుమారు 30 మంది ఈ వ్యాధి బారి పడుతున్నట్టు అంచనా శ్వాసకోశాలకు సంబంధించిన వ్యాధులు, ప్రత్యేకించి కాన్సర్లు - ప్రమాదకరమైన ఇన్ఫెక్షన్లను నిర్ధారించే పరీక్షలు కష్టతరంగా, వ్యాధిగ్రస్తులకు తీవ్ర అసౌకర్యంగా ఉంటూ వచ్చాయి. ఇటువంటి తీవ్రమైన, ప్రాణాంతకమైన వ్యాధులను వీలైనంత వేగంగా, గుర్తించేందుకు ఎండో బ్రాంఖియల్ అల్ట్రాసౌండ్ 'ఇబస్' తో పరిష్కారం లభిస్తుంది. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా 500 మందికి పైగా పల్మోనాలజిస్టులు హాజరయ్యారు. దేశవ్యాప్తంగా ఉన్న ఐదు వందలమందికి పైగా అధ్యాపకులు, అంతర్జాతీయ నిపుణులు కూడా ఈ కార్యక్రమంలో కీలక ఉపన్యాసాలు ఇచ్చారు.

11

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

హైదరాబాద్
HMDA

సోమవారం | మార్చి 24, 2025 | www.navatelangana.com

వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం

- జిమ్ ప్రారంభోత్సవంలో సినీ నటుడు నరేష్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రతి రోజూ వ్యాయామం చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం మన సొంతమని సినీ నటుడు నరేష్ అన్నారు. నానక్‌రామ్ గూడలో గోల్డ్ అండ్ జిమ్ కొత్త శాఖను నరేష్ ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. చురుకైన జీవనశైలికి జిమ్ ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. ప్రపంచ స్థాయి ఫిట్‌నెస్ శిక్షణతో గోల్డ్ అండ్ జిమ్ నిర్వహించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఫిట్‌నెస్ తమ జీవితంలో ఒక ముఖ్యమైన భాగం అనీ, ఉత్తమ ప్రమాణాలు, సౌకర్యాలతో ఫిట్‌నెస్ ప్రేమికులకు గోల్డ్ అండ్ జిమ్ సేవలను అందిస్తుందని పేర్కొన్నారు. జిమ్ నిర్వాహకులు మాధన్ మోహన్ రాజు, కార్తీక్ పేనాని, చందు, అనిల్ వర్క్ మేనేజింగ్ డైరెక్టర్లు మాట్లాడారు. నరేష్ తమ జిమ్ ప్రారంభించడం ఎంతో గౌరవంగా ఉందన్నారు. గోల్డ్ అండ్ జిమ్ 1965లో స్థాపించబడిందని తెలిపారు. ఇది ప్రపంచ ప్రఖ్యాత ఫిట్‌నెస్ బ్రాండ్ అనీ, 30కి పైగా దేశాల్లో ఉందని తెలిపారు. ఉత్తమమైన శిక్షణ, అత్యాధునిక



పరికరాలతో తమ జిమ్ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. ఆరోగ్యకరమైన జీవితాలను గడపడానికి లక్షలాది మందిని ప్రేరేపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిట్‌నెస్ ఔత్సాహికులు, జిమ్ నిపుణులు పాల్గొన్నారు.

ఇండియా యూత్ ఐకాన్
భగత్ సింగ్, రాజ్ గురు సుఖ్ దేవ్..



- భగత్ సింగ్ స్ఫూర్తితో యువత ముందుకు
- డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్
- స్ఫూర్తితో అన్యాయాలు, అవినీతి, అక్రమాలు, దోపిడీపై పోరాడాలి
- డీవైఎఫ్ఐ రాష్ట్ర మాజీ నాయకులు ఎండీ. అబ్బాస్ పిలుపు

నవతెలంగాణ - ధూల్ పేట్

ఇండియా యూత్ ఐకాన్ భగత్ సింగ్, రాజ్ గురు సుఖ్ దేవ్ అని ఆయన స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా డీవైఎఫ్ఐ హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి సభ చారిత్రక చార్మినార్ వద్ద ఘనంగా నిర్వహించారు. డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, డీవైఎఫ్ఐ రాష్ట్ర మాజీ నాయకులు ఎండీ. అబ్బాస్ , స్థానిక నాయకులతో కలిసి ఆయన చిత్ర పటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ విముక్తి కోసం సామ్రాజ్యవాద కసాయితనాన్ని సవాల్చేసి, మృత్యువును ముద్దాడిన విప్లవకారులు భగత్సింగ్, రాజగురు, సుఖ్ల లు అన్నారు. వారు చూపిన తెగువ, త్యాగం, ధైర్యం, సామ్రాజ్యవాద వ్యతిరేకత నేటి మన దేశ విద్యార్థి, యువజన ప్రజలందరి హృదయాలలో చెరగని ముద్రను వేసిందన్నారు. వారు వెదజల్లిన త్యాగాల విప్లవ పరిమళం నేటికీ స్ఫూర్తినిస్తూనే ఉందన్నారు. ప్రస్తుత బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటినుండి విద్యలో మతోన్మాదాన్ని కాషాయకరణాన్ని జపించే ప్రయత్నం చేస్తుందన్నారు. అందులో భాగంగా నూతన విద్యా విధానం 20-20 తీసుకువచ్చి పూర్తిగా ప్రాథమిక విద్యను పేద మధ్య తరగతి విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్ర బీజేపీ ప్రభుత్వం చేస్తుందన్నారు. పాఠ్యపుస్తకాలలో స్వాతంత్రం కోసం పోరాడిన మహనీయుల చరిత్రను తీసివేస్తూ ఈ దేశ స్వాతంత్ర ఉద్యమానికి సంబంధం లేని వారి చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్పించే ప్రయత్నం చేస్తుందనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరారు. అదేవిధంగా రోజురోజుకీ నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందని, ఈ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. భవిష్యత్తులో శాస్త్ర విద్యా విధానం కొరకై భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమిస్తామన్నారు. డీవైఎఫ్ఐ మాజీ రాష్ట్ర నాయకులు ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని, వాటిని అధిగమించి సేవా కార్యక్రమాలు క్రీడా రంగాల్లో ముందుండాలనీ వారు అన్నారు. విద్యార్థులను యువతులను చైతన్యపరచడంలో భగత్ సింగ్ స్ఫూర్తితో డీవైఎఫ్ఐ ముందుంటుందనీ ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలని వారు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు మంచి అలవాట్లు, లక్షణాలు నేర్చుకోవాలని, అన్యాయాలు, అవినీతి, అక్రమాలు, దోపిడీపై పోరాడాలనీ వారు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మాజీ నాయకులు విట్టల్, నాగేశ్వరరావు, అబ్దుల్ సత్తార్, మీనా, బాలు, డీవైఎఫ్ఐ జిల్లా శ్రీను, సాయినాథ్, నాగేష్ నాయకులు చరణ్ మురారి రాజ్ కుమార్ నవీన్ మహేష్ నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటి యువతకు భగత్‌సింగ్ ఆదర్శం





నవతెలంగాణ-నిజాంపేట

నేటి యువత భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ బాచుపల్లి కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. భగత్ సింగ్, రాజ గురు, సుఖదేవుల 94 వ వర్ధంతి సందర్భంగా సీపీఐ ఆధ్వర్యంలో ప్రగతి నగర్‌లోని భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి జోహర్లు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ బాచుపల్లి కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ షాహిద్ భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్‌లు దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారితో ధైర్యంగా పోరాడి అమరులయ్యారని గుర్తుచేసారు. నేటి యువత మత్తు పదార్థాలకు, జూదాలకు, గంజాయికి బానిసలుగా మారొద్దని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో సీపీఐ నాయకులు వాసు తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: బాలానగర్ మండల పరిధిలో శ్రీశ్రీ నగర్ సీపీఐ కార్యాలయంలో షాహిద్ భగత్ సింగ్ 94వ వర్ధంతి కార్యక్రమం కె.మనోహరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారి మరణం భారత దేశ ప్రజల్లో ఎంతో స్వాతంత్ర స్ఫూర్తి, చైతన్యం నింపిందన్నారు. నేటి యువత వారి త్యాగాలను తెలుసుకుని సామాజిక బాధ్యతతో, దేశభక్తితో మెలగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకోసం మేధావులు భగత్ సింగ్ చేసిన త్యాగాలను సమాజంలో చాటి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమానికి కూకట్ పల్లి సీపీఐ మండల కార్యదర్శి జి.కృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాహిద్ భగత్ సింగ్ ఆద ర్శాలను సీపీఐ కార్యకర్తలు ముందుకు తీసుకపోవాలని సూచించారు. అనంతరం వారు షాహిద్ భగత్ సింగ్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకురాలు జి. ఉమారాణి, శాఖ కార్యదర్శి పి.చంద్ర మ్మ, జి.రాములు, పెంటయ్య, నారాయణ తదితరులతో పాటు పలువురు అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి : షహీద్ దివస్ సందర్భంగా మూసా పేట్ డివిజన్, పీఆర్ నగర్, భగత్ సింగ్ సర్కిల్ వద్ద, భగత్ సింగ్ విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌లు దేశ స్వతంత్రం కోసం ఉరికొయ్యని ముద్దాడుతూ, ఆత్మర్పణం చేసిన తీరును బావి తారాలకు తెలియజేయాలన్నారు. ఈ దేశంలో ఉండాలంటే వందేమాతరం పాడాల్సిందే అనే నినాదం, ఇలాంటి మహనీయుల ప్రాణ త్యాగల నుండే వచ్చింది అనీ సూస్పష్టం చేశారు. ఆ మహనీయులు కలలు కన్న ఆశయాలను మన మంతా ముందుకు తీసుకొని వెళ్లాలని, యువతలో వారి ఆశయాలను అలవర్చుకొని తెలిపారు. ఈ దేశం కోసం ధర్మం కోసం ముందుండి పోరాడే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో

డివిజన్ అధ్యక్షులు ఎర్ర స్వామి రాష్ట్ర లీగల్ సెల్ సద్గుణ రెడ్డి, రాష్ట్ర ఓబీసి కార్యవర్గ సభ్యులు నాగరాజు, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు సతీష్ చారి, మాజీ అధ్యక్షులు పిట్ల మనోహర్ , సీనియర్ నాయకులు మల్లేష్ గౌడ్, రమేష్ నాయర్, బసవరాజు, భాస్కర్, శోభారాజన్, తదితరులు పాల్గొన్నారు.



రక్తం గడ్డలతో ముప్పు.. నడకతో నియంత్రణ



- కిమ్స్ హాస్పిటల్స్ సీఎండీ డాక్టర్ బి.భాస్కర్‌రావు
- ఆస్పత్రి ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులో నడక

నవతెలంగాణ-సిటీబ్యూరో

రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం వల్ల కలిగే ప్రాణాపాయం ముప్పును.. రోజూ కొద్దిపాటి నడకతో ఈ గడ్డలు రాకుండా జాగ్రత్తపడొచ్చని కిమ్స్ హాస్పిటల్స్ గ్రూప్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి.భాస్కర్ రావు అన్నారు. ఈ విషయంపై అవగాహన కల్పించేందుకు నెక్లెస్ రోడ్డులో జలవిహార్ వద్ద ఆదివారం ఉదయం 7 గంటల నుంచి కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో డీప్ వెయిన్ థ్రాంబోసిస్ (డీవీటీ)పై అవగాహన నడక నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ అమెరికా లాంటి పెద్ద దేశాల్లోనూ డీవీటీ బాధితులు ఎక్కువగా ఉన్నారన్నారు. అక్కడ ప్రతియేటా 9 లక్షల మంది దీని బారిన పడుతుండగా, వారిలో లక్ష మంది వరకు ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. నివారించదగ్గ మరణాలకు ఇదో ప్రధాన కారణంగా అక్కడి వైద్యులు గుర్తించారని తెలిపారు. ముందుగా గుర్తించడం, సమర్థమైన చికిత్స, ప్రతిరోజూ నడక.తోనే దీన్ని అధిగమించవచ్చు అని తెలిపారు. రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం వైద్యపరమైన సమస్య మాత్రమే కాదనీ, ఇప్పుడు ఇదో ప్రజారోగ్య సంక్షోభంగా మారిపోతోందన్నారు. అందరూ ఈ ముప్పును గుర్తించి ముందుగానే మేల్కోవాలి అని చెప్పారు. డీవీటీ అనేది సాధారణంగా పెద్ద వయస్సు వారిలో వస్తుంది, కానీ యువతకూ దీంతో ముప్పు పొంచి ఉంటుందని తెలిపారు. నిశ్చల జీవనశైలి, ఎక్కువసేపు విమాన ప్రయాణాలు చేయడం, ఏదైనా సమస్య వల్ల మంచానికే పరిమితం కావడం వల్ల డీవీటీ వచ్చే అవకాశం ఎక్కువ అని తెలిపారు. ప్రతిరోజూ తప్పనిసరిగా ఎంతో కొంత నడవాలనీ, సుదీర్ఘ ప్రయాణాలు చేసేటప్పుడు మధ్య మధ్యలో లేచి కాళ్లు కదిలించాలనీ, తగిన వ్యాయామాలు చేయాలని తెలిపారు. ఎక్కువసేపు ఒకేచోట కూర్చుని ఉండిపోకూడదని సూచించారు. అప్పటికే సమస్య వచ్చినవారు వైద్యులు సూచించిన సాక్సులు తప్పక ధరించడం, రక్తం పల్చబరిచే మందులు వాడటం ముఖ్యం అని తెలిపారు. కాథెటర్ డైరెక్టెడ్ థ్రాంబోలిసిస్ లాంటి అత్యాధునిక వైద్య సదుపాయాల ద్వారా గడ్డలను కరిగించవచ్చు, లేదా తీసేయచ్చు అని తెలిపారు. కేవలం కాళ్లలోనే కాదు, చేతులు, పొట్ట ప్రాంతంలోనూ డీవీటీ సంభవించే అవకాశం ఉంటుందనీ, ఇది వచ్చినప్పుడు ఊపిరి సరిగా అందకపోవడం, గుండెనొప్పి అనిపించడం కూడా ఉండొచ్చు అని తెలిపారు. 3 గంటలకు పైగా కారు, రైలు, విమానాల్లో ప్రయాణం చేసినవారికీ ఈ సమస్య రావచ్చు అనీ, అసలు ఇలాంటి కారణాలు ఏమీ లేకపోయినా వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఆస్పత్రి కన్సల్టెంట్ వాస్క్యులర్, ఎండోవాస్క్యులర్ సర్జన్, ఆ విభాగాధిపతి డాక్టర్ నరేంద్రనాథ్ మేడా, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ నాగేంద్ర పర్వతనేని, డాక్టర్ ఫ్రాన్సిస్ శ్రీధర్, డాక్టర్ జగదీష్ పాల్గొన్నారు.

జంటకవలలల్లా హెచ్ఐవీ, టీబీ

- ఒకటి ఉన్నవారికి మరొకటి వచ్చే ముప్పు
- రోగనిరోధక శక్తి తగ్గడమే రెండింటికీ కారణం
- ప్రపంచ టీబీ డే సందర్భంగా వైద్యుల హెచ్చరిక

నవతెలంగాణ-సిటీబ్యూరో

మన శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గినప్పుడు వ్యాధులు సంక్రమిస్తాయన్న విషయం తెలుసు. అయితే, అది మరీ బలహీనపడినప్పుడు అవకాశవాద ఇన్ఫెక్షన్లు వస్తాయి. వాటిలో ముఖ్యమైనది టీబీ. మరొకటి హెచ్ఐవీ. మామూలుగానే హెచ్ఐవీ వల్ల మన రోగనిరోధక శక్తి బాగా తగ్గుతుంది. దానివల్ల అది ఉండేవారిలో టీబీ వచ్చే ముప్పు కూడా ఎక్కువ. ఇటీవలి కాలంలో ఇలా రెండు రకాల సమస్యలు ఉన్నవారు ఎక్కువగా కనిపిస్తున్నారని వైద్య నిపుణులు వెల్లడిస్తున్నారు. నేడు ప్రపంచ టీబీ డే సందర్భంగా ఆస్టర్ ప్రైమ్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్టు డాక్టర్ కొల్లాబత్తుల రత్నబాబు, ఇటీవల అంతర్జాతీయ పత్రికల్లో వెల్లడించిన పలు పరిశోధనల వివరాలను వివరించారు. చాలా మందిలో హెచ్ఐవీ, టీబీ రెండూ ఉంటున్నాయి. అలా ఉండే వారికి రెండు రకాల సమస్యలకూ చికిత్స తప్పని సరిగా అందించాలి. లేటెంట్ టీబీ అనే రకం సాధారణంగా బయటపడదు. దానికి తగిన చికిత్స అందించకపోతే అది టీబీలో ముదిరిన దశకు చేరుకుంటుంది. అదే హెచ్ఐవీ ఉన్న వారికి ఇది కూడా సోకితే కొంతవరకు ప్రాణాంతకం అయ్యే ప్రమాదం ఉంటుంది. హెచ్ఐవీకి వాడే మందులను యాంటీరెట్రోవైరల్ మందులు అంటారు. ఇవి మన రోగనిరోధక శక్తిని కాపాడతాయి. తద్వారా హెచ్ఐవీ ఇన్ఫెక్షన్.. ఎయిడ్స్‌గా మారకుండా ఆపుతాయి. హెచ్ఐవీకి తోడు లేటెంట్ టీబీ ఉన్న రోగుల్లో ఈ రెండింటికీ మందులు వాడాల్సి ఉంటుంది. అప్పుడు లేటెంట్ టీబీ ముదిరే అవకాశం లేకుండా ఆగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా హెచ్ఐవీ, టీబీ ఉన్న వారిలో మరణాలు ఎక్కువగా సంభవిస్తున్నాయి. అమెరికాలో హెచ్ఐవీ మందులను విస్తతంగా వాడుతున్నా, గతంలో హెచ్ఐవీ ఉన్న వారికి టీబీ అంతగా కనిపించేది కాదు. కానీ, ఇప్పుడు అక్కడ కూడా ఈ రెండు వ్యాధులూ ఉన్న వారు ఎక్కువగానే ఉంటున్నారు. అందువల్ల హెచ్ఐవీ ఉన్న ప్రతి వారికీ టీబీ పరీక్ష కూడా తప్పనిసరిగా చేయాలి. ఒకవేళ లేటెంట్ టీబీ ఉన్నట్టు తేలితే అదనపు పరీక్షలు చేయాలి. దానివల్ల వ్యాధి నిర్ధారణ కచ్చితంగా ఉంటుంది.



20డబ్ల్యూతో అదనపు వెలుగు, స్లిమ్-అల్ట్రా-స్లీక్ అప్పీల్!

నవతెలంగాణ-సిటీబ్యూరో

అలంకరణ, సౌందర్యపరంగా ఉన్నతమైన లైటింగ్ కొత్త శ్రేణిని తీసుకొస్తూ, క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, రెండు కొత్త ఉత్పత్తులను ప్రారంభించడం ద్వారా తన బాటెన్ లైట్స్ పోర్ట్‌ఫోలియో శ్రేణిని విస్తరించింది. ఇన్ఫినియా 24 డబ్ల్యూ అనేది ప్రిస్టెక్ టెక్నాలజీతో ప్రత్యేకంగా రూపొందించబడిన ఇన్ డైరెక్ట్ లైటింగ్ ప్రోడక్ట్. ఇది సౌందర్య పరంగా ఆకర్షణీయమైన ఫినిష్‌తో ప్రకాశవంతమైన కాంతిని ఇస్తుంది. ఈ సందర్భంగా క్రాంప్టన్ గ్రీవ్స్ కన్స్యూమర్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, లైటింగ్ వైస్ ప్రెసిడెంట్ అండ్ బిజినెస్ హెడ్ షలీన్ నాయక్ మాట్లాడుతూ "లైటింగ్ కేవలం ప్రకాశాన్ని అందించడం కంటే ఇంటి అలంకరణ, డిజైన్‌లో కీలకమైన అంశంగా కూడా మారిందని క్రాంప్టన్‌లో మేం గుర్తించాం. ఇది వినియోగదారు అనుభవాన్ని, వ్యక్తిగత శైలిని మెరుగుపరుస్తుంది. ఇన్ఫినియా 24డబ్ల్యూ ఉన్నతమైన ప్రకాశాన్ని అందించడమే కాకుండా, గ్లేర్ రహిత, సౌకర్యవంతమైన వాతావరణాన్ని కూడా సష్టిస్తుంది" అని తెలిపారు.

రేపటి నుంచి ప్రముఖ నాటక సంస్థ రసరంజని వార్షికోత్సవం

నవతెలంగాణ-కల్చరల్

గత ముప్పై రెండేండ్లుగా తెలుగు రంగస్థల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్న రస రంజని నాటక సంస్థ ఈ నెల 25 నుంచి 27 వరకు మూడు రోజుల పాటు వార్షిక వేడుకలు నిర్వహించనుంది. ఇందుకు సంబంధించిన వివరాలను రసరంజని సంస్థ అధ్యక్షులు డాక్టర్ కె వి రమణ సహా సభ్యులతో కలిసి ఆయన నివాస కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో తెలిపారు. టికెట్‌పై తెలుగు నాటక ప్రదర్శన చేయలన్న ఆలోచనతో నాడు ప్రముఖులు ఐపీఎస్ అధికారి హెచ్‌జె దొర రంగస్థల ప్రముఖులు చాట్ల శ్రీరాములు గరిమెళ్ళ శ్రీరామ మూర్తి జెవి సోమయాజులు జెవి.రమణ మూర్తి దుగ్గిరాల సోమేస్వర రావు తదితరులు సారథ్యంలో రస రంజని ఆరంభించి పడిందని చెప్పారు. ముప్పై రెండు ఏండ్ల నుంచి ఎన్నోసాంఘీక పౌరాణిక చారిత్రాత్మక నాటకాలు ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలు పొందిన సంస్థ రస రంజని అని తెలిపారు. ఉపాధ్యక్షుడుగా నూతనం బాధ్యతలు చేపట్టిన ప్రముఖ నాటక రచయిత డి.విజయ భాస్కర్ మాట్లాడుతూ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రవీంద్ర భారతిలో మూడు రోజుల కార్యక్రమంలో 27 వ తేదీ న ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా యువతే దర్శకత్వం వహించి నటించిన నాటకం ధర్మో రక్షతి ప్రదర్శన తో పాటు 25 వ తేదీ నర్తన శాల పౌరాణిక నాటకం 26 వ తేదీన చైర్మన్ సాంఘీక నాటకం ప్రదర్శన వుంటుదని తెలిపారు. కార్యదర్శి కె.నటరాజ్ మాట్లాడుతూ మూడు రోజుల నాటక ప్రదర్శనకు అనుమతి ఉచితంగానే అని తెలిపారు. ఈ ఏడాది యువ రంగస్థల పురస్కారం అజయ్ మంకెనపల్లి బహుకరిస్తున్నట్టు చెప్పారు. ఏప్రిల్ నుంచి ఆడియన్స్ క్లబ్ ఏర్పాటు చేసి ప్రేక్షక సభ్యుల సంఖ్య పెంపుకు నిర్ణయించాం. అని ఇందుకు వివరాలు 9849094765లో సంస్థ ఉపాధ్యక్షుడు రామ కోటేశ్వర రావును సంప్రదించ వచ్చు అని తెలిపారు. సమావేశంలో అరుణ కుమార్ వెంపటి రాధాకృష్ణ నారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్ట్‌తో 'ఆశా'ల పోరాటాలు ఆపలేరు

- రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిది దొరల పాలన
- సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె.ఉన్నికృష్ణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

అక్రమ అరెస్టులతో ఆశాల పోరాటాన్ని ఆపలేరనీ, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దొరల పాలన సాగిస్తుందని సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కోశాధికారి కె. ఉన్నికృష్ణ తెలిపారు. ప్రభుత్వం ఆశాలకు పారితోషికాల స్థానంలో రూ.26 వేలను కనీస వేతనంగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. నేడు జరగబోయే ఆశా వర్కర్స్ యూనియన్ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విఫలం చేయడానికి పోలీసులు శనివారం ఉదయం నుంచే అరెస్టులు చేస్తున్నారని తెలిపారు. పోలీసులు ఆశాలను బెదిరిస్తున్నారని తెలిపారు. ఇందుకు నిరసనగా కుషాయిగూడలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఉన్ని కష్ణ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి కనీసంగా రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ప్రభు త్వ ఉద్యోగులుగా గుర్తించాలనీ, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలనీ, సామాజిక భద్ర త కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎన్నికల ముం దు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం ఎంత మొండిగా ఉంటే ఆశాలు అంతకన్నా మొండిగా వ్యవహరిస్తారనీ, పోరాటం మరింత పెరుగుతుందని హెచ్చరించారు.

ఉచితలతోపాటు నాణ్యత ముఖ్యం

- సినీ నటి నిధి అగర్వాల్

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఉచితలతోపాటు నాణ్యత ముఖ్యమని సినీ నటి నిధి అగర్వాల్ అన్నారు. పంజగుట్టలో ఎకాధి లగ్జరీ సిల్వర్ జ్యువెలరీ షోరూంను ఆదివారం ఆ సంస్థ బ్రాండ్ అంబాసిడరైన ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా నిధి అగర్వాల్ మాట్లాడుతూ.. ప్రత్యేకమైన సిల్వర్ జ్యువెలరీ అనుభవన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. లగ్జరీ సిల్వర్ జ్యువెలరీను అందుబాటు ధరల్లో అందించాలనే లక్ష్యంతో అత్యున్నత నాణ్యత గల కళాత్మకంగా తయారు చేయబడిన కలెక్షను అందిస్తూ, చేనేతలకు ప్రోత్సాహం అందించడంలో భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందన్నారు. ఇది బంగారం కాకుండా స్వచ్ఛమైన వెండితో బంగారు నగల సొగసును, నైపుణ్యాన్ని అందుబాటు ధరలో అందించడమే లక్ష్యంగా ఎకాధి ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా సంస్థ, డైరెక్టర్స్ వేణు రాచకొండ దక్షిణ భారతదేశంలోని ప్రతి మహిళకు ప్రీమియం జ్యువెలరీ అందుబాటులోకి తేవడం తమ ధ్యేయమన్నారు. బంగారం ధరలు పెరిగిన నేపథ్యంలో చాలా మంది వధువులు సంప్రదాయ బంగారు నగలను కొనుగోలు చేయడం కష్టంగా భావిస్తున్నారనీ తమ సంస్థ ప్రీమియం వెండి నగలని అందిస్తున్నట్టు ప్రకటించారు. ఇది ప్రతి వధువు కలలను నెరవేర్చుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. లక్ష కొనుగోలుపై 50 వేలు నక్లెస్, 50 వేల కొనుగోలుపై 25వేల మణిహారం ఉచితంగా ఇస్తున్నట్టు వెల్లడించారు.



స్కూల్ ఎడ్యూకేషన్ సెంట్రల్ ఫోరం ఆధ్వర్యంలో
వెంకట్రామ్ నర్సయ్యకు నివాళి



నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ స్కూల్ ఎడ్యూకేషన్ సెంట్రల్ ఫోరం ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్ తండ్రి వి.వెంకట్రామ్ నర్సయ్య దశదిన కర్మ సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యూ కేషన్ హైదరాబాద్ సెంట్రల్ ఫోరం అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్, కార్యదర్శి ఫక్రుద్దీన్ అహ్మద్, ట్రెజరర్ పవన్, ఉపాధ్యక్షులు అశోక్, జాయింట్ సెక్రటరీ సుదర్శన్, ఆంగనైజింగ్ సెక్రటరీ శివ, ప్రచార కార్యదర్శి దిలీప్, టీఎన్జీ వోస్ యూనియన్ ఎడ్యూకేషన్ హనుమకొండ కార్యదర్శి రాజేశ్వర్, జనగాం కార్యదర్శి నూరుద్దీన్ పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళిలర్పించారు. ఉపాధ్యక్షులు భూపాల్‌పల్లి, స్కూల్ ఎడ్యూకేషన్ ఈసీ ప్రియాదేవ్ ఠాకూర్, గౌస్, శశికాంత్ రెడ్డి, ఉస్మాన్, మణి, జకీర్, అలీమ్, శ్రీనివాస్, గౌతమ్, సుందర్ పాల్గొని నివాళులర్పించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
12
హైదరాబాద్
సోమవారం మార్చి 24, 2025 www.navatelangana.com

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ-ముషీరాబాద్

నిరాశ్రయులకు అనాథలకు ఫుట్‌పాత్‌ల పైన జీవితం సాగిస్తున్న వారికి స్కై ఫౌండే షన్ ఆధ్వర్యంలో 273వ అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానంలో ఫౌండేషన్ ప్రెసిడెంట్ సంజీవ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ పావని, సభ్యులు ఆంజనేయులు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు



ముషీరాబాద్ నియోజకవర్గం బోలక్ పూర్ డివిజన్ హౌస్ దగ్గర భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ముఠా జయసింహ, గోక నవీన్, బొలక్ పూర్ నవీన్, మీడియా ఇన్‌చార్జి ముచ్చ కుర్తి ప్రభాకర్, శంకర్ ముదిరాజ్, కేం సాయి, శివ, మహేష్, భీమ్, బబ్లు, తదితరులు **నవతెలంగాణ-ముషీరాబాద్**

రంజాన్ వేళలు

ఇఫ్తార్: సోమవారం సాయంత్రం :06.34 గం.
సహార్: మంగళవారం ఉదయం :05.08 గం.

జాడలేని సివిల్ రైట్స్ డే..!

- బస్తీలు, కాలనీల్లో పౌరహక్కులపై అవగాహన కరువు
- అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

పౌరహక్కులపై అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రతీ నెల చివరి రోజు జరగాల్సిన సివిల్ రైట్స్ డే హైదరాబాద్ జిల్లాలో ఎక్కడా కానరావడం లేదు. రెవెన్యూశాఖ, పోలీసు, ఎస్సీ సంక్షేమ శాఖ సహా వివిధ శాఖల భాగస్వామ్యంతో జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని ప్రతీ నెలా ప్రతీ మండలంలో నిర్వహించాల్సింటుంది. అందు కోసం జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో ప్రతీ మండలంలో మండలస్థాయి అధికారులు బాధ్యతాయుతంగా ఈ సివిల్ రైట్స్ డే నిర్వహించాల్సింటుంది. స్థానిక ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుంది. కానీ కొన్ని నెలలుగా నామమాత్రంగా కూడా సివిల్ రైట్స్ డేలు జరగడంలేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో అధికారుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చట్టాలపై అవగాహన

జిల్లాలోని 16మండలాల్లో ప్రతీ నెల ఏదో ఒక మున్సిపల్ డివిజన్, బస్తీ, దళిత కాలనీలో సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించాల్సి ఉంటుంది. స్థానిక ఎమ్మార్వో, ఎస్సై ఎస్సీ సంక్షేమ శాఖ, జీహెచ్ఎంసీ సహా వివిధ శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొని పౌర హక్కులు, కుల వివక్ష, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, మూఢ నమ్మకాలు, తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంటుంది. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తారు. స్థానిక సమస్యలను తెలుసుకుని సంబంధిత అధికారులకు తెలియజేయడం జరుగుతుంది. కరోనా టైంలోనూ జరిగిన సివిల్ రైట్స్ డే ప్రస్తుతం కొన్ని నెలలుగా జరుగక పోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, బస్తీ, కాలనీ నాయకులు కూడా పాల్గొని ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుంది.

బస్తీలు, దళిత వాడల్లో కానరాని కార్యక్రమం

ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతీ మండలంలోని బస్తీలు, దళిత వాడల్లో ప్రతీ నెల చివరి రోజు సివిల్ రైట్స్ డేను తప్పకుండా నిర్వహించాల్సింటుంది. కానీ హైదరాబాద్ జిల్లాలో ఏ ఒక్క మండలంలో కూడా ఈ కార్యక్రమం సరిగ్గా జరగడం లేదని ప్రజలు, వివిధ సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. గతంలో ఈ కార్యక్రమాన్ని ఎప్పుడు జరిపారో కూడా రెవెన్యూ అధికారులకు గుర్తులేదని విమర్శిస్తున్నారు. ఈ వివరాలను కోరినప్పుడు అధికారులు తడబడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టర్ శ్రద్ధ వహించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని వివిధ సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయులు

భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్..

- సీపీఐ(ఎం) కార్యదర్శి ఎం.డి.అబ్బాస్



నవతెలంగాణ-మెహదీపట్నం

దేశం కోసం పిన్న వయసులోనే ప్రాణాలర్పించిన మహనీయులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ అని సీపీఐ(ఎం) హైదరాబాద్ సౌత్ కమిటీ కార్యదర్శి ఎం.డీ అబ్బాస్ కొనియాడారు. స్వతంత్ర పోరాట సమయంలో బ్రిటిష్ వారి నుంచి వచ్చే స్వాతంత్రం కంటే కులం, మతం పేరుతో విడదీసి పెత్తనం చేలాయించడం కోసమే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చిన వారు ఈ దేశంలో ఉన్నారని భగత్ సింగ్ ఆనాడే ఆవేదన వ్యక్తం చేశారన్నారు. హైదరాబాద్ గోల్కొండలోని రాందేవ్ గూడ, పద్మానగర్ కాలనీలో సర్దార్ భగత్ సింగ్ వర్ధంతి సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరముందని తన అభిప్రాయాన్ని ఆ మహిళతో వ్యక్తపరిచిన సందర్భాన్ని భగత్ సింగ్ చరిత్రలో చూడొచ్చని తెలిపారు. కులం, మతోన్మాదం ఈనాడు దేశమంతటా వ్యాపిస్తుందని దానికి వ్యతిరేకంగా భారతీయ పౌరులందరూ కలిసికట్టుగా నడవాలని పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్వతంత్ర పోరాటంలో ఎలాంటి పాత్రలేని ఆర్ఎస్ఎస్‌కు వత్తాసు పలుకుతుందని, గాంధీని చంపిన గాడ్సేను దేశభక్తుడిగా ప్రచారం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ మాట్లాడుతూ అధికారంలోన్న బీజేపీ దేశభక్తి ముసుగులో హిందుత్వ శక్తులను కోడి పిల్లలపై ఎద్దులను, కాకులను ఎగదోసినట్టు దళితులపై, మైనారిటీలపై ఎగదోస్తుందని ఎద్దేవా చేశారు. అతి తొందరలోనే దేశ ప్రజల నుంచి తిరుగుబాటు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యవర్గ సభ్యులు విట్టల్, బస్తీ అధ్యక్షుడు నర్సింహా చారి, బస్తీ నాయకులు ఎల్ఐసి రాములు, హమాలీ నాయ కులు రాములు, బస్తీ యువజన సంఘం అధ్యక్షుడు ఆనంద్, యువజన సంఘం నాయకులు శ్రీధర్, వినోద్, రవి తదితరులు పాల్గొన్నారు.

దేశంలో సోషలిస్టు రాజ్య స్థాపనకు యువత నడుం బిగించాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్..



నవతెలంగాణ-ధూల్‌పేట్

దేశంలో సోషలిస్టు రాజ్య స్థాపనకు యువత నడం బిగించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ అన్నారు. దేశంలోని సహజ వనరులు అయినటువంటి, బొగ్గు గనులు, ఖనిజ నిక్షేపాలు, అడవులు, సేద్యానికి యోగ్యమైన భూములను కేంద్రంలోని బీజేపీ సర్కార్ ఆదానీ, అంబానీ లాంటి వ్యక్తులకు అప్పగిస్తుందని ప్రజలంతా ఐక్యమై వీటిని అడ్డుకోవటమే భగత్ సింగ్‌కు అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. గోషామహల్ నియోజకర్గం లో భగత్‌సింగ్ 94వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ము ఖ్య అతిథిగా హాజరై ఆయన భారీ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు దేశ సంపదపై బ్రిటిష్ పాలకులు అజమా యిషీ చేయగా నేటి పాలకులు కార్పొరేట్, దోపిడీ దార్ల చేతి లో పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భగత్ సింగ్ దేశానికి స్వాతంత్ర్యంతో పాటు సోషలిస్టు రాజ్య స్థాపన జరగడమే తాను కోరుకునే లక్ష్యమని తన జైలు జీవితం గడిపే సందర్భంగా తన జైల్ డైరీలో వ్రాసిన విష యాన్ని పరిశీలకులు వెలికి తీశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి డీవైఎఫ్ఐ హైదరబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఏ.కృష్ణ అధ్యక్షత వహించారు. గోషామహల్ జోన్ డీవైఎఫ్ఐ కన్వీనర్ జే. సాయినాథ్, కేవీపీఎస్ గోషామహల్ నాయకులు ఎస్.శ్రీ రాములు, జిల్లా, జోన్ సీఐటీయూ నాయకులు పి.నాగేశ్వర్, ఎస్.గోపాల్, కే రాజు, ఎండి .అయూబ్, బీ.రాజు, కే.శ్రీనివాస్, చిన్న, అజ్జుబాయ్, మనోహర్, జగదీష్, ముకుందు, లగన్, జి.వినోద్, ఏ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం, స్వేచ్ఛ కోసం పోరాడిన భగత్ సింగ్ నేటి తరానికి స్ఫూర్తి

- ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్



నవతెలంగాణ-ముషీరాబాద్

బ్రిటిష్ నిరంకుశ పాలనా నుండి న్యాయం, స్వేచ్ఛ కోసం పోరాడిన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లు నేటి తరానికి స్ఫూర్తి అని ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా, దోమల గూడ, ఏవీ కాలేజ్ వద్దనున్న భగత్ సింగ్ విగ్రహానికి, రాజ్ గురు, సుఖదేవ్‌ల చిత్రపటాలకు డాక్టర్ దిడ్డి సుధాకర్ తో పాటు ఆప్ నేతలు విజయ్ మల్లంగి, జావేద్ షరీఫ్, రాకేష్, సుధారాణి, రాకేష్ రెడ్డి, అజీమ్ బేగ్, మహమ్మద్ సోహైల్, అహ్సాన్ అహ్మద్, జి సత్యనారాయణ, కొడంగల్ శ్రీనివాస్, దర్శనం రమేష్, ధర్మేందర్ తివారీ, వైశాలి, జాకీర్, భార్గవి, మౌనిక, అజీమ్ బైగ్, శబాజ్, ఖాన్ తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ భగత్ సింగ్ పోరాటాల స్ఫూర్తితో దేశ ప్రజలు బ్రిటిష్ నిరంకుశ పాలనను నాడు తరిమికొట్టారని నేటి మోదీ నిరంకుశ పాలనను అదే స్ఫూర్తితో తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. విజయ్ మల్లంగి మాట్లాడుతూ భగత్‌సింగ్ స్ఫూర్తితో యువత మతోన్మాదాన్ని అంతం చేయాలని కోరారు. జావేద్ షరీఫ్ మాట్లాడుతూ భగత్ సింగ్ గొప్ప విప్లవ కారుడే కాదు గొప్ప జర్నలిస్టు కూడా అని, పంజాబ్‌లో ప్రముఖ ఉర్దూ పంజాబీ వార్తా పత్రికలకు ఎడిటర్, రచయితగా పనిచేశారని గుర్తు చేశారు.

'ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి'



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఆశా వర్కర్లు సమస్యలు పరిష్కరించాలని, ఫిక్స్ వేతనం రూ. 18వేలు చేయాలని సీఐటీయూ సౌత్ జిల్లా అధ్యక్షురాలు ఏం. మీనా, జోన్ నాయకులు అబ్దుల్ సత్తార్ లు అన్నారు. సీఐటీయూ చార్మినార్, బహదూర్ పురా జోన్ కమిటీ ఆధ్వర్యంలో చార్మినార్ ఎమ్మెల్యే జుల్ఫికర్ అలీ ని కలిసి ఆశా వర్కర్లు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశా వర్కర్లుకు కనీస ఫిక్స్ వేతనం, పని భారం తగ్గించాలన్నారు. ఇన్సూరెన్స్, పని భద్రత కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. వారి సమస్యలపై అసెంబ్లీలో, హెల్త్ మినిస్టర్ దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్, సీఐటీయూ జోన్ నాయకులు అబ్దుల్ సత్తార్. గులాబ్ నసీర్, తదితరులు పాల్గొన్నారు.

'భగత్ సింగ్ జీవితం యువతకు ఆదర్శం'



నవతెలంగాణ-ధూల్‌పేట్

భగత్ సింగ్ జీవితం యువతకు ఆదర్శమని ఆయన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని సీపీఐ(ఎం) చాంద్రాయణ గుట్ట జోన్ కమిటీ కార్యదర్శి ఎస్ కిషన్, ఏ. కృష్ణ వీరాంకుమా అన్నారు. జోన్ కమిటీ ఆధ్వర్యంలో షాహిద్ భగత్ సింగ్ 94 వర్ధంతి సందర్భంగా ఫలక్నుమా సీపీఐ (ఎం) ఆఫీస్ వద్ద ఘన నివాళి అర్పించారు. ఈ స దర్భంగా వారు మాట్లాడుతూ.. యువ కెరటం యువ కిశోరం భగత్ సింగ్ ఆశయ సాధన బాటలో నడవాలని కోరారు. ఆనాడు స్వతంత్ర పోరాటంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకిస్తూ మహోన్నతమైన పోరాటం చేసిన వ్యక్తి భగత్ సింగ్ అని కొనియాడారు. వారి ఆశయ సాధన కోసం నేటి యువత ముందుకు రావాలని యువతరానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) చాంద్రాయణ గుట్ట జోన్ కమిటీ సభ్యులు శ్రీను, సోమన్న, వీరన్న, మల్లేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువవికాస పథకాన్ని సద్వినియోగించుకోవాలి

- గన్ ఫౌండ్రీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్రమోహన్ యాదవ్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువవికాస పథకంలో భాగంగా అన్నికులాల వారికి స్వయం ఉపాధి కల్పించేందుకు సుమారు రూ. 3లక్షల వరకు ఆర్థిక సహా యం అందిస్తోందని, ఇందులో కనీసం 60 నుంచి 80 శాతం సబ్సిడీ కూడా అందిస్తున్నట్లు గన్ ఫౌండ్రీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రమోహన్ యాదవ్ అన్నారు. ఆదివారం హనుమాన్ టెక్డిలోని ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ.. ఆధార్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు తప్పనిసరి (అన్ని కులాల వారికి), పాన్ కార్డు (తప్పనిసరి కాదు), లబ్దిదారుని పాస్‌పోర్టు ఫొటో, లబ్దిదారుడి ఫోన్ నంబర్, బ్యాంకు పాస్బుక్. ఒక రేషన్ కార్డులోని సభ్యులలో ఒకరికి మాత్రమే అవకాశం ఉంటుందని తెలిపారు. ఏప్రిల్ 5వ తేదీవరకు ఉంటుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

ఆటోమోటార్ కార్మికుల హక్కుల కోసం కిరణ్ అలుపెరగని పోరాటం

- టీయుసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం



నవతెలంగాణ-ముషీరాబాద్

కామ్రేడ్ కిరణ్ ఆటో మోటార్ కార్మికుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారని టీయుసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం గుర్తు చేసుకున్నారు. వడ్లకొండ కామ్రేడ్ కిరణ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా విద్యానగర్ మార్క్స్ భవన్‌లో తెలంగాణ ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ వర్కర్స్ యూనియన్, ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టీయుసీఐ హైదరాబాద్ రంగారెడ్డి మేడ్చల్ జిల్లాల ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆటో యూనియన్ అధ్యక్షులు జి.లింగం గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో టీయుసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సూర్యం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కిరణ్ ఆటో మోటార్ కార్మికుల హక్కుల కోసం అలుపెరగని పోరాటం చేశారని, కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించిన వ్యక్తి అని కొనియాడారు. టీయుసీఐ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల ప్రధాన కార్యదర్శి వి.ప్రవీణ్ మాట్లాడుతూ కిరణ్ లేని లోటు పూడ్చలేనిదన్నారు. ట్రాఫిక్, ఆర్టీఏ, మీటర్ సీల్ అధికారుల దౌర్జన్యానికి లంచ గొండితనానికి వ్యతిరేకంగా ఉద్యమించిన వ్యక్తిని అని కిరణ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. టీయుసీఐ నగర అధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ మాట్లాడుతూ 1997లో యూనియన్ ఏర్పాటు చేసి మరణించే దాకా యూనియన్ అభివృద్ధికి కృషి చేసిన వ్యక్తి అని కొనియాడారు. మాజీ ఆటో యూని యన్ అధ్యక్షులు ఏ.నరేందర్ మాట్లాడుతూ కిరణ్ తెలివైన చురుకైన వారని ఎటువంటి ఆటుపోట్ల కైనా ఎదిరించి కొట్లాడే ధైర్య సాహసాలు కలిగిన వారన్నారు. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం. అన్వేష్ మాట్లాడుతూ ఆటో మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు కావాలని అలు పెరుగని పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.నల్లన్న, ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ కాజువల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. శ్రీనివాస్, డి.లక్ష్మి, ఆటో యూనియన్ నాయకులు హైదరాబాద్ ఏరియా కార్యదర్శి టి. నారాయణ, కొంపెల్లి ఏరియా కార్యదర్శి మొహమ్మద్ ఖాజా మియా, సికింద్రాబాద్ ఏరియా కార్యదర్శి ఎస్.రవీందర్, జె. వెంకటేష్, జి.యాదయ్య, కార్యనిర్వాహణ అధ్యక్షులు మహమ్మద్ అఫ్జల్, ఉపాధ్యక్షు లు పి.కృష్ణ ముదిరాజ్, తాజ్ డెక్కన్ హోటల్ వర్కర్స్ యూనియన్ నాయకు లు సత్య నారాయణ, బి.వెంకటేష్, బి.ప్రభాకర్, ఎస్‌డి నిస్సార్, ఎంఎన్ రెడ్డి, మెహర్ తదితరులు పాల్గొన్నారు.

యువతరాన్ని మేల్కొల్పడం అవసరం..

- సీపీఐ(ఎం) జోన్ కార్యదర్శి అబ్దుల్ సత్తార్, మీనా



నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో యువతరాన్ని మేల్కొలపడం ఎంతైనా అవసరమని సీపీఐ(ఎం) చార్మినార్ బహదూర్ పుర జోన్ కార్యదర్శి అబ్దుల్ సత్తార్, మీనాలు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) చార్మినార్ బహదూర్పుర జోన్ కమిటీ ఆధ్వర్యంలో 94వ భగత్ సింగ్, సుఖదేవ్ రాజ్ గురు వర్ధంతి సభలు వారి నాయకత్వంలో చార్మినార్ బస్టాండ్, దారుషిఫా, సాలార్జంగ్ మ్యూజియం, పన్జాషా, పురాణపుల్ ఐదు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విప్లవ పంథా భగత్ సింగ్ త్యాగస్ఫూర్తిని ప్రజల్లో అవగాహన కల్పించడం అవసరమన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో యువతరాన్ని ఆయన ఆశయస్ఫూర్తి సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. యుక్త వయసులో ఇంత పెద్ద త్యాగం, దేశం పై ప్రేమ అభిమానం ఉన్నంతవరకు భగత్‌సింగ్‌ను ఈ దేశ ప్రజలు కొనియాడతారన్నారు. ఈ కార్యక్రమంలో జూన్ నాయకులు ఎం మీనా, గులాం నసీర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రైతుల ఆత్మహత్యలు పూర్తిగా నివారించాలి




- రైతు విభాగం ఆవిర్భావ సమావేశంలో రాచాల యుగంధర్ గౌడ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రైతుల ఆత్మహత్యల నివారణకు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసి, రైతుల ఆత్మహత్యలు పూర్తిగా నివారించాలని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్, బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో బీసీ పొలిటికల్ జేఏసీ రైతు విభాగం ఆవిర్భావ సమావేశం ఏర్పాటు చేశారు. రైతు విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా మక్తల్ నియోజకవర్గానికి చెందిన మారమోని పాండురంగ యాదవ్‌ను రాచాల నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటల బీమా పథకాన్ని పటిష్టంగా అమలు చేసి, అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే రైతు పరిహారం చెల్లించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం నూతన కన్వీనర్ పాండురంగ యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర కన్వీనర్‌గా నియమించిన రాచాల యుగంధర్ గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు గూడుషా, తిరుపత య్య, శివన్న, నాగన్న, కుమ్మరి తిరుపతయ్య, వెంకటయ్య, రాజు, తిరుమలేష్, శివ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 6న శ్రీరామనవమి శోభాయాత్ర..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

ఏప్రిల్ 6న శ్రీరామనవమి శోభాయాత్ర నిర్వహించేందుకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ప్రతినిధులు ప్రకటించారు. కోఠి హస్మత్‌ం గంజ్ లోని కార్యాలయంలో డాక్టర్ భగవంత్ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొని శ్రీరామ నవమి శోభాయాత్ర ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గతేడాది మాదిరిగానే ఈ యేడాది సైతం శ్రీరాముని శోభాయాత్ర సీతారామ బాగ్ లోని ఆలయం నుండి వేలాది భక్త జనుల సమక్షంలో ప్రారంభమై సుల్తాన్‌బజార్‌లో ముగుస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో భాగ్యనగర్ శ్రీరామనవమి ఉత్సవ సమితి ప్రతినిధులు డాక్టర్ భగవంతరావు, గోవింద్ రాఠీ, కరోడిమల్, మెట్టు వైకుంఠం, మహేంద్ర వ్యాస్, బాబు గురు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన మెహిదీపట్నం విద్యుత్ ఏడీఈ



నవతెలంగాణ-మెహదీపట్నం

నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌ను మెహదీపట్నం అసిస్టెంట్ డివిజనల్ ఎలక్ట్రిక్ ఇంజనీర్ ఆర్ బిక్కు మర్యాదపూర్వకంగా కలిశారు. అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యేకు వివరించినట్లు ఆయన తెలిపారు. రంజాన్ సందర్భంగా విద్యుత్ సరఫరాను ఇలాంటి అంతరాయం ఏర్పడకుండా తగిన చర్యలు చేపట్టినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బందిని మాజీద్ హుస్సేన్ అభినందించారు.

శ్రీ సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ 648వ జయంతి వేడుకలు



నవతెలంగాణ-అంబర్‌పేట

నల్లకుంట డివిజన్ తిలక్‌నగర్‌లో సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం శ్రీ సంత్ శిరోమణి గురు రవిదాస్ మహారాజ్ 648వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ అధ్యక్షుడు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అతిథిలుగా హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీమంత్రి సి.కృష్ణ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు, నల్లకుంట డివిజన్ కార్పొరేటర్ అమృత, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, సీనియర్ నాయకులు అజయ్ కుమార్, శ్యామ్ రాజ్ హాజరై ఈ సందర్భంగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ సంత్ రవిదాస్ జీ మానవత్వం, సమానత్వం, భక్తి విలువలను బోధించారని ఆయన ఎత్తి చూపారు. కమిటీ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘర్ జాతి సంఘ్ విద్యానగర్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి.నర్సింగ్ రావు, కోశాధికారి లక్ష్మణ్, ప్రసాద్, ఆర్గనైజర్స్ విష్ణు, హీరాలాల్ కిషోర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జాతీయోద్యమ మహానేత భగత్ సింగ్ 94 వర్ధంతి సందర్భంగా గౌలిగూడలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన ప్రజాఏక్త పార్టీ జాతీయ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్, దుత్తాల నరేష్ తదితరులు



సంత రవిదాస్ జయంతి సందర్భంగా ఎస్సీఆర్పీఎస్ అంబర్‌పేట నియోజకవర్గంలో సురేష్, బాలరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై సంత రవిదాస్‌కి నివాళులర్పించిన ఎడెల్లి భాను ప్రకాష్, సత్యనారాయణ ఈ సందర్భంగా నిర్వాహకులను సన్మానించారు.

నవతెలంగాణ-అంబర్‌పేట



బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న లేబర్ బోర్డు మాజీ వైస్ చైర్మెన్ నాగభూషణం, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణ గౌడ్

నవతెలంగాణ-అంబర్‌పేట

ఎండల్లో హాయ్ హాయ్...

రోజురోజుకీ ఎండలు పెరిగిపోతున్నాయి. మార్చి నెలలోనే సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నాడు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకు అడుగు బయట పెట్టాలంటే ప్రజలు జంకుతున్నారు. ఇలాంటప్పుడు తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లినవారు ఎండవేడిమి నుంచి ఉపశమనం పొందటానికి రకారకాల పండ్ల రసాలు తాగుతుంటారు. అయితే ప్రస్తుతం మండుతున్న ఎండలను ఎదుర్కోవడానికి, తక్షణ శక్తిని పొందేందుకు ఈ పానీయాలను ట్రై చేయండి. వడదెబ్బ నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోండి.




తక్షణ శక్తి కోసం

ఎండలో బయటకు వెళ్లి ఇంటికి వచ్చిన తర్వా త ఎన్ని నీళ్ల తాగిన దప్పిక తీరదు. ఇలాంటి సమయంలో ఎండవేడి నుంచి ఉపశమనం పొందలన్నా, తక్షణ శక్తి కావాలన్నా పెరుగులో కొద్దిగా జీలకర్ర, కొత్తిమీర తరుగు, పుదీనా కలిపి మజ్జిగ చేసి తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

శరీరం చల్లబడేలా

లస్సీ తాగడం వల్ల శరీరం వేగంగా చల్లబడుతుందని నిపుణులు అంటున్నారు. తేనె, జీలకర్ర, యాలకులు కలిపి చిలికిన లస్సీని తీసుకుంటే ఎండ వల్ల కలిగే ఇబ్బంది తగ్గుతుందని సూచిస్తున్నారు.



పుల్లగా తియ్యగా

పచ్చి మామిడిని ఉడకబెట్టి రసం తీసి పంచదార, జీలకర్ర, నల్ల ఉప్పు, పుదీనా కలిపి పానీయం తయారు చేస్తారు. ఇది పుల్లగా తియ్యగా ఉంటుందని.. పంచదార ఇష్టం లేని వారు తేనె వేసుకొని తాగవచ్చు.



శరీరానికి చలవ

ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు శరీరానికి చలవ అందించేందుకు సబ్జా గింజలు ఎంతగానో తోడ్పడతాయి. సబ్జాల ద్వారా చల్లదనమే కాకుండా మరెన్నో ఆరోగ్యపరమైన లాభాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. మండుతున్న ఎండలు కారణంగా బాడీ డీ హైడ్రేషన్‌కు గురి అవుతుంది. దాని నుంచి ఉపశమనం పొందాలంటే సబ్జా గింజలను నానబెట్టిన నీళ్లల్లో తేనె, నిమ్మరసం కలిపి తీసుకుంటే శరీరానికి చలవ చేసి బాడీ డీహైడ్రేషన్‌కు గురి కాకుండా ఉంటుందని అంటున్నారు.

వడదెబ్బ తగలకుండా

ముఖ్యంగా ఎండలో ఎక్కువసేపు తిరిగితే వడదెబ్బ తాకే అవకాశాలు ఎక్కువ. దీని బారిన పడకుండా ఉండాలంటే శరీరానికి అధిక మోతాదులో ఎలక్ట్రోలైట్ల కలిగిన కొబ్బరి నీళ్ల తాగాలని అంటున్నారు. వీటిలో ఉండే మెగ్నీషియం, సోడియం వడదెబ్బ నుంచి తట్టుకోవడానికి కావాల్సిన శక్తిని సమకూరుస్తాయి.



నిమ్మ షర్బత్

రోగనిరోధక శక్తిని వేగంగా పెంచి తక్షణ శక్తిని అందించే నిమ్మకాయను తేనె కలిపి తీసుకోవాలి. దీంట్లో నానబెట్టిన సబ్జా గింజలనూ కలపొచ్చు. ఈ షర్బత్ వడదెబ్బ నుంచి సంరక్షిస్తుంది. అంతే కాకుండా శరీరంలో వేడిని తగ్గించడానికి అవసరమైన గుణాలు ఇందులో పుష్కలంగా ఉంటాయి. నిమ్మకాయ నీటిని రోజూ తాగడం వల్ల బాడీ ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉండటంతో పాటు హానికరమైన టాక్సిన్ల నుంచి కూడా తప్పించుకోవచ్చు.





వేడిమి నుంచి రక్షణ

ఎండాకాలంలో చల్లచల్లగా పండ్ల రసాలు తాగుతూ ఉంటాం. మామిడి, కర్బూజ, ద్రాక్ష, యాపిల్, అరటి, సపోటా లాంటి రకరకాల పండ్లను అప్పటికప్పుడు జ్యూస్ చేసుకుంటూ ఉంటారు. ఇది తీసుకోవడం చాలా మంచిది. పండ్ల రసాలు శక్తిని అందించడంతో పాటు ఎండ వేడిమి నుంచి తట్టుకు నేందుకు సాయపడతాయని నిపుణులు సూచిస్తున్నారు. అయితే చక్కెర లేకుండా చేసిన పండ్ల రసాలను తీసుకోవడం ఉత్తమమని సూచిస్తున్నారు.

ఈ టిప్స్ ఫాలో అయితే...

అధిక ఉష్ణోగ్రతల కారణంగా.. చర్మం జిడ్డుగా మారడం, మొటిమలు, చర్మం పొడిబారడం, కమిలిపోవడం వంటి సమస్యలు ఎదురవుతూ ఉంటాయి. ఈ కాలంలో సౌందర్య సంరక్షణ కొంత కష్టంగానే ఉంటుంది. అయితే, వేసవి బ్యూటీ రొటీన్‌పై ప్రత్యేక దృష్టి పెడితే.. చెక్కుచెదరని అందం సొంతం చేసుకోవచ్చని నిపుణులు అంటున్నారు. వేసవిలో సౌందర్య సంరక్షణకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు చూద్దాం..

చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేయండి..

ఈ కాలంలో ఎండ, అధిక ఉష్ణోగ్రతల కారణంగా.. చర్మం నిర్జీవంగా మారుతుంది. మృత కణాల కారణంగా, చర్మం డల్‌గా కనిపిస్తుంది. ఇవి చర్మానికి పోషకాలు అందకుండా చేసి, చెమట గ్రంథుల్ని మూసుకుపోయేలా చేస్తాయి. దీంతో మొటిమలు, మచ్చలు.. వంటి సమస్యలు వస్తాయి. అందుకే చర్మాన్ని ఎక్స్‌ఫోలియేట్ చేయడం చాలా ముఖ్యం. స్నానం చేయడానికి ముందు ఎసెన్షియల్ నూనెతో చర్మాన్ని మసాజ్ చేసి, మీ చర్మతత్వానికి సరిపోయే న్యాచురల్ స్క్రబ్‌తో ఎక్స్‌ఫోలియేట్ చేయండి. కనీసం వారానికి రెండు సార్లైనా.. మీ చర్మాన్ని స్క్రబ్ చేస్తే.. మృత కణాలు తొలగి ఫ్రెష్‌గా కనిపిస్తుంది. రోజుకు కనీసం మూడు సార్లు ఫేస్ వాష్ చేసుకుంటే.. ముఖం కాంతివంతంగా కనిపిస్తుంది.

మాయిశ్చరైజర్ మార్చండి..

వేసవి కాలంతో పోలిస్తే.. శీతాకాలం మీ చర్మం పొడిగా ఉంటుంది. ఆ సీజన్‌లో వాడే మాయిశ్చరైజర్ కాస్త ఆయిలీగా, హెవీగా ఉంటుంది. అటువంటి మాయిశ్చరైజర్ ఈ కాలానికి సరిపోదు. మీ డెర్మటాలజిస్ట్‌ను కలిసి ఈ సీజన్‌కు సరిపడా క్రీమ్ వాడాలి.

సన్‌స్క్రీన్ మర్చిపోవద్దు..

వేసవి స్కిన్ కేర్ రొటీన్‌లో ఏది మర్చిపోయినా.. మీ చర్మానికి సన్‌స్క్రీన్ రాయడం మాత్రం మర్చిపోవద్దు. బయటికి వెళ్లేటప్పుడు మాత్రమే కాదు, ఇంట్లో ఉన్నప్పుడూ సన్‌స్క్రీన్ రాసుకోవడం మంచిది. ఇది చర్మాన్ని యూవీ కిరణాల నుంచి రక్షించడమే కాదు, స్కిన్‌ను తేమగా ఉంచడంలో సహాయపడుతుంది.

ఆహారంపై దృష్టి పెట్టండి..

మనం తీసుకునే ఆహారం సైతం మన అందాన్ని రక్షిస్తుంది. అందుకే వేసవి కాలంలోనూ చర్మాన్ని తాజాగా మార్చుకోవడానికి, మెరిపించుకోవడానికి విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో ఎక్కువగా దొరికే.. మామిడి, బెర్రీస్.. వంటివి ఎక్కువగా ఆహారంలో చేర్చుకోవాలి.

నీళ్లు ఎక్కువగా తాగండి...



ఈ కాలంలో అధిక ఉష్ణోగ్రతల కారణంగా.. శరీరంలోని నీరు చెమట రూపంలో బయటకు ఎక్కువగా వస్తూ ఉంటుంది. దీని కారణంగా, డీహైడ్రేషన్‌కు గురవుతూ ఉంటారు. చర్మం నిర్జీవంగా మారుతుంది. చర్మం నిగనిగలాడలంటే.. ఈ కాలంలో సరిపడా నీళ్లు తాగడం చాలా ముఖ్యం. జ్యూస్‌లు, సూప్‌లు వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

బయటకు వెళ్లినప్పుడు ఈ జాగ్రత్తలు తీసుకోండి..

బయటకు వెళ్లినప్పుడు.. సూర్యరశ్మి తగలకుండా.. కూల్ గ్లాసెస్, గొడుగు కచ్చితంగా తీసుకెళ్లండి. వీలైనంత వరకు ఎండ తగలకుండా ముఖం, తలపై స్కార్ఫ్ కట్టుకోవడం మంచిది.

మీ ఆశయసాధనకు కృషి చేస్తాం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మీరు చూపిన బాటలో నడుస్తూ..మీ ఆశయ సాధనకు కృషిచేస్తామని ప్రమాణం చేశారు. స్వాతంత్ర సమర యోధులు, విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌కు సీపీఐ(ఎం) నేతలు ఘన నివాళి అర్పించారు. అలాగే స్వాతంత్ర సమరయోధుడు, సీపీఐ(ఎం) మాజీ ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సుర్జీత్‌కూ ఘనంగా నివాళులర్పించారు. భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి (షహీద్ దివస్), హరి కిషన్ సింగ్ 109వ జయంతి సందర్భంగా ఆదివారం నాడిక్కడ హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఉదయం 9.30 గంటలకు జరిగిన కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు, కేంద్ర కమిటీ సమన్వయకర్త ప్రకాశ్ కారత్ సుర్జీత్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పొలిట్‌బ్యూరో సభ్యులు మాణిక్ సర్కార్ కూడా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బృందా కరత్, సుభాషిణి అలీ, బివి రాఘవులు, ఎంఎ బేబీ, అశోక్ ధావలే, ఎంవి గోవిందన్, తపన్ సేన్, సూర్యకాంత్ మిశ్రా, జి రామక ృష్ణన్, ప్రత్యేక ఆహ్వానితులు ఎస్ రామచంద్రన్ పిళ్లై, కేంద్ర కమిటీ సభ్యులు నివాళులర్పించారు.

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

రాక అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. రామన్నపేట ప్రాంతంలో రైతులను నమ్మించి వందలాది ఎకరాలను కొనుగోలు చేసి ప్రజల ప్రాణాలు తీసే అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తామంటే సీపీఐ(ఎం) ఊరుకోదన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతం మూసీనీటితో సతమతమవుతుంటే కొత్తగా సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి వాతావరణాన్ని కలుషితం చేయడం దారుణమన్నారు. తాత్కాలికంగా పనులను నిలిపివేసి ప్రజలను పక్కదోవ పట్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని, సద్దుమణిగిన తర్వాత తిరిగి ఫ్యాక్టరీని కొనసాగిద్దామనుకుంటే సీపీఐ(ఎం) రైతులతో కలిసి భూములు తిరిగి తీసుకోవడానికి ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు. రామన్నపేట ప్రభుత్వాస్పత్రిని వంద పడకలకు పెంచి మెరుగైన వైద్య సౌకర్యం అందించాలని అన్నారు. మండలంలో అనేక గ్రామాలకు రోడ్ల సౌకర్యం, బస్సు సౌకర్యం లేకపోవడం విచారకరమన్నారు. దశబ్దాలు గడుస్తున్నా ధర్మారెడ్డిపల్లి, పిలాయిపల్లి కాలువలను పూర్తి చేసి నీరు అందివ్వకపోవడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని తెలిపారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించకుంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్తారన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించే దాకా పోరాటం ఆగదు : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించే దాకా సీపీఐ(ఎం) పోరాటం ఆగదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలని అధ్యయనం చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడటమే ప్రజా చైతన్య పాదయాత్ర ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రామన్నపేట గతంలో నియోజకవర్గ కేంద్రంగా, తాలూకాగా ఉండేదని, ఇప్పుడు అభివృద్ధికి ఆమడ దూరంగా ఉందని అన్నారు. ప్రస్తుతం జరగబోయే నియోజకవర్గాల పునర్విభజనలో రామన్నపేటను మళ్లీ నియోజకవర్గంగా పునరుద్దరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పైళ్ల ఆశయ్య, బట్టుపల్లి అనురాధ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, బూర్గు కృష్ణారెడ్డి, పాదయాత్ర బృందం సభ్యులు జల్లెల పెంటయ్య, బొడ్డుపల్లి వెంకటేశం, బోయిని ఆనంద్, కందుల హనుమంతు, గన్నెబోయిన విజయభాస్కర్, వేముల సైదులు, గొరిగే సోములు, బొడిగే రజిత, మేడి గణేష్, కొమ్ము అంజమ్మ, శానగొండ రాము, జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, బల్లూరు అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు కూరెళ్ల నర్సింహా చారి, కల్లూరి నగేష్, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్, శాఖ కార్యదర్శి శానగొండ వెంకటేశ్వర్లు, పులి బిక్షం, మునికుంట్ల లెనిన్ పాల్గొన్నారు.

అన్ని వేళ్లూ జస్టిస్ వర్మ వైపే !

వాహనాలలో నింపుతాం. నాలుగైదు రోజుల క్రితం కాలిపోయిన ఐదు వందల రూపాయల నోట్ల ముక్కలు కన్పించాయి. ఇప్పుడు కూడా కొన్ని దొరికాయి' అని ఆయన చెప్పారు.

బస్తాలలో కరెన్సీ నోట్లు

ఇదిలావుండగా సుప్రీంకోర్టు విడుదల చేసిన నివేదిక ప్రకారం స్టోర్‌రూమ్‌గా ఉపయోగిస్తున్న ఔట్‌హౌస్‌లో కాలిపోయిన నాలుగైదు బస్తాల కరెన్సీ నోట్లు లభించాయి. జడ్జి నివాసంలోకి ఆ డబ్బు ఎలా వచ్చిందన్న దానిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే తానేమీ తప్పుడు పనులు చేయలేదని జస్టిస్ వర్మ చెబుతున్నారు. తాను కానీ, తన కుటుంబ సభ్యులు కానీ ఆ గదిలో ఎన్నడూ నగదును ఉంచలేదని అంటున్నారు. తనను అప్రదిష్టపాలు చేయడానికి చేసిన కుట్రలో భాగంగానే ఇదంతా జరిగిందని ఆయన ఆరోపించారు. గదిలో కాలిపోయిన నగదు కట్టలు లభించినట్లు సుప్రీంకోర్టు విడుదల చేసిన వీడియో చూసి దిగ్భ్రాంతి చెందానని అన్నారు.

సుప్రీంకోర్టు జరిపిన విచారణ నివేదికను శనివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత బహిర్గతం చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించిన తర్వాత అగ్నిమాపక సిబ్బంది చేపట్టిన సహాయక చర్యలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను కూడా ఆ నివేదికతో పాటే విడుదల చేశారు. స్టోర్‌రూములోకి బయటి వ్యక్తులు ప్రవేశించినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ సూచనప్రాయంగా చెప్పారు. అంటే దీనిని బట్టి జస్టిస్ వర్మకు సంబంధించిన వారే ఆ గదిలోకి వెళ్లారని అర్థమవుతోంది. జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలు, నివేదిక నేపథ్యంలో దీనిపై మరింత లోతుగా దర్యాప్తు జరిపేందుకు సుప్రీంకోర్టు ముగ్గురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. అసలు ఆ నగదు ఎక్కడిది, జస్టిస్ వర్మ సిబ్బందికి కానీ లేదా ఇతరులకు కానీ ఈ వ్యవహారంలో ఏమైనా ప్రమేయం ఉన్నదా అనే విషయాలపై ఈ కమిటీ దర్యాప్తు జరుపుతుంది. విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకూ న్యాయపరమైన విధులు నిర్వర్తించవద్దని జస్టిస్ వర్మకు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆ డబ్బుతో నాకేం సంబంధంలేదు అని జస్టిస్ యశ్వంత్ వర్మ చెబుతున్నట్టు సమాచారం.



జవాబు లేని ప్రశ్నలెన్నో

ఈ నెల 14వ తేదీ రాత్రి జస్టిస్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. అయితే వారం రోజుల తర్వాత కానీ ఆ ఘటన వెలుగులోకి రాలేదు. ఈ మధ్యకాలంలో ఏం జరిగిందన్న దానిపై అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే వీటికి నేటి వరకూ సంతృప్తికరమైన సమాధానం లభించలేదు. జస్టిస్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం జరిగిన సమాచారాన్ని ఆయన ప్రైవేటు కార్యదర్శి ఆ రోజు రాత్రి 11.43 గంటలకు అధికారులకు చేరవేశారు. రెండు అగ్నిమాపక శకటాలు అక్కడికి చేరుకొన్నాయి. నివాస ప్రాంగణం సరిహద్దు గోడుకు ఆనుకొని ఉన్న ఔట్‌హౌస్‌లో ప్రమాదం జరిగిందని సిబ్బంది గుర్తించారు. మంటలను వెంటనే అదుపు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా నిర్ధారించారు. మంటలను అదుపు చేసిన తర్వాత సగం కాలిపోయిన నాలుగైదు గోనె సంచులు కన్పించాయి. వాటిలో కరెన్సీ నోట్లు ఉన్నాయి.

ఆ రోజు జస్టిస్ వర్మ ఆయన భార్య భోపాల్‌లో ఉన్నారు. ఆయన తల్లి, కుమార్తె, సిబ్బంది మాత్రమే ఇంట్లో ఉన్నారు. ఆ మర్నాడు...అంటే 15వ తేదీ కొన్ని శిథిలాలను, సగం కాలిన వస్తువులను గది నుండి తొలగించారు. సాయంత్రం నాలుగు గంటలకు జస్టిస్ వర్మ దంపతులు ఢిల్లీ చేరుకున్నారు. ప్రమాదానికి సంబంధించిన సమాచారాన్ని ఢిల్లీ పోలీస్ కమిషనర్ సంజయ్ ఆరోరా లక్నోలో ఉన్న ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉపాధ్యాయకు తెలియజేశారు. ఆయన ఆ సమాచారాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తెలిపారు. ఆ రాత్రి 9.10 గంటలకు ఢిల్లీ ప్రధాన న్యాయమూర్తి రిజిస్ట్రార్-కార్యదర్శి సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఆయన ఆ గదిని సుమారు పది నిమిషాల పాటు పరిశీలించారు. ఇంట్లో పనికిరాని వస్తువులను ఆ గదిలో పడేస్తామని, దానికి తాళం ఉండదని, ఎవరైనా అందులోకి వెళ్లవచ్చునని జస్టిస్ వర్మ ప్రైవేటు కార్యదర్శి ఆయనకు చెప్పారు.

16వ తేదీ సాయంత్రం ఢిల్లీ సీజే ఉపాధ్యాయ లక్నో నుండి నగరానికి చేరుకొని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ఖన్నా నివాసానికి వెళ్లారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన సీజే ఉపాధ్యాయ రిజిస్ట్రార్-కార్యదర్శి ఓ నివేదికను అందజేశారు. సగం కాలిన వస్తువులు అక్కడ పడి ఉన్నాయని, పూర్తిగా తగలబడిపోయిన వస్తువులు, వాటి తాలూకు శిథిలాలు నేలపై ఉన్నాయని తెలిపారు. శిథిలాలను, సగం కాలిన వస్తువులను గది నుండి తొలగించడం జరిగిందని జస్టిస్ వర్మ నివాసం వద్ద విధులు నిర్వహిస్తున్న గార్డు పోలీసులకు చెప్పారు. 17వ తేదీన సీజే ఉపాధ్యాయ జస్టిస్ వర్మను కలిశారు. స్టోర్‌రూములో లభించిన నగదుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను ఆయనకు చూపించారు. ఇదంతా ఓ కుట్ర అని జస్టిస్ వర్మ అనుమానాలు వ్యక్తం చేశారు. 20వ తేదీన ప్రమాదానికి సంబంధించిన మూడు ఫొటోలు, ఒక వీడియో, రెండు సందేశాలను సీజే ఉపాధ్యాయ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి పంపారు.

జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు తిప్పి పంపాలన్న ప్రతిపాదన గురించి సీజేఐ ఖన్నా సీజే ఉపాధ్యాయకు తెలియజేశారు. ఇందుకు జస్టిస్ ఉపాధ్యాయ అంగీకారం తెలిపారు. ఈ ఘటనపై లోతుగా విచారణ జరపాల్సిన అవసరం ఉన్నదని పేర్కొంటూ 21వ తేదీన సీజే ఉపాధ్యాయ ఓ నివేదికను అందజేశారు. ఈ వ్యవహారంపై జస్టిస్ వర్మ స్పందన ఏమిటో తెలుసుకోవాలని సీజే ఉపాధ్యాయను సీజేఐ ఖన్నా కోరారు. గదిలో అంత సొమ్ము ఎక్కడిది, అది ఎవరి నుండి వచ్చింది, కాలిపోయిన నగదును 15వ తేదీ ఉదయం గది నుండి తొలగించింది ఎవరు అనే దానిపై వివరణ కోరాలని కూడా అడిగారు. గత ఆరు నెలలుగా జస్టిస్ వర్మ ఉపయోగించిన వేరే ఫోన్ నెంబర్ల నుండి చేసిన కాల్స్ వివరాల కోసం మొబైల్ సర్వీస్ ప్రొవైడర్‌ను సంప్రదించాలని కూడా ఆదేశించారు. జస్టిస్ వర్మ నివాసంలో పనిచేస్తున్న అధికారిక సిబ్బంది, వ్యక్తిగత భద్రతాధికారులు, సెక్యూరిటీ గార్డుల వివరాలు కూడా ఆయన కోరారు. మొబైల్ ఫోన్లను పారేయవద్దని, అందులోని సంభాషణలను తొలగించడం కానీ లేదా మార్చడం కానీ చేయవద్దని జస్టిస్ వర్మకు సూచించాలని చెప్పారు. దీనిపై 22వ తేదీన జస్టిస్ వర్మ స్పందించారు. తాను కానీ, కుటుంబ సభ్యులు కానీ స్టోర్‌రూములో నగదు ఉంచలేదనితెలిపారు. కాలిపోయిన నగదును ఎందుకు స్వాధీనం చేసుకోలేదని ప్రశ్నించారు. తన కుటుంబ సభ్యులు ఎన్నడూ డబ్బు ఉన్న గోనె సంచులు చూడలేదని కూడా తెలిపారు. మరోవైపు సీజేఐ తనను అడిగిన సమాచారాన్ని (సిబ్బంది వివరాలు, కాల్స్ సమాచారం) సీజే ఉపాధ్యాయ ఆయనకు అందజేశారు.

కాగా జస్టిస్ వర్మపై వచ్చిన ఆరోపణలను విచారించేందుకు పంజాబ్-హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి షీల్ నాగు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జీఎస్ సంధావాలియా, కర్నాటక హైకోర్టు న్యాయమూర్తి అను శివరామన్‌తో కూడిన త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సీజేఐ ఖన్నా ఓ పత్రికా ప్రకటనలో తెలియజేశారు. అయితే ఈ మొత్తం వ్యవహారంలో అనేక అనుమానాలు రేకెత్తుతున్నాయి. అసలు స్టోర్‌రూములోకి ఆ నగదు ఎలా చేరింది, దానిని ఎవరు ఇచ్చారు, కాలిపోయిన నగదు కట్టలను గది నుండి ఎవరు తొలగించారు, ఈ ఉదంతం వెనుక ఏమైనా కుట్ర ఉన్నదా అనే మిలియన్ డాలర్ల ప్రశ్నకు దర్యాప్తు పూర్తయితే కానీ సమాధానాలు లభించవు.



కార్మిక పోరాటాలపై నిర్బంధాలు ఎత్తేయాలి

(మొదటిపేజీ తరువాయి)

అవుతున్నాయా? లేదా? అనేదానిపై ఒక్కసారి పరిశీలించుకోండి' అని కోరారు. రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిత, స్కీమ్ వర్కర్లు మరియు రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థల్లో పనిచేసే ఉద్యోగ, కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో హామీనిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడుస్తున్నా ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదనే అసంతృప్తిలో కార్మికులున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీ, బీడీ, భవన నిర్మాణం, ప్రైవేట్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ తదితర అసంఘటితరంగ కార్మికులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యల పరిష్కారం కోసం హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద మహాధర్నాకు ఈ నెల 21న పిలుపునిచ్చారని తెలిపారు. ఆ ధర్నాకు అనుమతి కోరుతూ సంబంధిత పోలీసులకు వారం రోజుల ముందే దరఖాస్తు చేసుకున్నారనీ, సంబంధిత పోలీస్ అధికారులతో ఆ యూనియన్ల రాష్ట్ర నాయకత్వం రాయభారాలు చేశారని గుర్తుచేశారు. మార్చి 20 రాత్రి 9-30 గంటల వరకు కాలయాపన చేసి పోలీసులు అనుమతి నిరాకరించారనీ, అదే రోజు అర్ధరాత్రి కార్మికుల ఇండ్లలోకి వెళ్లి బలవంతంగా పోలీస్ స్టేషన్లకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. ఇది అత్యంత అప్రజాస్వామిక చర్య అని తెలిపారు. ఈ చర్యను ఖండిస్తున్నామని పేర్కొన్నారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఇందిరా పార్కు వద్ద ధర్నాకు శనివారం కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిస్తే హైదరాబాద్‌లో అనుమతిచ్చి.. కొత్తగూడెం, ఇల్లందు, సంగారెడ్డి ప్రాంతాల్లో కార్మికులను అరెస్టులు చేశారని గుర్తుచేశారు. 24న మధ్యాహ్న భోజనం కార్మికుల ధర్నాకు అనుమతిచ్చారనీ, జిల్లాల్లో ముందు నుంచే అరెస్టుల పర్వం కొనసాగుతున్నదని తెలిపారు. హైదరాబాద్‌లో ఇప్పటికే 144 సెక్షన్ విధించారనీ, రాష్ట్రమంతా అన్ని జిల్లాల్లో పోలీస్ యాక్ట్-30ని అమలు చేస్తున్నారని వాపోయారు. ఉస్మానియా యూనివర్సిటీలో సైతం ధర్నాలు, నిరసనలు నిషేధిస్తూ వైస్ చాన్సలర్ ఆదేశాలు జారీ చేశారని గుర్తుచేశారు. ఈ అంశాలన్నీ తీవ్ర ఆందోళన కల్గిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యయుతంగా పరిపాలన సాగిస్తానని చెప్పిన మీరు ఆచరణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం లాగే కార్మిక పోరాటాలు-ఆందోళనలపై నిర్బంధం, ఆంక్షలు విధించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రజాతంత్ర హక్కులను పరిరక్షించాలనీ, రాష్ట్రంలో కార్మికవర్గ పోరాటాల పట్ల వ్యవహరిస్తున్న తీరు మార్చుకోవాలని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న నిర్బంధాన్ని, ఆంక్షలను ఎత్తేయాలని విజ్ఞప్తి చేశారు.

గాజాలో ఆగని మృత్యుఘోష..

(మొదటిపేజీ తరువాయి)

మొదలుకాగా.. వీటిలో దాదాపు 673 మంది చనిపోయారు. అయితే, మొత్తం మరణించిన వారిలో సామాన్య పౌరులు, యుద్ధంలో పాల్గొన్న వారు ఎంతమంది ఉన్నారనే విషయంపై గాజా ఆరోగ్యశాఖ స్పష్టత ఇవ్వలేదు. అయితే, ఇజ్రాయెల్ మాత్రం దాదాపు 20వేల మంది మిలిటెంట్లను చంపినట్టు పేర్కొంది.

కాల్పుల విరమణ ముగిసిన తర్వాత మళ్లీ దాడులు మొదలుపెట్టిన ఇజ్రాయిల్.. తాజాగా దక్షిణ గాజాపై భీకర దాడులకు పాల్పడుతోంది. శనివారం రాత్రి జరిపిన దాడుల్లో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. హమాస్ రాజకీయ నేత సహా పలువురు మహిళలు, చిన్నారులు చనిపోయారు. రఫా నగరాన్ని ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ సైన్యం ఇప్పటికే ఆదేశించింది. దీంతో పాలస్తీనావాసులు తమ సామగ్రిని పట్టుకొని దుమ్ము రోడ్లపై బారులు తీరిన పరిస్థితి కనిపించింది.

రాయల్స్‌పై సన్‌రైజర్స్ సూపర్ విక్టరీ

286 కొట్టగా.. ఉప్పల్ హోరెత్తగా!

- అజేయ సెంచరీతో చెలరేగిన ఇషాన్ కిషన్
- దంచికొట్టిన ట్రావిశ్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్

ఉప్పల్ ఊగిపోయింది. సన్‌రైజర్స్ బ్యాటర్లు ఫోర్లు, సిక్సర్ల వర్షంతో రాయల్స్ బౌలర్లపై పిడుగుపాటులా విరుచుకుపడ్డారు. బౌండరీలే లక్ష్యం, బాదటమే మార్గం అన్నట్టు ఇషాన్ కిషన్ (106 నాటౌట్), ట్రావిశ్ హెడ్ (67) చెలరేగారు.

ఐపీఎల్ సీజన్ మారింది. సన్‌రైజర్స్ శిబిరంలో ఆటగాళ్లు సైతం మారారు. కానీ ఆరెంజ్ ఆర్మీ ఊచకోత ఏమాత్రం మారలేదు. తొలి బంతి, ఆఖరు బంతి వరకు దంచికొట్టిన సన్‌రైజర్స్ బ్యాటర్లు ఉప్పల్‌లో పరుగుల సునామీ సృష్టించారు. పరుగుల వరద పారిన ఉప్పల్ స్టేడియంలో సిక్సర్ల సునామీతో సన్‌రైజర్స్ తొలుత 286 పరుగుల భారీ స్కోరు చేయగా... ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ 242 పరుగులు చేసినా.. హైదరాబాద్ 44 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

నవతెలంగాణ-హైదరాబాద్

పరుగుల వరద చూసిన ఉప్పల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ 44 పరుగుల తేడాతో గెలుపొందింది. సన్‌రైజర్స్ బ్యాటర్లు ఇషాన్ కిషన్ (106 నాటౌట్, 47 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్స్‌లు) సెంచరీతో, ట్రావిశ్ హెడ్ (67, 31 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్థ సెంచరీతో విశ్వరూపం చూపించారు. నితీశ్ కుమార్ రెడ్డి (30, 15 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), హెన్రిచ్ క్లాసెన్ (34, 14 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) అదరగొట్టారు. రికార్డు ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ 20 ఓవర్లలో 242 పరుగులే చేసింది. ధ్రువ్ జురెల్ (70, 35 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లు), సంజు శాంసన్ (66, 37 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో మెరువగా.. హెట్‌మయర్ (42, 23 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు), శుభమ్ దూబె (34 నాటౌట్, 11 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు) ధనాధన్ షో చేశారు. సెంచరీ హీరో ఇషాన్ కిషన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

పవర్‌ఫుల్ షో

ఓపెనర్లు అభిషేక్ శర్మ (24, 11 బంతుల్లో 5 ఫోర్లు), ట్రావిశ్ హెడ్ (67) సీజన్ తొలి మ్యాచ్‌లోనే తమదైన బాదుడు చూపించారు. ట్రావిషేక్ జోడీ 19 బంతుల్లోనే 45 పరుగులు పిండుకుంది. పేసర్ ఫరూకీపై విరుచుకుపడిన అభిషేక్ ఐదు బౌండరీలతో దండెత్తాడు. స్పిన్నర్ తీక్షణ మాయకు అభిషేక్ నిష్క్రమించినా.. పవర్ షో ఆగలేదు. ఇషాన్ కిషన్ (106 నాటౌట్)తో కలిసి హెడ్ ఊచకోత కొనసాగించాడు. తీక్షణపై నాలుగు ఫోర్లు బాదిన హెడ్.. ఏ బౌలర్‌ను వదిలిపెట్టలేదు. ఆరు సిక్సర్లు కొట్టిన హెడ్.. కౌవ్ కార్నర్, లాంగ్ ఆన్, బ్యాక్‌వర్డ్ పాయింట్ సహా ఆరు భిన్న కోణాల్లో బంతిని ఫెన్సింగ్ దాటించాడు. 23 బంతుల్లోనే 50 పరుగులు చేసిన హైదరాబాద్... 42 బంతుల్లో 100 మార్క్ చేరింది. ట్రావిశ్ హెడ్ ఆరు ఫోర్లు, మూడు సిక్సర్లతో 21 బంతుల్లోనే అర్థ సెంచరీ సాధించాడు. దీంతో పవర్‌ప్లేలో (6 ఓవర్లు) సన్‌రైజర్స్ 94/1 పరుగులు చేసింది. ఐపీఎల్ చరిత్రలో ఇది ఐదో అత్యుత్తమ పవర్‌ప్లే స్కోరు.



ఇ'షాన్‌దార్' ఇన్నింగ్స్

తొలిసారి సన్‌రైజర్స్‌కు ఆడుతున్న ఇషాన్ కిషన్ (106 నాటౌట్) అదరగొట్టాడు. ప్రతి బంతిని బౌండరీ దాటించాలనే ఉత్సాహంతో కనిపించిన ఇషాన్.. అజేయ సెంచరీతో చెలరేగాడు. ట్రావిశ్ హెడ్‌తో కలిసి కిషన్ 38 బంతుల్లోనే 85 పరుగులు జోడించాడు. ఈ ఇద్దరు క్రీజులో ఉండగా సన్‌రైజర్స్ 300 కొడుతుందనే అంచనాలు బలంగా ఉన్నాయి. హెడ్ నిష్క్రమించినా.. కిషన్ దూకుడు తగ్గలేదు. తీక్షణపై ఐదు బౌండరీలు బాది.. జోఫ్రా ఆర్చర్‌కు చుక్కలు చూపించాడు. ఒకో ఓవర్లో ఆర్చర్‌పై మూడు సిక్స్‌లు సంధించాడు. సిక్సర్ల షో తరహాలో రెచ్చిపోయిన ఇషాన్ ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 25 బంతుల్లో అర్థ సెంచరీ పూర్తి చేశాడు. శతకం కోసం అతడు మరో 20 బంతులే తీసుకున్నాడు. మరో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 45 బంతుల్లోనే మూడంకెల స్కోరు అందుకున్నాడు. నితీశ్ కుమార్ రెడ్డి (30), హెన్రిచ్ క్లాసెన్ (34)లతో కలిసి కిషన్ కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు.

94/1 పవర్‌ప్లేలో సన్‌రైజర్స్ చేసిన స్కోరు. ఐపీఎల్ చరిత్రలో ఇది ఐదో అత్యుత్తమ పవర్‌ప్లే పరుగులు.

14 పరుగుల దూరంలో..!

గత సీజన్ తరహాలోనే తొలి మ్యాచ్‌ను సన్‌రైజర్స్ దూకుడుగా మొదలెట్టింది. ఐపీఎల్‌లో అత్యధిక స్కోరు రికార్డులు నిలకడగా బద్దలుకొడుతూనే ఉంది. 20 ఓవర్లలో 6 వికెట్లకు 286 పరుగులు చేసి.. 300 మార్క్‌కు 14 పరుగుల దూరంలో నిలిచిపోయింది. నితీశ్ కుమార్, హెన్రిచ్ క్లాసెన్‌లు అంచనాలను అందుకున్నారు. నాలుగు ఫోర్లు, ఓ సిక్సర్‌తో నితీశ్ దండెత్తగా.. క్లాసెన్ ఐదు ఫోర్లు, ఓ సిక్సర్‌తో శివమెత్తాడు. డెత్ ఓవర్లలో సన్‌రైజర్స్ వరుసగా వికెట్లు కోల్పోయింది. నితీశ్, క్లాసెన్ సహా అనికెత్ వర్మ (7, 3 బంతుల్లో 1 సిక్స్), అభినవ్ మనోహర్ (0) వికెట్ చేజార్చుకున్నారు. దీంతో సన్‌రైజర్స్ 300 మార్క్ అందుకోవటం ఈ మ్యాచ్‌లో సాధ్యపడలేదు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో తుషార్ దేశ్‌పాండే (3/44), మహీశ్ తీక్షణ (2/52) వికెట్లు తీసుకున్నారు. స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్ (0/76) అత్యంత చెత్త గణాంకాలు నమోదు చేశాడు.

రాయల్స్ పోరాడినా..

రికార్డు 287 పరుగుల ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ పోరాడినా ఫలితం దక్కలేదు.సన్‌రైజర్స్ పేసర్ సిమర్‌జిత్ సింగ్ ఆరంభంలోనే రెండు వికెట్లు పడగొట్టాడు. యశస్వి జైస్వాల్ (1), రియాన్ పరాగ్ (4)లను సాగనంపాడు. నితీశ్ రానా (11)ను మహ్మద్ షమి డగౌట్‌కు చేర్చాడు. పవర్‌ప్లేలో మూడు వికెట్లు కోల్పోయిన రాయల్స్ ఛేదనలో గాడి వదిలేసినట్టే కనిపించింది. కానీ ఇంపాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన సంజు శాంసన్ (66) ఉప్పల్‌లో రికార్డు కొనసాగించాడు. 37 బంతుల్లోనే 4 ఫోర్లు, 7 సిక్సర్లతో 66 పరుగులు పిండుకున్నాడు. వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ (70)తో కలిసి కీలక భాగస్వామ్యం నిర్మించాడు. 60 బంతుల్లోనే ఈ జోడీ 111 పరుగులు సాధించింది. కానీ సాధించాల్సిన రన్‌రేట్ భారీగా పెరగటంతో బ్యాటర్లపై ఒత్తిడి పడింది. ఆఖర్లో షిమ్రోన్ హెట్‌మయర్ (42), శుభమ్ దూబె (34 నాటౌట్) ధనాధన్ దంచికొట్టారు. 34 బంతుల్లోనే 80 పరుగులు కొట్టారు. రాయల్స్ ఓటమి వ్యత్యాసం తగ్గించగలిగారు. 20 ఓవర్లలో 6 వికెట్లకు రాయల్స్ 242 పరుగులు చేసింది. 44 పరుగుల తేడాతో హైదరాబాద్ ఘన విజయం సాధించింది. సన్‌రైజర్స్ బౌలర్లలో హర్షల్ పటేల్ (2/34), సిమర్‌జిత్ సింగ్ (2/46), జంపా (1/48), షమి (1/33) రాణించారు.

76/0 జోఫ్రా ఆర్చర్ బౌలింగ్ గణాంకాలు. ఐపీఎల్ చరిత్రలోనే ఓ బౌలర్‌కు ఇవే అత్యంత చెత్త గణాంకాలు. ఏడాది తర్వాత ఐపీఎల్‌లో రీ ఎంట్రీ ఇచ్చిన ఆర్చర్‌కు సన్‌రైజర్స్ బ్యాటర్లు చుక్కలు చూపించారు.

స్కోరు వివరాలు :

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్ : అభిషేక్ శర్మ (సి) జైస్వాల్ (బి) తీక్షణ 24, ట్రావిశ్ హెడ్ (సి) హెట్‌మయర్ (బి) దేశ్‌పాండే 67, ఇషాన్ కిషన్ నాటౌట్ 106, నితీశ్ కుమార్ (సి) జైస్వాల్ (బి) తీక్షణ 30, హెన్రిచ్ క్లాసెన్ (సి) పరాగ్ (బి) సందీప్ 34, అనికెత్ వర్మ (సి) ఆర్చర్ (బి) దేశ్‌పాండే 7, అభినవ్ మనోహర్ (సి) పరాగ్ (బి) దేశ్‌పాండే 0, పాట్ కమిన్స్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 18, **మొత్తం : (20 ఓవర్లలో 6 వికెట్లకు) 286.**

వికెట్ల పతనం : 1-45, 2-130, 3-202, 4-258, 5-279, 6-279.

బౌలింగ్ : ఫరూకీ 3-0-49-0, మహీశ్ తీక్షణ 4-0-52-2, జోఫ్రా ఆర్చర్ 4-0-76-0, సందీప్ శర్మ 4-0-51-1, నితీశ్ రానా 1-0-9-0, తుషార్ దేశ్‌పాండే 4-0-44-3.

రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్ : యశస్వి జైస్వాల్ (సి) మనోహర్ (బి) సిమర్‌జిత్ సింగ్ 1, సంజు శాంసన్ (సి) క్లాసెన్ (బి) హర్షల్ 66, రియాన్ పరాగ్ (సి) కమిన్స్ (బి) సిమర్‌జిత్ సింగ్ 4, నితీశ్ రానా (సి) కమిన్స్ (బి) షమి 11, జురెల్ (సి) ఇషాన్ (బి) జంపా 70, షిమ్రోన్ హెట్‌మయర్ (సి) మనోహర్ (బి) హర్షల్ 42, శుభమ్ దూబె నాటౌట్ 34, జోఫ్రా ఆర్చర్ నాటౌట్ 1, ఎక్స్‌ట్రాలు : 13, మొత్తం : (20 ఓవర్లలో 6 వికెట్లకు) 242.

వికెట్ల పతనం : 1-20, 2-24, 3-50, 4-161, 5-161, 6-241.

బౌలింగ్ : మహ్మద్ షమి 3-0-33-1, సిమర్‌జిత్ సింగ్ 3-0-46-2, పాట్ కమిన్స్ 4-0-60-0, అభిషేక్ శర్మ 2-0-17-0, ఆడం జంపా 4-0-48-1, హర్షల్ పటేల్ 4-0-34-2.

286 సన్‌రైజర్స్ హైదరాబాద్ చేసిన పరుగులు. గత సీజన్‌లో బెంగళూర్‌లో 287 పరుగులు చేసిన సన్‌రైజర్స్.. సీజన్ తొలి మ్యాచ్‌లో సొంతగడ్డపై తమ అత్యుత్తమ స్కోరు బాదారు. ఐపీఎల్‌లో ఇది రెండో అత్యుత్తమ స్కోరు.

నూర్ అహ్మద్ తిప్పేశాడు

ఛేదనలో రచిన్ రవీంద్ర మెరుపులు
ముంబయిపై చెన్నై ఘన విజయం

నవతెలంగాణ-చెన్నై



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఐదుసార్లు చాంపియన్లు చెన్నై సూపర్ కింగ్స్, ముంబయి ఇండియన్స్ మహా పోరులో సూపర్‌కింగ్స్ ఘన విజయం సాధించింది. ఛేదనలో రచిన్ రవీంద్ర (65 నాటౌట్, 45 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (53, 26 బంతుల్లో 6 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్థ సెంచరీలతో మెరవటంతో 156 పరుగుల లక్ష్యాన్ని చెన్నై సూపర్‌కింగ్స్ 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. రాహుల్ త్రిపాఠి (2), శివం దూబె (9), దీపక్ హుడా (3), శామ్ కరణ్ (4) వికెట్లతో ముంబయి ఇండియన్స్ రేసులోకి వచ్చినా.. రవీంద్ర జడేజా (17, 18 బంతుల్లో 1 ఫోర్లు) తోడుగా రచిన్ రవీంద్ర సూపర్‌కింగ్స్‌ను గెలుపు తీరాలకు చేర్చాడు. ఆఖర్లో ఎం.ఎస్ ధోని (0 నాటౌట్) క్రీజులోకి వచ్చి అభిమానులకు కిక్ ఇవ్వగా.. సిక్సర్‌తో రచిన్ రవీంద్ర లాంఛనం ముగించాడు. మరో ఐదు బంతులు ఉండగానే చెన్నై 4 వికెట్ల తేడాతో గెలుపొంది. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి ఇండియన్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులు చేసింది. నూర్ అహ్మద్ (4/18), పేసర్ ఖలీల్ అహ్మద్ (3/29) వికెట్లలో మెరిశారు. తిలక్ వర్మ (31, 25 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), సూర్య కుమార్ యాదవ్ (29, 26 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), దీపక్ చాహర్ (28 నాటౌట్, 15 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు.

స్పిన్‌కు విలవిల :


టాస్ నెగ్గిన చెన్నై సూపర్ కింగ్స్ సొంతగడ్డపై తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు వచ్చిన ముంబయి ఇండియన్స్‌కు పవర్‌ప్లేలోనే కోలుకోలేని ఎదురుదెబ్బ తగిలింది. సూపర్‌కింగ్స్ పేసర్ ఖలీల్ అహ్మద్ ఇన్నింగ్స్ నాల్గో బంతికే బ్రేక్ సాధించాడు. ఓపెనర్ రోహిత్ శర్మ (0)ను అవుట్ చేసి చెపాక్ స్టేడియానికి ఊపుతెచ్చాడు. మరో ఓపెనర్ రియాన్ రికెల్టన్ (13)ను



క్లీన్‌బౌల్డ్ చేసిన ఖలీల్... డబుల్ స్ట్రయిక్‌తో ముంబయిని దెబ్బతీశాడు. పవర్‌ప్లేలో బంతి అందుకున్న స్పిన్నర్ అశ్విన్ సైతం మాయ చేశాడు. విల్ జాక్స్ (11) వికెట్ పడగొట్టాడు. దీంతో పవర్‌ప్లేలోనే ముంబయి మూడు వికెట్లు చేజార్చుకుంది. ఈ సమయంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (29), తిలక్ వర్మ (31) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. తిలక్ రెండేసి ఫోర్లు, సిక్సర్లు బాదగా.. సూర్యకుమార్ రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో మెరిశాడు. మణికట్టు స్పిన్నర్ నూర్ అహ్మద్ ఈ ఇద్దరు బ్యాటర్లను సాగనంపాడు. ధోని వికెట్ కీపింగ్ మ్యాజిక్‌తో సూర్యకుమార్ అవుటవగా.. తిలక్‌ను ఎల్బీగా వెనక్కి పంపాడు. నమన్ ధిర్ (17), రాబిన్ మింజ్ (3) సైతం నూర్ మాయలో పడ్డారు. ఆఖర్లో దీపక్ చాహర్ (28 నాటౌట్) మెరుపులతో ముంబయి ఇండియన్స్ 150 పరుగుల మార్క్ చేరుకుంది.

నవచిత్రం

పక్కా యాక్షన్ ఎంటర్‌టైనర్


యష్


యష్ నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్'. ఈ మూవీని వచ్చే ఏడాది మార్చి 19న విడుదల చేయబోతున్నట్టుగా మేకర్స్ ప్రకటించారు. ఉగాది, గుడి పడ్వాతో మార్చి 19న కొత్త సంవత్సరాన్ని ప్రారంభించడంతో పాటు మార్చి 20,21న ఈద్ వేడుకలతో ఈ సినిమా భారతదేశం అంతటా సందడి చేయనుంది.
కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో ఈ మూవీని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ కాబోతోంది. భారతీయ ప్రాజెక్ట్‌గా ఇది ఇంటర్నేషనల్ సినిమాటిక్ అనుభవాన్ని అందించనుంది.
ఈ చిత్రం భారతీయ, అంతర్జాతీయ సినిమా రంగం నుంచి ఎంతో అనుభవం, ప్రతిభ ఉన్న వారినందరినీ ఒకే చోటకు చేర్చనుంది. ఈ చిత్రాన్ని హిందీ, తెలుగు, తమిళం, మలయాళంతో పాటు ఇతర భాషల్లోకీ డబ్ చేయనున్నారు.
సినిమా విడుదల తేదీ ప్రకటన సందర్భంగా ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. పోస్టర్‌లో కనిపించే మంటలు, చుట్టూ ఉన్న పొగ, హీరోని చూపించిన తీరు, ఆ గన్‌ను పట్టుకున్న విధానం, హీరో పెట్టుకున్న టోపీ ఇలా అన్నీ కూడా ఎంతో స్టైలిష్‌గా ఉన్నాయి. యష్ పుట్టిన రోజు సందర్భంగా రిలీజ్ చేసిన గ్లింప్స్ నేషనల్, ఇంటర్నేషనల్ వైడ్‌గా ఎంత వైరల్ అయిందో అందరికీ తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మక వెంచర్‌కు అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన మేకర్ గీతు మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ పతాకాలపై వెంకట్ కె. నారాయణ, యష్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.


విజయ్ దేవరకొండ

'కింగ్ డమ్' కోసం..

హీరో విజయ్ దేవరకొండ తన కొత్త సినిమా 'కింగ్ డమ్' సాంగ్ చిత్రీకరణ కోసం శ్రీలంక వెళ్తున్నారు. ఈ సినిమాలోని ఓ లవ్ సాంగ్‌ను ఈ షెడ్యూల్‌లో చిత్రీకరించనున్నారు. వారం రోజుల పాటు ఈ షెడ్యూల్ జరుగనుంది.
లవ్ సాంగ్స్ చేయడంలో మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ స్పెషాలిటీ అందరికీ తెలిసిందే. ఈ సినిమాలోని లవ్ సాంగ్స్‌కు కూడా ఆయన బ్లాక్‌బస్టర్ ట్యూన్స్ రెడీ చేశారు. శ్రీలంక వెళ్తున్న విజయ్ దేవరకొండ ఎయిర్ పోర్ట్ పిక్స్ వైరల్ అవుతున్నాయి. రౌడీ ట్రెండీ సమ్మర్ వేర్‌లో స్టైల్ ఐకాన్‌గా కనిపిస్తున్నారు ఆయన. రీసెంట్‌గా రిలీజ్ చేసిన ఈ చిత్ర టీజర్ హ్యూజ్ రెస్పాన్స్ దక్కించుకుంది. ఏఐతో వీడియోతో రిలీజ్ చేసిన టీజర్ ఒరిజినల్ సౌండ్ ట్రాక్‌కు కూడా భారీ స్పందన వచ్చింది.
ఈ చిత్రాన్ని యంగ్ డైరెక్టర్ గౌతమ్ తిన్ననూరి రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో విజయ్ దేవరకొండ సరికొత్తగా కనిపించనున్నారు. ఆయన గతంలో నటించిన సినిమాలతో పోలిస్తే అటు కథాపరంగా, ఇటు ఆయన పాత్రపరంగా చాలా భిన్నంగా ఉంటాయి అని చిత్ర యూనిట్ తెలిపింది.
శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్ పై నాగవంశీ, సాయి సౌజన్య భారీ పాన్ ఇండియా చిత్రంగా నిర్మిస్తున్నారు. మే 30న ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది.

'బ్రిటీషు'గా శ్రీకాంత్


శ్రీకాంత్

హీరో సాయి దుర్గ తేజ్ నటిస్తున్న మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'సంబరాల యేటిగట్టు'. నూతన దర్శకుడు రోహిత్ కెపి దర్శకత్వం వహించిన ఈ యాక్షన్-ప్యాక్డ్ థ్రిల్లర్‌లో సాయి దుర్గ తేజ్ నెవెర్ బిఫోర్ అవతార్‌లో కనిపించనున్నారు. బ్లాక్‌బస్టర్ 'హనుమాన్'తో భారీ విజయం సాధించిన తర్వాత ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.
ఈ చిత్రంలో శ్రీకాంత్ ఇంపార్టెంట్ రోల్ పోషిస్తున్నారు. ఆదివారం శ్రీకాంత్ బర్త్ డే. ఈ సందర్భంగా విషెష్ అందిస్తూ మేకర్స్ శ్రీకాంత్‌ని బ్రిటీషు పాత్రలో పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. రగ్గడ్ హెయిర్, గడ్డంతో బ్లాక్ కోట్ ధరించి ఫెరోషియస్‌గా కనిపించిన శ్రీకాంత్ లుక్ అదిరిపోయింది. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పటికే విడుదలైన కార్నేజ్ టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్‌తో ఈ సినిమాపై బజ్ నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్ళింది.
ప్రస్తుతం చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది. త్వరలోనే పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను కూడా పూర్తి చేసి, ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో పాన్ ఇండియా రిలీజ్ చేస్తాం అని మేకర్స్ తెలిపారు.


అనుపమ పరమేశ్వరన్

'మా అందాల సిరి..'

తన తొలి సినిమా 'సినిమా బండి'తో ప్రశంసలు అందుకున్న దర్శకుడు ప్రవీణ్ కండ్రేగుల తాజాగా 'పరదా'తో వస్తున్నారు.
అనుపమ పరమేశ్వరన్, దర్శన రాజేంద్రన్, సంగీత వంటి తారాగణం ఈ చిత్రంలో నటిస్తున్నారు. 'ఫ్యామిలీ మ్యాన్' సిరీస్‌తో పాపులరైన రాజ్, డికె ఈ చిత్రానికి మద్దతు ఇస్తున్నారు. ఆనంద మీడియా బ్యానర్ పై శ్రీనివాసులు పివి, శ్రీధర్ మక్కువతో కలిసి విజయ్ డొంకడ ఈ సినిమాని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదల ఫస్ట్‌లుక్ పోస్టర్, కాన్సెప్ట్ వీడియో, సినిమా టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.
ఆదివారం మేకర్స్ 'మా అందాల సిరి..' సాంగ్‌ని రిలీజ్ చేసి, మ్యూజిక్ ప్రమోషన్స్ స్టార్ చేశారు. గోపీ సుందర్ ఈ సాంగ్‌ని క్యాచీ బీట్స్‌తో, బ్యూటీఫుల్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. శ్రీ కృష్ణ, రమ్య బెహరా వోకల్స్ పాటకి మరింత ఆకర్షణ తీసుకొచ్చాయి. వనమాలి రాసిన మీనింగ్ ఫుల్ లిరిక్స్ ఆకట్టుకున్నాయి. ట్రెడిషన్ ఉట్టిపడే ఈ సాంగ్‌లో విజువల్స్ ప్లజెంట్‌గా ఉన్నాయి. అనుపమ పరమేశ్వరన్ ఎలిగెంట్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇన్‌స్టంట్ హిట్‌గా నిలిచిన ఈ సాంగ్ ఆల్బమ్‌కు చార్ట్ బస్టర్ స్టార్ట్‌ని అందించింది అని చిత్ర యూనిట్ తెలిపింది.

అలరించే జానపద గీతం 'గోదారికే సోగ్గాన్నే'

విష్ణు మంచు ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలోని అవా మ్యూజిక్ బ్యానర్‌పై శివ బాలాజీ, మధుమిత సంయుక్తంగా నటించిన జానపద గీతం 'గోదారికే సోగ్గాన్నే'.
రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్లో ఈ పాటను విడుదల చేశారు. ఈ గీతం విడుదల సందర్భంగా శివ బాలాజీ, మధుమిత మీడియాతో ముచ్చటించారు.
ఈ సందర్భంగా శివ బాలాజీ మాట్లాడుతూ,'ఈ పాటలో కంటెంట్ 8 నిమిషాలు ఉంటుంది. పాటలోనే కథ మొత్తం చెప్పాలి. ఈ కాన్సెప్ట్‌కి మ్యూజికల్ నెరేషన్ అని పేరు పెట్టాను. ముందుగా మేం నటిస్తామని అనుకోలేదు. ఈ కాన్సెప్ట్ నా వద్దకు వచ్చింది. ఆ తరువాత మధుమిత ప్రాజెక్ట్‌లోకి వచ్చారు. మేం ఇద్దరం సింగిల్ టేక్‌లో చేశాం. సెట్స్ మీద చాలా ఇంప్రవైజ్ చేశాం. ఏ షాట్‌కి కూడా కష్టపడలేదు. ఈ పాటకు రెండు క్లైమాక్స్‌లను ప్లాన్ చేశాం. పాట అద్భుతంగా వచ్చింది. అందరికీ నచ్చుతుంది' అని అన్నారు.


మధుమిత, శివ బాలాజీ

'సోషల్ మీడియాలోని ఇన్ ఫ్లూయెన్సర్ టాలెంట్‌ను మరింతగా బయటకు తీసుకురావాలనే ఉద్దేశంతో ఈ మ్యూజికల్ ఆల్బమ్స్‌ను స్టార్ట్ చేశారు. ఈ క్రమంలో నా వద్దకు ఈ పాట వచ్చింది. కాన్సెప్ట్ చెప్పినప్పుడు నాకు చాలా నచ్చింది. జంటగా మమ్మల్ని అందరూ ప్రేమిస్తుంటారు. మళ్లీ ఇన్నేళ్ల తరువాత ఇలాంటి పాటతో జంటగా అందరి ముందుకు రాబోతున్నాం. ఇందులో మాట్లాడిన గోదారి యాస కూడా అద్భుతంగా అనిపిస్తుంది. అందరినీ ఆకట్టుకునేలా ఈ పాట ఉంటుంది' అని మధుమిత చెప్పారు. అవా ఎంటర్టైన్మెంట్ సీఈఓ చిదంబరం మాట్లాడుతూ, 'మంచు మోహన్ బాబు, విష్ణు యంగ్ టాలెంట్‌ను ఎంకరేజ్ చేసే క్రమంలో అవా మ్యూజిక్‌ను ప్రారంభించారు. మున్ముందు మరింత కంటెంట్ మా నుంచి రాబోతోంది. మా పాటలో నటించిన శివ బాలాజీ, మధుమితకి థ్యాంక్స్' అని అన్నారు.
'ఈ పాట అద్భుతంగా వచ్చింది. ఇందులోని యాస, విజువల్స్, నటించిన శివ బాలాజీ, మధుమిత.. అన్నీ అద్భుతం అని చెప్పొచ్చు. ఈ పాట అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది' అని బుక్ మై షో వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ పాలడుగు చెప్పారు.

మంచి సందేశాత్మక చిత్రం

ఇంద్రజ, అజయ్, జయసుధ, సుమన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'సీఎం పెళ్లాం'. ఈ చిత్రాన్ని ఆర్.కే సినిమాస్ బ్యానర్ పై బొల్లా రామకృష్ణ నిర్మిస్తున్నారు. దర్శకుడు గడ్డం రమణా రెడ్డి రూపొందిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది.
ఈ నేపథ్యంలో ఈ సినిమా ప్రమోషనల్ సాంగ్ లాంచ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా నిర్మాత బొల్లా రామకృష్ణ మాట్లాడుతూ, 'రాజకీయ నేపథ్యంతో సాగే మంచి సందేశాత్మక చిత్రమిది. సీఎంగా అజయ్, ఆయన భార్య పాత్రలో ఇంద్రజ నటన ఆకట్టుకుంటుంది. మా మూవీ ప్రమోషనల్ సాంగ్ రిలీజ్ చేశాం. హైదరాబాద్ నగరం గురించి చేసిన ఈ పాట మీ అందరికీ నచ్చుతుంది. త్వరలోనే మా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని అన్నారు.
నటుడు అజయ్ మాట్లాడుతూ, 'ఈ సాంగ్ చూశాక చాలా ఎమోషనల్ అయ్యాను. ఈ చిత్రంలో నటించే అవకాశం రావడం హ్యాపీగా ఉంది. నేను సీఎంగా నటిస్తే, నా భార్య పాత్రలో ఇంద్రజ చేశారు. ఆమెతో కలిసి నటించడం సంతోషంగా ఉంది. మా డైరెక్టర్ గడ్డం రమణా రెడ్డికి ఈ సినిమాతో మంచి పేరొస్తుంది. ఈ సినిమా మీ అందరికీ నచ్చేలా ఉంటుందని చెప్పగలను' అని చెప్పారు.



అజయ్, ఇంద్రజ

'ఈ సినిమా ఒక మంచి సోషల్ కాన్సెప్ట్‌తో వస్తోంది. సీఎం పెళ్లాం బయటకు వస్తే ఎలా ఉంటుంది అనేది ఈ సినిమాలో మా డైరెక్టర్ చక్కగా చూపించారు. ఎంటర్‌టైన్‌మెంట్ ఇస్తూనే ఆలోచింపజేసే చిత్రమిది. ఈ చిత్రంలోని సీన్స్‌కు మీరంతా కనెక్ట్ అవుతారు. మీ రియల్ లైఫ్‌లో చూసినవి, విన్నవి, జరిగిన ఇన్సిడెంట్స్ ఈ మూవీలో చూస్తారు. ప్రేక్షకులు మా చిత్రానికి విజయాన్ని అందిస్తారని కోరుకుంటున్నా' అని నటి ఇంద్రజ చెప్పారు.
దర్శకుడు గడ్డం రమణా రెడ్డి మాట్లాడుతూ, 'మా మూవీలో సీఎం పెళ్లాం బయటకు వస్తే ఎలా ఉంటుందో చూపిస్తున్నాం. సామాజిక నేపథ్యమున్న చిత్రమిది. మంచి మెసేజ్ ఉంటుంది. ఎంటర్‌టైన్‌మెంటూ ఉంటుంది. అలాగే అందర్నీ ఆలోచింపజేస్తుంది' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ఉల్లిపై 20 శాతం ఎగుమతి సుంకం ఉపసంహరణ

ఎగుమతుల పెంపు, ధరల స్థిరీకరించటానికే ఈ చర్య..కేంద్రం

న్యూఢిల్లీ : ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న ఉల్లిపాయలపై 20శాతం ఎగుమతి సుంకాన్ని ఉపసంహరించుకుంటున్నట్టు కేంద్రం ప్రకటించింది. ఎగుమతులను పెంచడం, ధరలను స్థిరీకరించడం లక్ష్యంగా సుంకాన్ని ఎత్తివేసినట్టు శనివారం రెవెన్యూ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.ఉత్తర్వుల్లో పేర్కొంది. ఉల్లి ఎగుమతులపై నిషేధాన్ని (2023 డిసెంబర్‌లో విధించిన) కేంద్రం గతేడాది మేలో రద్దు చేసిన సంగతి తెలిసిందే. కానీ 40శాతం ఎగుమతి సుంకంతో పాటు టన్నుకు 550 డాలర్ల కనీస ఎగుమతి ధర (ఎంఇపి)ని ప్రవేశపెట్టింది. గతేడాది సెప్టెంబర్‌లో ఎగుమతి సుంకాన్ని 20 శాతానికి తగ్గిస్తూ, ఎంఈపీని రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. ఈ పరిమితులతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉల్లి ఎగుమతులు 1.16 మిలియన్ టన్నులకు మాత్రమే చేరుకున్నాయి. గతేడాది ఉల్లి ఎగుమతులు 1.71 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో భారత్ 473.7 మిలియన్ డాలర్ల విలువైన ఉల్లిని ఎగుమతి చేసింది. ముఖ్యంగా బంగ్లాదేశ్‌కు - 40శాతం, మలేషియా 14 శాతం, శ్రీలంక 10 శాతం, యూఏఈ 9శాతం, నేపాల్ 4 శాతం, ఇతర పొరుగు రాష్ట్రాలకు 18శాతం ఎగుమతి అయ్యాయి.అయితే 2023 డిసెంబర్‌లో భారత ప్రభుత్వం ఎగుమతి నిషేధం విధించిన తర్వాత, నెలవారీ ఉల్లి ఎగుమతుల విలువ 2023 నవంబర్‌లో 100 మిలియన్ డాలర్ల నుండి 2024 జనవరిలో కేవలం 11 మిలియన్ డాలర్లకు పడిపోయింది. దీంతో పాకిస్థాన్ మార్కెట్ వాటా నష్టపోయింది.మార్కెట్లోకి రబీ పంట రాకతో, పెరిగిన సరఫరా ధరలను మరింత తగ్గించే అవకాశం ఉందని, ఇది రైతుల ఆదాయాలను తగ్గించి, మరింత ఇబ్బందులకు గురిచేస్తుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఎగుమతి సుంకం తొలగింపు చర్య ధరలలో తగ్గుదలను నివారిస్తుందని, ఎగుమతులను పెంచుతుందని , మార్కెట్లో స్థిరత్వాన్ని నిర్ధారిస్తుందని లాసల్గావ్‌లోని వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ (ఏపీఎంసీ) డైరెక్టర్ జయదత్ హోల్కర్ పేర్కొన్నారు. శనివారం ఉల్లి రిటైల్ ధర కేజీ రూ.30కి తగ్గిందని, గత నెల కేజీ రూ.40గా ఉందని వినియోగదారుల వ్యవహారాల విభాగం పేర్కొంది. 2024-25 పంట సంవత్సరానికి రబీలో ఉల్లి ఉత్పత్తి గతేడాది పంట సంవత్సరం కంటే 22.7 మెట్రిక్ టన్నులు (18 శాతం ఎక్కువ) అధికంగా ఉంటుందని వ్యవసాయ మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. భారతదేశ మొత్తం ఉల్లి ఉత్పత్తిలో రబీ ఉల్లి పంట వాటా 70-75 శాతం వాటా కలిగి ఉంది. అక్టోబర్‌లో ఖరీఫ్ పంట వచ్చేవరకు సరఫరాను స్థిరంగా ఉంచుతుంది. అధిక తేమ స్థాయిలను కలిగి ఉండే ఖరీఫ్ ఉల్లి పంట మొత్తం ఉత్పత్తిలో 25 శాతం మాత్రమే వాటా కలిగి ఉంటుంది. దీంతో మార్చి వరకు దేశీయ డిమాండ్‌కు అనుగుణంగా నేరుగా మార్కెట్‌కు తరలిస్తారు.



అమృత్‌సర్‌లో హిమాచల్ ఆర్టీసీ బస్సుల ధ్వంసం

- ఖలిస్తానీ అనుకూల రాతలు




అమృత్‌సర్ : హిమాచల్‌ప్రదేశ్ ఆర్‌టిసి (హెచ్‌ఆర్టీసీ)కు చెందిన నాలుగు బస్సులను ధ్వంసం చేయడమే కాకుండా, వీటిపై ఖలిస్తానీ అనుకూల నినాదాలను రాసిన ఘటన పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో చోటు చేసుకుంది. శనివారం అమృత్‌సర్ బస్టాండ్‌లోని ఇంటర్ స్టేట్ బస్ టెర్మినల్ పార్కింగ్ స్థలంలో బస్సులు నిలిపి ఉన్న సమయంలో పార్క్ చేసి ఉన్న సమయంలో ఈ ఘటన జరిగిందని పోలీసులు ఆదివారం వెల్లడించారు. బస్సుల విండ్‌షీల్డ్, ఇతర అద్దాలను పగులకొట్టారని చెప్పారు, ఈ ఘటన సమయంలో బస్సులో ఎవ్వరూ లేరని, విచారణ కొనసాగుతుందని తెలిపారు. ఈ ఘటనపై హెచ్‌ఆర్టీసీ డివిజనల్ మేనేజర్ రాజ్ కుమార్ పాఠక్ మాట్లాడుతూ ఈ ధ్వంసమైన బస్సులు బిలాస్‌పూర్, డెహ్రా, ఉనాకు వెళ్లాల్సిఉందని చెప్పారు. రాష్ట్రంలోని మొహాలీ జిల్లాలోని ఖరార్‌లో కూడా గుర్తుతెలియని వ్యక్తులు హెచ్‌ఆర్టీసీ బస్సులను ధ్వంసం చేసిన కొన్ని రోజుల తరువాత అమృత్‌సర్‌లోనూ ఇలాంటి ఘటన జరగడం ఆందోళన కలిగిస్తుంది. ఈ ఘటనపై హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది.

పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వం తమ ప్రయాణీకుల భద్రత, బస్సుల రక్షణకు హామీ ఇచ్చేవరకూ రాత్రి పూట ఆ రాష్ట్రంలో తమ బస్సులను పార్క్ చేయమని హిమాచల్ ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రి ముకేశ్ అగ్నిహోత్రి ప్రకటించారు. పంజాబ్‌లోని దాదాపు 600 రూట్లలో తమ ఆర్టీసీ బస్సులు తిరుగుతున్నాయని చెప్పారు. 'హెచ్‌ఆర్టీసీ ఏ వివాదంలోనూ భాగస్వామి కాదు. మా బస్సులను లక్ష్యంగా చేసుకోవడం సరైనది కాదు. ఇది ప్రజా ఆస్తి. అయినా కానీ ఇప్పటికీ ఇటువంటి సంఘటనలు జరుగుతున్నాయి. మేము పంజాబ్ ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాము. ఈ విషయంలో మా డీజీపీ పంజాబ్ డీజీపీతో మాట్లాడారు' అని అగ్నిహోత్రి చెప్పారు.

కాగా, కొన్ని రోజుల క్రితం హిమాచల్‌ప్రదేశ్‌లోని కులు జిల్లాలోని మణికరణ్ బారియర్ వద్ద ఇరు రాష్ట్రాలకు చెందిన యువకుల మధ్య వాగ్వాదం జరిగిన తరువాత నుంచి ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అధికారులు భావిస్తున్నారు. పంజాబ్‌కు చెందిన యువకుల బృందం బైక్‌లపై ఉన్న ఉగ్రవాది జర్నైల్ సింగ్ బింద్రాన్‌వాలేతో కూడిన జెండాలను తొలగించారు. స్పెషల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ పేరుతో ద్విచక్ర వాహనాలపై రూ.50, నాలుగు చక్రాల వాహనాలపై రూ. 100 ఎంట్రీ ఫీజు విధించారు.

ఔరంగజేబును వ్యతిరేకించడం మతపరమైనది కాదు

- ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే



బెంగళూరు : మొఘల్ చక్రవర్తి ఔరంగజేబును వ్యతిరేకించడం మతపరమైదని కాదని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హోసబలే ఆదివారం చెప్పారు. అలాగే, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా జరిగింది స్వాతంత్ర్యం పోరాటమైతే, బ్రిటిష్ వారికంటే ముందు మనదేశాన్ని పాలించినవారికి వ్యతిరేకంగా జరిగింది కూడా ఒక స్వాతంత్ర్య పోరాటమేనని హోసబలే కొత్త భాష్యం చెప్పారు. బెంగళూరులో మూడు రోజుల పాటు జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ అత్యున్నత నిర్ణయాధికారం కలిగిన అఖిల భారతీయ ప్రతినిధి సభ (ఏబీపీఎస్) ముగింపు సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఔరంగజేబు సమాధిపై ప్రస్తుతం కొనసాగుతున్న వివాదంపై హోసబలే స్పందిస్తూ పై వ్యాఖ్యలు చేశారు. అలాగే, భారతదేశ నైతికతకు విరుద్ధమైన ఔరంగజేబును ఒక మతానికి ప్రతిరూపంగా చూపించడం సరైనదేనా అని హోసబలే ప్రశ్నించారు. ఒకవేళ అదే నిజమైతే, గంగా-జమున సంస్కృతిని సమర్థించేవారు ఔరంగజేబు అన్నయ్య దారా షికోను కూడా పూజించాలని ఎందుకు అనుకోరని ప్రశ్నించారు. ఔరంగజేబు ఔచిత్యాన్ని ప్రశ్నించే సంఘటనలు గతంలో కూడా జరిగాయని అన్నారు. దీనికి ఉదాహరణగా న్యూఢిల్లీలో 'ఔరంగజేబు రోడ్డు'ను అబ్దుల్ కలాం రోడ్డుగా మార్చడాన్ని ఆయన గుర్తుచేశారు. 'భారతదేశ నైతికతకు వ్యతిరేకంగా ఉన్న వ్యక్తిని మనం ప్రతిరూపంగా చూపిస్తామా లేదా ఈ భూమి సంప్రదాయాల ప్రకారం పనిచేసే వారితో కలిసి వెళ్తామా?' అని ఆయన ప్రశ్నించారు. 'ఔరంగజేబు వంటి వ్యక్తులను వ్యతిరేకించడం మతపరమైనది కాదు.. దేశం, దేశ ఐక్యత ప్రయోజనాల కోసం' అని అన్నారు. 1947లో మనం రాజకీయ స్వాతంత్ర్యం పొందినప్పటికీ, మానసిక వలసవాదం మనలో ఇంకా పోలేదని అన్నారు. అలాగే, ప్రభుత్వ కాంట్రాక్టులలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించాలనే కర్ణాటక ప్రభుత్వం నిర్ణయంపై ప్రశ్నించగా, ఇలాంటి రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని హోసబలే ఖండించారు. 'ప్రభుత్వం తీసుకున్న ఇటువంటి చర్యలు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ కోర్టులు చాలాసార్లు తిరస్కరించాయి. అయినా ఎవరైన ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే అది రాజ్యాంగ నిర్మాతల ఉద్దేశానికి విరుద్ధం' అని చెప్పారు.

నితీశ్‌కు ముస్లిం సంఘాల ఝులక్

- ఇఫ్తార్ విందు బహిష్కరణ

పాట్నా : బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌కు ఆ రాష్ట్రంలోని ఏడు ప్రధాన ముస్లిం సంఘాలు షాక్ ఇచ్చాయి. నితీశ్‌కుమార్ ఆదివారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందును బహిష్కరించాయి. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రతిపాదిత వక్ఫ్ సవరణ బిల్లుకు నితీశ్ పార్టీ జేడీ(యూ) మద్దతు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నాయి. ఈ విషయాన్ని నితీశ్‌కుమార్‌కు రాసిన లేఖలో వెల్లడించాయి. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు, ఇమారత్-ఎ-షరియా, జమియత్ ఉలామా-ఇ-హింద్, జమియత్ అహ్లె హదీస్, జమాల్-ఎ-ఇస్లామి హింద్, ఖాన్కా ముజిబియా, ఖాన్కా రెహ్మానీ అనే ప్రధాన ముస్లిం సంఘాలు ఈ లేఖ రాసాయి. 'మీరు లౌకిక ప్రభుత్వం, మైనార్టీల హక్కుల పరిరక్షణ హామీతో అధికారంలోకి వచ్చారు. కానీ బీజేపీతో మీ పొత్తు, అశాస్త్రీయమైన, రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ సవరణ బిల్లుకు మీ మద్దతు మీ హామీలను స్పష్టంగా ఉల్లంఘించాయి' అని లేఖలో విమర్శించాయి.

అలాగే, 'మీ ఇఫ్తార్ విందు ఉద్దేశం సద్భావన, విశ్వాసాన్ని పెంపొందించడమే అయినా.. విశ్వాసం కేవలం అధికారిక విందుల ద్వారా మాత్రమే కాదు, నిర్దిష్ట విధాన చర్యల ద్వారా కూడా నిర్మించబడుతుంది. ముస్లింల చట్టబద్ధమైన డిమాండ్లను మీ ప్రభుత్వం విస్మరించడం వల్ల ఇలాంటి అధికారిక విందులు అర్థరహితం అవుతాయి' అని లేఖలో విమర్శించాయి. కాగా, మరోవైపు ఇఫ్తార్ విందు బహిష్కరణ నిర్ణయం దురదృష్టకరమని బీహార్ సున్నీ వక్ఫ్ బోర్డు ఛైర్మెన్ ఇర్షదుల్లా తెలిపారు.

'ఇఫ్తార్ విందును బహిష్కరించాలని ఇస్లాం చెప్పదు. ఎవరైన ఇఫ్తార్ విందును ఏర్పాటు చేస్తుంటే ప్రజలు సంతోషంగా అంగీకరించాలి. ఇఫ్తార్‌పై రాజకీయాలు చేయడం సరైనది కాదు. ఇఫ్తార్ వేరు.. వక్ఫ్ సవరణ బిల్లు వేరు' అని ఇర్షాదుల్లా అన్నారు. ఆదివారం పాట్నాలోని 1 అన్నే మార్గ్‌లోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో ఇఫ్తార్ విందును నితీశ్‌కుమార్ ఏర్పాటు చేశారు. బహిష్కరణ ఉన్నప్పటికీ పెద్ద సంఖ్యలో ముస్లిం ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర గవర్నర్ ఆరీఫ్ మహమ్మద్ ఖాన్, ఉపముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి, ఇతర రాష్ట్ర మంత్రులు ఈ విందులో పాల్గొన్నారు.



పంజాబ్‌లో ఖాకీ జులుంకు వ్యతిరేకంగా

28న దేశవ్యాప్త నిరసనలు

- అన్ని జిల్లాల్లో నిరసనలకు ఎస్కేఎం పిలుపు
- ఎంఎస్‌పీ, రుణమాఫీ కోసం ఆందోళనలకు సిద్ధం కావాలి



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

పంజాబ్‌లో పోలీసుల అణచివేత చర్యలకు వ్యతిరేకంగా 28 దేశవ్యాప్త నిరసనలు చేపట్టాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) పిలుపు ఇచ్చింది. ఈ మేరకు ఆదివారం ఎస్కేఎం జాతీయ సమన్వయ కమిటీ ప్రకటన విడుదల చేసింది. ఆప్ నేతృత్వంలోని పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు, కార్పొరేట్ అనుకూల కేంద్ర ప్రభుత్వం ముందు లొంగిపోయిందని విమర్శించింది. పోలీసు అణచివేతకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉండాలని, నిరసన హక్కును కాపాడాలని అన్ని రైతు సంఘాలకు పిలుపు ఇచ్చింది. ఎన్‌పీఎఫ్ఏఎంకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళన జరగనుందని తెలిపింది. అలాగే సి2ం50 శాతంతో ఎంఎస్‌పీ, రుణమాఫీ వంటి డిమాండ్లపై కూడా రైతాంగం ఆందోళనలకు సిద్ధంగా ఉండాలని పిలుపు ఇచ్చింది.

భగవంత్ సింగ్ మాన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పంజాబ్ పోలీసులు జగ్జీత్ సింగ్ దల్లెవాల్, శ్రవాన్ సింగ్ పాంధర్‌లతో సహా 350 మంది రైతు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి జైలులో పెట్టారని విమర్శించింది. ఖానౌరి, శంభు సరిహద్దులలో ఆందోళన చేస్తున్న రైతుల గుడారాలను, వేదికలను పోలీసులు కూల్చివేసి, ట్రాక్టర్లు, ట్రాలీలు, ఇతర రైతులు యంత్రాలను బలవంతంగా తొలగించారని ధ్వజమెత్తింది. సి2ం50 శాతంతో ఎంఎస్‌పీ, రుణమాఫీ వంటి దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ల కోసం రైతు సంఘాలు పోరాడుతున్నాయని పేర్కొంది. ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో దేశంలో ప్రతిరోజూ 31 మంది రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపింది. కనుక రైతులను అప్పుల నుంచి విముక్తి చేయడంతో రైతుల పోరాటాన్ని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేసింది. గత పదేండ్లలో మోడీ ప్రభుత్వం రూ. 16 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలను మాఫీ చేసిందని, కానీ ఒక్క రూపాయి కూడా రైతు రుణాన్ని మాఫీ చేయలేదని పేర్కొంది.




దక్షిణాఫ్రికా నుంచి భారత్‌కు

మహాత్మా గాంధీ వస్తువులు, పత్రాలు

న్యూఢిల్లీ : మహాత్మా గాంధీకి చెందిన వస్తువులు, పత్రాలను దక్షిణాఫ్రికా నుంచి భారత్ అందుకున్నట్టు కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఆదివారం వెల్లడించారు. గాంధీ దక్షిణాఫ్రికాలో ఉన్న సమయంలో ఫీనిక్స్ సెటిల్‌మెంట్ ట్రస్ట్ - గాంధీ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (పీఎస్‌టీ-జీడీటీ)ను ఏర్పాటు చేశారు. డర్బన్‌కు సమీపంలోని ఇనాండా వద్ద 1904లో ఆశ్రమం లాంటి ఈ ట్రస్ట్‌ను స్థాపించారు. ఇక్కడ గాంధీ ఉపయోగించిన వస్తువులు, పత్రాలను దక్షిణాఫ్రికా తాజాగా అందచేసింది. న్యూఢిల్లీలోని గాంధీ మ్యూజియంలో వీటిని భద్రపర్చనున్నారు. ఈ వివరాలను జైశంకర్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు.

'1893 నుంచి 1914 వరకూ దక్షిణాఫ్రికాలో మహాత్మా గాంధీ అనుభవాలు ఆయన రాజకీయ భావజాలాన్ని రూపొందించడంలో కీలకమైనవి. ముఖ్యంగా సత్యాగ్రహ తత్వాన్ని రూపొందించడంలో ప్రధానమైనవి. దక్షిణాఫ్రికాలో జాతి వివక్ష, అన్యాయాన్ని ఎదుర్కొన్న గాంధీ, అణచివేత వ్యవస్థలను సవాలు చేయడానికి అహింసతో కూడిన నిరసన ప్రభావవంతమైన సాధనంగా ఉంటుందని గ్రహించారు. బాపు జీవితం, సందేశం రానున్న తరాలకు కూడా స్ఫూర్తినిస్తూనే ఉంటాయి' అని జైశంకర్ తన పోస్టులో పేర్కొన్నారు.



ఎన్నికల సంఘం

ఓ 'విఫల సంస్థ' : సిబాల్


న్యూఢిల్లీ : ఎన్నికల సంఘం ఓ అసమర్థమైన, విఫలమైన సంస్థగా మారిపోయిందని రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబాల్ వ్యాఖ్యానించారు. పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ "ఎన్నికల సంఘం తన రాజ్యాంగ బాధ్యతలను సరిగా నిర్వహించడంలో విఫలమైంది. దీనిపై ప్రజల నమ్మకం తగ్గడం వల్ల ప్రజాస్వామ్యం అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఈ సమస్యను వేగంగా పరిష్కరించాలి," అని అన్నారు. ఓటరు జాబితాలో పలు అక్రమాలు, అకస్మాత్తుగా పేర్ల తొలగింపు, నకిలీ ఓటరు ఐడిలు తదితర అంశాలపై కాంగ్రెస్, టిఎంసి తదితర పార్టీలు ఎన్నికల సమయంలో పలు ఆరోపణలు చేశాయి. ఎన్నికల ప్రక్రియ కలుషితమైందని, ఇవిఎంలతో పాటు ఇతర సమస్యలు కూడా ఉన్నాయని కపిల్ సిబాల్ వివరించారు. "ఎన్నికల ఫలితాలు అనేక స్థాయిలలో మార్పు చేసి ఉండవచ్చు. ఈ సమస్యను మనం కలిసి పరిష్కరించాలి," అని వ్యాఖ్యానించారు. ఓటరు జాబితాలో అక్రమాలపై కాంగ్రెస్ ఆరోపణలకు ప్రతిస్పందనగా, ఎన్నికల సంఘం యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యుఐడిఎఐ)తో సాంకేతిక సంప్రదింపులు జరపనున్నట్లు తెలిపింది. ఓటర్ ఐడీలను ఆధార్తో లింక్ చేయడం ద్వారా ఓటర్ల జాబితాలను సరిచేయాలని, దేశంలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పార్టీలతో సమావేశాలు జరిపి, సమస్యలను పరిష్కరించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఎన్నికల సంఘంపై ప్రజల నమ్మకం పునరుద్ధరించడానికి, పారదర్శకత, స్వతంత్రతను కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలని కపిల్ సిబాల్ డిమాండ్ చేశారు. "ఎన్నికల ప్రక్రియ కలుషితమైతే, ప్రజాస్వామ్యం అంతరించిపోయే ప్రమాదం ఉంది. కాబట్టి, ఈ సమస్యను తక్షణం పరిష్కరించాలి," అని ఆయన పేర్కొన్నారు.

'ఇండియా' పార్టీలకు సమన్వయ విధానం అవసరం

ఇండియా వేదికలో పార్టీలకు సమన్వయ విధానం, సైద్ధాంతిక చట్రం, భవిష్యత్తు కోసం ఒక కార్యక్రమం అవసరమని కపిల్ సిబాల్ పేర్కొన్నారు. ఇండియా బ్లాక్ ఒక కూటమిగా కనిపించాలని, పబ్లిక్ డొమైన్‌లో ఉన్నట్లు పార్టీలన్నీ విడివిడిగా ఉండకూడదని అన్నారు. రాష్ట్రస్థాయి లేదా జాతీయ స్థాయితో సంబంధం లేకుండా జాతీయంగా ప్రాముఖ్యత కలిగిన అంశాలపై పార్టీల ఆలోచనా విధానంలో సమన్వయం ఉండాలని, అందుకు తగిన యంత్రాంగాన్ని నిర్మించుకోవాలని అన్నారు. ఇండియా బ్లాక్ అభిప్రాయాన్ని వెల్లడించే తగిన ప్రతినిధి లేకపోతే ప్రభావవంతంగా ముందుకు సాగుతుందని తాను భావించడం లేదని అన్నారు. ప్రతిపక్ష పార్టీలకు భవిష్యత్తు ఉందని తాను భావిస్తున్నానని, అది ఏ రూపం తీసుకుంటుందో, ఏ నిర్మాణక్రమంలోకి మారుతుందో చూడాలని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టడంపై సైతం స్పందించారు. బిజెపికి మెజారిటీ లేనందున ఎన్‌డిఎ కూటమిలోని భాగస్వామ్య పార్టీల వైఖరి చూడాలని అన్నారు. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయని, దీంతో వక్ఫ్ బిల్లు ప్రభావం ఆ ఎన్నికలపై ఎలా ఉంటుందోనని బిజెపి ఆందోళన చెందుతోందని చెప్పారు.

ఏపీలో విద్వేషాలను

రెచ్చగొట్టేందుకు సర్వే



విశాఖ : ఉత్తరాంధ్ర ప్రాంతంలో విశ్వ హిందూ పరిషత్ ఒక సర్వే చేపట్టింది. ప్రధానంగా క్రైస్తవ మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని ఈ సర్వే జరుగుతోంది. ప్రజల సమస్యలను తెలుసుకోడానికో, వారి సామాజిక, ఆర్థిక, కుటుంబ పరిస్థితులను తెలుసుకోడానికో సర్వేలు చేయడం మామూలు. కానీ, చాలా అసాధారణమైన రీతిలో విహెచ్‌పి ఉత్తరాంధ్ర విభాగం ఒక సర్వేను చేపట్టింది. ఇది చాలా గోప్యంగా జరుగుతోంది. ఆ సర్వే పత్రం లభించింది. దానిని పరిశీలిస్తే ఈ సర్వే లక్ష్యం గ్రామాల వారీగా క్రైస్తవులు ఎందరు ఉన్నారో, ముఖ్యంగా దళితవాడల్లో క్రైస్తవులు ఎందరు ఉన్నారో గుర్తించడమేనని స్పష్టమవుతోంది. దానితోపాటు ఆ గ్రామంలో క్రైస్తవ వ్యతిరేకులు ఎవరెవరు ఉన్నారన్న వివరాలను కూడా ఆరా తీస్తున్నారు. విహెచ్‌పి గత చరిత్ర, అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే అప్రమత్తం కావాలని, ఇటువంటి సర్వేలను నిషేధించాలని, గ్రామాల్లో ప్రజల మధ్య ఉన్న సామరస్య వాతావరణాన్ని కాపాడాలని పలువురు ప్రజాస్వామ్యవాదులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బోర్డర్లపై ఏఐ ఆధారిత రోబోల నిఘా..

న్యూఢిల్లీ: అంతర్జాతీయ సరిహద్దుల వద్ద భద్రతను నిర్వహించడానికి అసోంలోని గువహతి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) పరిశోధకులు అధునాతన రోబోలను అభివృద్ధి చేశారని అధికారులు వెల్లడించారు. అత్యంత సవాళ్లతో కూడిన అంతర్జాతీయ సరిహద్దులను నిరంతరం పర్యవేక్షించడానికి ఈ ఏఐ ఆధారిత నిఘాతో ప్రయోజనం ఉంటుందని తెలిపారు. ఐఐటీ గువహతి లోని డీఏ స్పాటియో రోబోటిక్ లాబొరేటరీ ప్రయివేట్ లిమిటెడ్ (డీఎస్ఆర్ఎల్) అనే స్టార్టప్ అభివృద్ధి చేసిన ఈ రోబోలు రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ నుంచి గుర్తింపు పొందినట్లు తెలుస్తోంది. భారత సైన్యం ఇప్పటికే ఈ నిఘా వ్యవస్థ కోసం ఫీల్డ్ ట్రయల్స్ నిర్వహిస్తున్నట్టు అధికారులు పేర్కొన్నారు.డీఎస్ఆర్ఎల్ సీఈఓ అర్నబ్ కుమార్ బర్మాన్ మాట్లాడుతూ.. మనుషుల గస్తీపై ఆధారపడే సంప్రదాయ భద్రతా చర్యలకు భిన్నంగా ఈ రోబోలు స్వయంప్రతిపత్తి వ్యవస్థను కలిగి ఉంటాయన్నారు. ఇవి అన్ని వాతావరణ పరిస్థితుల్లో సమర్థవంతంగా పని చేస్తాయని తెలిపారు. "నావిగేషన్, ఏఐ-ఆధారిత నిఘాతో కూడిన ఈ వ్యవస్థ సరిహద్దు రక్షణ, కీలకమైన మౌలిక సదుపాయాల నిఘా, వ్యూహాత్మక రక్షణ విషయాల్లో ఓ విప్లవాత్మక మార్పుకానుంది. జాతీయ, అంతర్జాతీయ భద్రత విషయంలో ఎదురవుతున్న సవాళ్లను తట్టుకోవడానికి ఏఐ ఆధారిత అత్యాధునిక నిఘా పరికరాలను అభివృద్ధి చేయాలనేదే మా లక్ష్యం" అని పేర్కొన్నారు.దుండగులు అంతర్జాతీయ సరిహద్దుల్లో డ్రోన్‌లను పంపడం, చొరబాట్లకు ప్రయత్నించడం వంటివి చేస్తే ఈ రోబోల సెన్సర్లు వెంటనే గుర్తించి అలర్ట్ చేస్తాయని అన్నారు. ఈ విధంగా రక్షణ జాతీయ భద్రతను బలోపేతం చేసే మరిన్ని ఆవిష్కరణలు చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు.



ఎగువ శెంబిలోని గిరిజనుల సాగు భూముల్లో మైనింగ్ తవ్వకాల కోసం ఒడిశా అధికారులు పాతిన స్తంభాలు

ఒడిశా అధికారుల దుందుడుకుతనం

- వివాదాస్పద కొటియా గ్రామాల్లో మైనింగ్ తవ్వకాలకు చర్యలు
- ఎగువ శెంబి పంట భూముల్లో మార్కింగ్
- గిరిజనులు వ్యతిరేకించినా పోలీసులతో దౌర్జన్యం
- చోద్యం చూస్తోన్న మన రాష్ట్ర ప్రభుత్వం

సాలూరు : కొటియా గ్రామాల విషయంలో ఒడిశా ప్రభుత్వం మళ్లీ కయ్యానికి కాలు దువ్వుతున్న పరిస్థితి కనిపిస్తోంది. వివాదాస్పద సరిహద్దు గ్రామాల్లో దూకుడు పెంచింది. కొటియా గ్రామాలను అనుసంధానం చేస్తూ రోడ్ల నిర్మాణం చేపడుతోంది. అయితే, ఈ ప్రాంతాల్లో మన రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాలను అడ్డుకుంటోంది. తాజాగా ఎగువ శెంబిలోని గిరిజనుల సాగు భూముల్లో మైనింగ్ తవ్వకాలకు ఒడిశా అధికారులు స్తంభాలు పాతారు. గతంలో గంజాయిభద్రలో అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని ధ్వంసం చేయడం, మన రాష్ట్ర వైద్య సిబ్బందిని కొటియా గ్రామాల్లోకి రానీయకుండా అడ్డుకోవడం, విద్యుత్ మీటర్ల బిగింపు చర్యలను ఆటంకపర్చడం వంటి చర్యలకు పాల్పడ్డారు. ఇటీవల దూళిభద్రలో జలజీవన్ మిషన్ కింద వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. సిమెంట్‌తో సహా ఇతర నిర్మాణ సామగ్రిని, దిగువ శెంబిలో అంగన్‌వాడీ కేంద్రం నుంచి పుస్తకాలను, ఆట వస్తువులను కొటియా పోలీసులు, అధికారులు దౌర్జన్యంగా తీసుకుని వెళ్లిపోయారు. ఒడిశా దూకుడుగా వెళ్తుంటే మన రాష్ట్ర ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వైసిపి ప్రభుత్వం అనుసరించిన వైఖరినే నేటి టిడిపి కూటమి ప్రభుత్వం కూడా అనుసరిస్తుండడంతో గిరిజనుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

వివాదాస్పద కొటియా గ్రామాల్లో ఒకటైన ఎగువ శెంబి సమీపాన ఉన్న కొండపై మైనింగ్ తవ్వకాలకు ఒడిశా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొండ చుట్టూ గిరిజనుల సాగులో ఉన్న భూముల్లో మైనింగ్ తవ్వకాలకు సిద్ధమవుతోంది. ఈ గ్రామానికి చెందిన తాడంగి సనుము, తాడంగి రాజు అనే గిరిజన రైతుల భూముల్లో సరిహద్దు రాళ్లు పాతింది. దీన్ని గ్రామానికి చెందిన గిరిజనులు వ్యతిరేకించినా పోలీసులతో దౌర్జన్యంగా భూముల్లో మార్కింగ్ చేశారు. ఈ భూములవైపు రావద్దని గిరిజనులను ఒడిశా పోలీసులు, అధికారులు హెచ్చరిస్తున్నారు. గ్రామ సమీపంలో ఉన్న కొండలో విలువైన ఖనిజం ఉన్నట్లు ఒడిశా ప్రభుత్వం చాలా సంవత్సరాల క్రితం నిర్ధారించింది. ఈ కొండ పక్కన ఉన్న భూములను సాగు చేస్తున్న రైతులకు మన ప్రభుత్వం గతంలో పట్టాలు ఇవ్వడంతో ఒడిశా ప్రభుత్వం ఇంతవరకు ఈ ప్రాంతంలో మైనింగ్ తవ్వకాల పనులు చేపట్టలేక పోయింది.

టిడిపి కూటమి ప్రభుత్వ వైఖరిపై అనుమానాలు

మన రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు దాటింది. గడిచిన పది నెలల్లో ఒడిశా ప్రభుత్వం కొటియా గ్రామాల్లో అనేక దుందుడుకు చర్యలకు పాల్పడినా మన ప్రభుత్వం నుంచిగానీ, పార్వతీపురం మన్యం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల నుంచిగానీ ఏ విధమైన స్పందనా లేదు. గత ప్రభుత్వ హయాంలో ఒడిశా దురాగతాలను అప్పటి మంత్రి రాజన్నదొర ఖండించడమో, తప్పు పట్టడమో చేశారు. ప్రస్తుత గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి... కొటియా గ్రామాల విషయంలో నోరు మెదపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒడిశాలో బిజెపి ప్రభుత్వం అధికారంలో ఉంది. మన రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమి అధికారంలోకి వచ్చింది.